www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం | 24-1-2024 | పేజీలు: 14 | వెల (Price): Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 279
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్థి రా. 9.51 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: పునర్వసు పూర్తి; వర్జ్యం: రా. 7.22 నుంచి 9.05 వరకు; దుర్ముహూర్తం: మ. 12.05 నుంచి 12.50 వరకు; అమృతఘడియలు: తె. 5.42 మొదలు; రాహుకాలం: మ. 12.00 నుంచి 1.30 వరకు; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.02
హైదరాబాద్ సిటీ *
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న

2

సామాజిక సమానత్వానికి కృషి చేసిన నేతకు మరణానంతరం దేశ అత్యున్నత పౌర పురస్కారం

బిహార్‌లో మొట్టమొదటి కాంగ్రెసేతర సీఎం ఠాకూర్.. ఆయన హయాంలో విప్లవాత్మక నిర్ణయాలు

రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధం, బీసీలకు రిజర్వేషన్.. విద్య, ఉద్యోగాలు, సాగు రంగాల్లో సంస్కరణలు

లాలూ, ములాయం, నితీశ్‌కు గురుతుల్యుడు.. రెండు సార్లు సీఎం అయినా సొంత ఇల్లు, కారు లేని వైనం

భారత సామాజిక-రాజకీయ ముఖచిత్రంపై ఆయనది చెరగని ముద్ర: ప్రధాని మోదీ

'బహుజన భారత' బాంధవుడు!

కర్పూరీ ఠాకూర్ శత జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ప్రత్యేక వ్యాసం 4

ఎన్నికలకు ముందస్తు షెడ్యూలు?

బడ్జెట్ సమావేశాల తర్వాత ఎప్పుడైనా విడుదల!

ఏప్రిల్‌లోనే సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తి

నిర్వహణకు శరవేగంగా ఎన్నికల కమిషన్ సన్నాహాలు

రామమందిరం నుంచి ప్రజల దృష్టి మరలిపోకముందే ఎన్నికలకు..

భారతీయ జనతా పార్టీ యోచన

ఫిబ్రవరి, మార్చిలో దేశవ్యాప్తంగా పర్యటించనున్న ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు ఈసారి ముందుగానే వస్తాయన్న ఊహాగానాలు నిజమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. 2019 ఎన్నికలతో పోలిస్తే.. ఈసారి ఎన్నికల షెడ్యూలును కూడా ముందుగానే విడుదల చేసే ప్రయత్నాల్లో ఎన్నికల కమిషన్ ఉన్నట్లు తెలుస్తోంది. పలు రాష్ట్రాల్లో తుది ఓటర్ల జాబితాను జనవరి 22న కాకుండా 23న విడుదల చేస్తున్నారు. ఆ తర్వాత షెడ్యూలు ప్రకటించేందుకు శరవేగంతో కసరత్తు చేస్తున్నట్లు ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. ఈ మేరకు అశోకా రోడ్‌లోని కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో సిబ్బంది రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. మరో వైపు ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఈ నెల 11న వివిధ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి చర్చలు పూర్తి చేసింది. ఈవీఎంలు, ఓటర్ల జాబితా ప్రకటన, ఎన్నికల ఖర్చు పర్యవేక్షణపై వారితో సుదీర్ఘంగా చర్చించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల షెడ్యూలు ఎప్పుడు

మిగతా 13వ పేజీలో...

రేవంత్‌ను కలిసిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

సీఎం ఇంటికెళ్లిన సునీత, ప్రభాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు

పార్టీ మార్పుపై ఊహాగానాలు ఖండించిన ఎమ్మెల్యేలు..

ప్రొటోకాల్ కోసమేనని వివరణ 13

పట్నం మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతున్నారంటూ ప్రచారం



వజ్రాలు పొదిగిన బంగారు వాచ్!

ఏపీ కీలక న్యాయమూర్తికి జగన్ 'కానుక'

రూ.2 కోట్ల విలువైన బ్రాండెడ్ రిస్ట్ వాచ్

టీటీడీ ధర్మారెడ్డి, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి తెగింపు

తిట్టి, విసిరి కొట్టిన న్యాయమూర్తి

ఆ ఇద్దరిపై సుప్రీంకోర్టుకు అప్పుడే ఫిర్యాదు

2021లో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

ఉత్తరాదిలో జడ్జి కుటుంబ సభ్యుడి వివాహం

పిలవని పేరంటానికి ధర్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

గెస్ట్ హౌస్‌లో జడ్జిని కలిసి ప్రలోభాల వల

జగన్ తీరుపై న్యాయవాద వర్గాల్లో చర్చ

(న్యూఢిల్లీ - ఆంధ్రజ్యోతి)

'డబ్బుతో కొడితే ఎవరైనా పడిపోతారు! చివరికి, న్యాయ వ్యవస్థను కూడా మేనేజ్ చేసేయొచ్చు!'... ఇది ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నమ్మే సిద్ధాంతం! కానీ... అన్నిసార్లూ డబ్బు పని చేయదు. నిజాయితీ, నిబద్ధత ఉన్న వాళ్ల ముందు అస్సలు పని చేయదు. ఒక కీలక న్యాయమూర్తిని 'ఖరీదైన బహుమతి'తో మంచి చేసుకునేందుకు జగన్ శిబిరం చేసిన ప్రయత్నం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ అంశం ఇప్పుడు న్యాయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కీలకమైన న్యాయమూర్తి కుటుంబ సభ్యుడి వివాహం... ఉత్తరాదిలోని ఒక రాష్ట్రంలో

మిగతా 3వ పేజీలో...

బడ్జెట్ సమావేశాలు 14 నుంచి!

1న కేంద్ర ప్రభుత్వ ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్

దాన్ని చూసి రాష్ట్ర బడ్జెట్‌కు తుదిరూపం

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలకు ఈసారి పెద్దపీట

ఆ పథకాలకు ప్రత్యేకంగా నిధుల కేటాయింపు!

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మరోసారి వాడీ వేడి చర్చ!

మొదటి సమావేశాల్లో శ్వేతపత్రాలతో సంచలనం

ఫిబ్రవరి నుంచే ఉచిత విద్యుత్తు

కేసీఆర్ నిర్వాకం వల్లే హామీల అమలులో జాప్యం

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటూ రాదు

కాంగ్రెస్‌కు 13 నుంచి 14 సీట్లు

ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ బడ్జెట్ సమావేశాలను ఫిబ్రవరిలోనే నిర్వహించడానికి సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 14 నుంచి సమావేశాలను ప్రారంభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. సాధారణంగా కేంద్ర బడ్జెట్‌లో తమకు మంజూరైన గ్రాంట్లు, స్పెషల్ గ్రాంట్లను పరిశీలించిన అనంతరం రాష్ట్రాలు తమ బడ్జెట్‌లను ప్రవేశపెడుతుంటాయి. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈసారి 'ఓట్-ఆన్-అకౌంట్' బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనుంది. దీంతో కేంద్ర బడ్జెట్‌ను చూసిన తర్వాతే రాష్ట్ర బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. అయితే.. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌నే ప్రవేశపెడుతుందా, లేక పూర్తి స్థాయి బడ్జెట్‌ను పెడుతుందా అన్నది తెలియాల్సి ఉంది. ఒకవేళ పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడితే.. ఎక్కువ రోజులు సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఉంటుంది. ప్రస్తుత సర్కారు కూడా బడ్జెట్‌పై అన్ని పార్టీలకు మాట్లాడే అవకాశం కల్పిస్తూ పూర్తి స్థాయిలో చర్చ జరగాలని

మిగతా 13వ పేజీలో...



సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డితో కలిసిన కొరియా కంపెనీ ప్రతినిధులు

రూ.5 వేల కోట్ల పెట్టుబడులు!

హైదరాబాద్‌లో దేశంలోనే తొలి కాస్మెటిక్ హబ్ ఏర్పాటు 13

కొరియా కంపెనీ దూసన్ ప్రకటన

7 వేల మందికి ఉపాధి అవకాశం

కోమటిరెడ్డితో ప్రతినిధుల భేటీ



బర్పెటలో కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

రాహుల్‌పై కేసు

అసోం సీఎం హిమంత ఆదేశాలతో నమోదు

రాహుల్ పాదయాత్ర మార్గంలో బారికేడ్లు

వాటిని ఛేదించుకుని వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

ఇది అసోం సంస్కృతి కాదని మండిపడ్డ సీఎం 2



సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపాలిటీలో అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు

భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో నెగ్గిన తీర్మానాలు 12

అవినీతి ఆరోపణలు చేస్తూ పెట్టిన కౌన్సిలర్లు

కొత్తగూడెంలో అవిశ్వాసానికి కలెక్టర్‌కు వినతి

మీర్‌పేటలోనూ ప్రవేశపెట్టేందుకు సన్నద్ధం



అవిశ్వాసాలకు వ్యతిరేకంగా అప్పీళ్లు

హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన మునిసిపల్ చైర్‌పర్సన్లు 12

ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన కోర్టు

ప్రతిపక్షాలకు 'బాలరాముడి' భయం!

అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠకు ప్రజల్లో అనూహ్య స్పందన 2

దీనిపై విమర్శలు చేస్తే తమపై మరింత వ్యతిరేకత వస్తుందన్న ఆందోళనలో ఇండియా కూటమి

భవిష్యత్తు కార్యాచరణపై నేతల సమాలోచనలు



మంగళవారం అయోధ్య రామాలయం వద్ద కిటకిటలాడుతున్న భక్తులు

తొలిరోజే 5 లక్షల మంది!

అయోధ్య రాముడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

సోమవారం అర్ధరాత్రి నుంచే క్యూలోకి ప్రవేశం

కిక్కిరిసిన 13 కిలోమీటర్ల పొడవైన రామ్ పథ్

ప్రధాన ద్వారం వద్ద పతాక స్థాయికి చేరిన రద్దీ

అదుపు చేయలేక భద్రతా సిబ్బంది ఉక్కిరిబిక్కిరి

ఎనిమిది వేలమందికి పైగా పోలీసులతో బందోబస్తు

ఏర్పాట్లను పరిశీలించిన సీఎం యోగి ఆదిత్యనాథ్

అయోధ్య, జనవరి 23: అయోధ్య భక్తజన సంద్రంగా మారింది. బాలరాముడి దర్శనం కోసం దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో వీధులన్నీ కిటకిటలాడుతున్నాయి. మంగళవారం ఒక్కరోజే రామయ్యను దాదాపు 5లక్షల మంది దర్శించుకున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. సోమవారం ప్రాణప్రతిష్ఠ అనంతరం వీఐపీలు మాత్రమే స్వామివారిని దర్శించుకోగా, మంగళవారం ఉదయం నుంచి సామాన్య భక్తులకు దర్శనానికి ట్రస్ట్ అధికారులు గేట్లు తెరిచారు. ఈ విషయాన్ని ముందుగానే ప్రకటించడంతో సోమవారం

మిగతా 2వ పేజీలో...

అమెరికాలో ఉద్యోగాల ఊచకోత

2022తో పోలిస్తే 2023లో 98% అధికం.. ఐటీ రంగంలో ఆ సంఖ్య 73శాతం ఎక్కువ

రిటైల్ రంగంలో ఏకంగా 274శాతం అధికం.. జాబ్ మార్కెట్‌పై వడ్డీరేట్లు, ద్రవ్యోల్బణ ప్రభావం

చాలెంజర్ గ్రే అండ్ క్రిస్మస్ నివేదికలో వెల్లడి.. ఈ ఏడాదీ భారీ కోతలుండొచ్చని అంచనా

2022 చివరి త్రైమాసికంలో రెండు లక్షల మందిని తొలగించిన అమెరికా ఐటీ సంస్థలు

వారిలో దాదాపు 80 వేల మంది భారతీయులే.. వారు ఇక్కడికి వచ్చినా దొరకని అవకాశాలు

న్యూయార్క్, జనవరి 23: అగ్రరాజ్యం అమెరికాలో ఉద్యోగ మార్కెట్‌ను అధిక వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం దారుణంగా దెబ్బతీస్తున్నాయి! ఈ రెండింటి దెబ్బకూ కంపెనీలు భారీగా ఉద్యోగులను తొలగిస్తున్నాయి!! గణాంకాల్లో చెప్పాలంటే.. 2022తో పోలిస్తే 2023లో అమెరికాలో ఉద్యోగాల కోత 98% పెరిగింది. ద్రవ్యోల్బణం, ఫెడరల్ వడ్డీ రేట్ల పెంపు పరిస్థితుల్లో ఏ మాత్రం మార్పు లేని నేపథ్యంలో.. ఈ ఏడాది కూడా ఉద్యోగాల ఊచకోత కొనసాగే ప్రమాదం ఉందని అమెరికాకు చెందిన ప్రముఖ స్టాఫింగ్ సంస్థ చాలెంజర్, గ్రే అండ్ క్రిస్మస్ ఒక నివేదికలో

మిగతా 2వ పేజీలో...



కెనడా వీసా కట్

నిబంధనల్లో మార్పులు

35 శాతం తగ్గనున్న విద్యార్థుల వీసాల సంఖ్య

భారతీయ విద్యార్థులకు కష్టకాలం 2

కెనడాలోని విదేశీ విద్యార్థుల్లో 40 శాతం మనోళ్లే

2013 నుంచి 260% పెరిగిన భారత విద్యార్థులు

మాల్దీవులకు చైనా నిఘా నౌక!

8న మాలే చేరనున్న షియాన్ యాంగ్ హోంగ్-3 2

సిబ్బంది రొటేషన్, ఇతర అవసరాలకేనన్న మాల్దీవులు

మిత్ర దేశ వాహనాలకు ఆహ్వానం ఉంటుందని వ్యాఖ్య

హిందూ మహా సముద్రంలో చర్చనీయాంశమైన కదలిక

పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని భారత్ వెల్లడి



అమెరికాలో ఉద్యోగాల ఊచకోత

(మొదటి పేజీ తరువాయి)



హెచ్చరించింది. దాని ప్రకారం.. 2022లో అమెరికా కంపెనీలు 3,63,832 మంది ఉద్యోగులను తొలగించగా.. 2023లో ఆ సంఖ్య ఏకంగా 7,21,677కు చేరింది. గత ఏడాది ఉద్యోగాలు కోల్పోయిన ఏడు లక్షల మందిలో 1,68,032 మంది.. అమెజాన్, గూగుల్, మెటా వంటి దిగ్గజ సంస్థల ఉద్యోగులే కావడం గమనార్హం. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఈ సంఖ్య 73 శాతం అధికం కావడం ఆందోళనకరం. 2023లో అమెజాన్ 16 వేల మందికిపైగా.. అల్ఫాబెట్ (గూగుల్ మాతృసంస్థ) 12 వేల మందిని.. మైక్రోసాఫ్ట్ 11 వేల మందికి పైగా.. మెటా 10 వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించాయి. 2001అలో అమెరికా టెక్ కంపెనీలు అత్యధికంగా 1,68,395 మందిని ఉద్యోగాల నుంచి తొలగించాయి (వై2కే సమస్య పరిష్కారం కోసం అంతకు ముందు లెక్కకు మిక్కిలిగా చేర్చుకున్న వారందరినీ 2001లో తొలగించుకున్నాయి). మళ్లీ ఆ తర్వాత.. అంటే 22 సంవత్సరాల తర్వాత ఒకే ఏడాది 1.6 లక్షల మంది ఉద్యోగాలకు కోత పెట్టడం ఇదే. అలాగే అమెరికా రిటైల్ రంగంలో గత ఏడాది 78,840 మంది ఉద్యోగాలు కోల్పోయారు. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే.. ఇది 274 శాతం అధికం. కృత్రిమ మేధ ప్రభావం నానాటికీ పెరుగుతున్నందున టెక్నాలజీ రంగంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటాయని.. ఫలితంగా పలు కంపెనీలు తమ వనరులను పునర్వ్యవస్థీకరించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడి, ఉద్యోగాలు పోతాయని చాలెంజర్ గ్రే అండ్ క్రిస్మస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆండీ చాలెంజర్ అభిప్రాయపడ్డారు. ఉద్యోగాల కోతకు ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు వంటి కారణాలే కాదు.. 2019-2022 నడుమ వేగంగా జరిగిన వృద్ధి నేపథ్యంలో పలు కంపెనీలు విస్తృతంగా నియామకాలు చేపట్టాయి. ఈ-కామర్స్ కంపెనీలు కొవిడ్ సమయంలో వినియోగదారుల డిమాండ్‌ను తట్టుకోవడానికి భారీగా ఉద్యోగులను నియమించుకున్నాయి. కానీ, 2022 ద్వితీయ త్రైమాసికం నుంచి మళ్లీ మునుపటి పరిస్థితులు ఏర్పడడంతో ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ఉద్యోగులను తొలగిస్తున్నాయి.

ఇక్కడికొస్తే మరీ ఘోరం

ఉద్యోగ వీసాలతో అమెరికాకు వెళ్లి.. అక్కడ కొలువులు కోల్పోయి భారత్‌కు తిరిగి వస్తున్నవారి పరిస్థితి దారుణంగా ఉంటోంది. ఉదాహరణకు.. దీపక్ అనే వ్యక్తి ఇక్కడే ఆరేళ్లపాటు అమెజాన్‌లో ఉద్యోగం చేసి 2022 జూన్‌లో అంతర్గత బదిలీల్లో భాగంగా అమెరికాకు వెళ్లాడు. కంపెనీ అక్కడ అతడికి ఏడాదికి 1.6 లక్షల డాలర్ల వార్షిక వేతనం (మన కరెన్సీల్లో దాదాపు రూ.1.3 కోట్లు), షేర్లు కూడా ఇచ్చేది. కానీ, 2023 జనవరిలో అమెజాన్ చేపట్టిన భారీ కోతలో 18 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఆ 18 వేల మందిలో దీపక్ కూడా ఒకరు. చేసేది లేక భారత్‌కు తిరిగి వచ్చేసిన అతడు.. రెండు నెలలపాటు ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉండాల్సి వచ్చింది. ఎట్టకేలకు అతడు రూ.30 లక్షల వార్షిక వేతనానికే ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. 2022 నవంబరు నుంచి 2023 జనవరి నడుమ అమెరికాలో 2 లక్షల మంది ఉద్యోగులపై వేటు పడింది. అందులో 80 వేల మంది భారతీయ ఐటీ ఉద్యోగులే. కాగా, భారత్‌లో పరిస్థితి కూడా అంత బాగోలేదు. భారతదేశంలోని టెక్ కంపెనీలు 2022లో 30 వేల మంది, 2023లో 28 వేల మంది ఉద్యోగులను తొలగించాయి. 2021లో మనదేశంలోని టెక్ కంపెనీలు తొలగించిన ఉద్యోగుల సంఖ్య కేవలం 4,080 కావడం గమనార్హం.

లోకం తీరు



'సీట్ లీవింగ్ బాండ్'ను వదిలేయండి

» రాష్ట్రాలకు ఎన్ఎంసీ సూచన

న్యూఢిల్లీ, జనవరి 23: పీజీ సీట్లను వదలేసుకుంటున్న మెడికోల వ్యవహారంపై పునరాలోచించాలని, 'సీట్ లీవింగ్ బాండ్' పాలసీని వదిలి వేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) సూచించింది. అదేవిధంగా వైద్య విద్యా కళాశాలల్లో విద్యార్థులకు స్నేహ, సహాయపూరిత వాతావరణాన్ని కల్పించాలని కోరింది. సీట్ లివింగ్ బాండ్‌తో విద్యార్థులు.. కోర్సును మధ్యలో వదిలేయలేక, ఒత్తిడితో కొనసాగలేక మానసికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నారని పేర్కొంది. రెండుమూడేళ్లుగా వైద్య విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్న విషయాన్ని గుర్తుచేసింది. ఈ మేరకు ఎన్ఎంసీకి చెందిన యాంటీ ర్యాగింగ్ కమిటీ ఇటీవల పలు సూచనలతో కూడిన లేఖను అన్ని రాష్ట్రాలకు పంపించింది. "విద్యార్థులకు అమలు చేస్తున్న 'సీట్ లీవింగ్ బాండ్' పాలసీని వదిలేయండి. దీని స్థానంలో మీమీ రాష్ట్రాల్లోని వైద్య విద్యా కళాశాలల్లో సదరు విద్యార్థులను ఏడాది పాటు చేర్చుకోకుండా డీబార్ చేయండి" అని సూచించింది. ప్రస్తుతం వైద్య విద్యలో సీట్లకు కొదవ లేదని, కాబట్టి సీటు పోతుందనే భావన సరికాదని పేర్కొంది. సీట్ లీవింగ్ బాండ్.. అనేది వైద్య విద్యార్థులకు సంబంధించిన సాధారణ ఒప్పందం. సీట్లు వృథా కాకుండా ఉండేందుకు ఈ బాండ్ అమలు చేస్తున్నారు. ఉదాహరణకు.. ఎవరైనా ఒక విద్యార్థి వైద్య కళాశాలలో సీటు పొంది మధ్యలో వదిలేస్తే.. ఆ సీటు వృథా అయిపోతుంది. సీటు కావాలనుకున్న మరో విద్యార్థికి అన్యాయం జరుగుతుంది. అయితే, బాండ్ ఉండటం వల్ల విద్యార్థి కోర్సు పూర్తయ్యేదాకా కొనసాగాల్సి ఉంటుంది. ఒకవేళ కాదనుకుని మధ్యలోనే బయటకు వస్తే రూ.లక్షల్లో పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది.

దేశానికి స్వాతంత్ర్యం గాంధీ వల్ల రాలేదు

» సుభాస్‌చంద్రబోసే జాతిపిత

» తమిళనాడు గవర్నర్ వ్యాఖ్యలు



చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భారతదేశానికి స్వాతంత్ర్యం గాంధీజీ ఉద్యమం వల్ల రాలేదని, నేతాజీ సుభాస్‌చంద్రబోస్ పోరాటం కారణంగానే స్వాతంత్ర్యాన్ని సముపార్జించుకున్నామని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. స్థానిక అడయార్‌లోని అన్నా విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉదయం నిర్వహించిన నేతాజీ జయంతి వేడుకల సభలో ఆయన చాన్సలర్ హోదాలో ప్రసంగిస్తూ.. 'నేతాజీ ఇండియన్ నేషనల్ ఫోర్స్' పేరుతో సైనికదళం తెల్లదొరలకు సింహస్వప్నంగా ఉండేదని, సుభాస్ చంద్రబోసే మన జాతిపిత అని పేర్కొన్నారు. ఆంగ్లేయులు జాతీయ కాంగ్రెస్ ఉద్యమం వల్ల భారతదేశాన్ని విడిచివెళ్లలేదని బ్రిటన్ ప్రధాని అట్లీ గతంలో పేర్కొన్నారని గవర్నర్ రవి గుర్తు చేశారు. ముస్లిం నాయకుల అభీష్టం ప్రకారమే దేశ విభజన జరిగిందన్నారు. నేతాజీ జయంతి సందర్భంగా గవర్నర్ రవి తన 'ఎక్స్' పేజీలో వెలువరించిన ఓ సందేశంలో .. భారత సైన్యానికి సమర్థవంతమైన నేతృత్వం వహించి, ఆంగ్లేయులను ఎదురొడ్డి పోరాడి, వారి సైనికబలానికి సవాలు విసిరిన మహాదీర్ఘదర్శి, విప్లవవీరుడు నేతాజీ సుభాస్‌చంద్రబోస్ అని, ఆ త్యాగశీలిని భారతీయులంతా స్మరించుకోవాలని పేర్కొన్నారు.

మాల్దీవులకు చైనా నిఘా నౌక!

మాలె, జనవరి 23: భారత్‌తో దౌత్య వివాదం నడుస్తున్న వేళ మాల్దీవుల ప్రభుత్వం తాజాగా మరోసారి రెచ్చగొట్టే చర్యకు పూనుకొంది. హిందూ మహా సముద్రంలోని తమ తీర జలాల్లో చైనా నిఘా నౌకను నిలిపేందుకు అనుమతిచ్చింది. సిబ్బంది రొటేషన్, ఇతర అవసరాలకోసమే ఈ నౌకకు ఆశ్రయం ఇస్తున్నామని.. మిత్ర దేశాలకు చెందిన వాహనాలను ఎల్లప్పుడూ స్వాగతిస్తామని వ్యాఖ్యానించింది. చైనా నుంచి బయల్దేరిన ఈ నౌక ఫిబ్రవరి 8న మాల్దీవులకు చేరుకోనుంది. ఇటీవల భారత ప్రధాని మోదీపై మాల్దీవులకు చెందిన ముగ్గురు మంత్రులు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అంతకుముందు ఆ దేశాధ్యక్షుడు ముయిజ్జు మాల్దీవుల నుంచి భారత సైన్యాన్ని వెళ్లిపోవాల్సిందిగా కోరారు. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఇప్పుడు ఏకంగా చైనాకు చెందిన నిఘా నౌక షియాన్ యాంగ్ హాంగ్-3ను మాల్దీవులు అనుమతించింది. భారత్‌లోని కొన్ని ప్రాంతాలు, నౌకాశ్రయాలు, గగనతలంపైనే కాక అణు ప్లాంట్లపైనా ఓ కన్నేసి ఉంచగల అధునాతన పరికరాలతో కూడిన ఇలాంటి నౌకను చైనా గత ఏడాది శ్రీలంక తీరంలో నిలిపేందుకు ప్రయత్నించగా భారత్ అభ్యంతర పెట్టింది. దీంతో అనుమతి లభించలేదు. కాగా, 2019లో భారత జలాల్లోకి చైనా నౌక అక్రమంగా ప్రవేశించగా.. దానిని భారత దళాలు వెనక్కుపంపాయి. షియాన్ యాంగ్ హాంగ్-3ను నిఘా నౌకగా చూడొద్దని భారత్‌ను చైనా కోరింది.

కెనడా వీసా కట్.. నిబంధనల్లో మార్పులు

న్యూఢిల్లీ, జనవరి 23: కొత్తగా వచ్చే విదేశీ విద్యార్థుల వీసాలపై రెండేళ్ల పరిమితి విధిస్తున్నట్టు కెనడా ప్రభుత్వం ప్రకటించింది. దేశంలో పెరుగుతున్న ఇళ్ల సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు, సంస్థాగతంగా వక్రమార్గాలు అనుసరించేవారికి చెక్ పెట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు మంగళవారం వెల్లడించింది. ఉన్నత విద్యకోసం కెనడా వెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించుకున్న భారతీయ విద్యార్థులపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపనుంది. కెనడాలో ఇంటి అద్దెలు, ఆహార పదార్థాల ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో జస్టిన్ ట్రూడో ప్రభుత్వం వీసా నిబంధనలను మార్చింది. కెనడాలోని విదేశీ విద్యార్థుల్లో అత్యధికులు భారతీయులే. ప్రస్తుతం 2.3 లక్షల మంది భారతీయ విద్యార్థులు కెనడాలో వివిధ కోర్సులను అభ్యసిస్తున్నారు. విదేశాల్లో చదువుకోవాలనుకునే భారతీయ విద్యార్థుల తొలి ప్రాధాన్యంగా కెనడా ఉంది. 2013లో భారత్ నుంచి 32,827 మంది విద్యార్థులు మాత్రమే కెనడాకు వెళ్లగా, 2022లో ఈ సంఖ్య 1,18,095కు పెరిగింది. కెనడాలో ఉన్న విదేశీ విద్యార్థుల్లో 40 శాతానికిపైగా భారతీయులేనని విదేశీ వార్తా సంస్థ ఒకటి పేర్కొంది. తాజా నిర్ణయంతో 2024 సంవత్సరంలో జారీ చేసే విద్యా వీసాల సంఖ్య 35% తగ్గనున్నట్టు కెనడా ఇమ్మిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ చెప్పారు. గతేడాది 5.60లక్షల మంది విదేశీ విద్యార్థులకు వీసాలు జారీ చేయగా, ఈ ఏడాది ఆ సంఖ్య 3.64లక్షలకు పరిమితం కానున్నట్టు తెలిపారు. అయితే, ఈ పరిమితి రెండేళ్లే ఉంటుందని చెప్పారు.

భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లేకపోవడం హాస్యాస్పదం: మస్క్

న్యూయార్క్, జనవరి 23 : ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి(యూఎన్ఎస్సీ)లో భారతదేశ సభ్యత్వంపై అపర కుబేరుడు ఎలాన్ మస్క్ స్పందించారు. ఈ భూమి మీద అత్యంత ఎక్కువ జనాభా కలిగిన దేశమైన భారత్‌కు యూఎన్ఎస్సీలో శాశ్వత సభ్యత్వం లేకపోవడం హాస్యాస్పదమని అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్య సమితిలోని వ్యవస్థలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆఫ్రికాకు చెందిన ఒక్క దేశానికీ యూఎన్ఎస్సీలో శాశ్వత సభ్యత్వం లేకపోవడం ఎంత వరకు ఆమోదయోగ్యం అంటూ? భద్రతా మండలి జనరల్ ఆంటోనియో గుటెరెస్.. ఎక్స్(ట్విటర్)లో ఓ పోస్ట్ పెట్టారు. నేటి ప్రపంచానికి అనుగుణంగా వ్యవస్థల్లో మార్పులు చేర్పులు జరగాలని పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌కు చెందిన పెట్టుబడిదారు మైకేల్ ఐసెన్‌బర్గ్ ఈ పోస్ట్‌కు స్పందిస్తూ భద్రతా మండలిలో భారత్ ప్రాతినిధ్యం అంశాన్ని ప్రస్తావించారు. ఐసెన్‌బర్గ్ పోస్ట్‌కు స్పందించిన మస్క్ కూడా భారత్ ప్రాతినిధ్యంపై గొంతు కలిపారు. కాగా, చైనా, ఫ్రాన్స్, రష్యా యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా దేశాలు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ప్రస్తుతం శాశ్వత సభ్య దేశాలుగా ఉన్నాయి.

ఒక్కరోజులో 24 మంది ఇజ్రాయెల్ సైనికుల మృతి

గాజా, జనవరి 23: గాజాలో ఇజ్రాయెల్ సైన్యానికి భారీ నష్టం వాటిల్లింది. సోమవారం ఒక్కరోజే 24 మంది సైనికులను ఐడీఎఫ్ కోల్పోయింది. సెంట్రల్ గాజాలో ఇజ్రాయెల్ ట్యాంకులకు రక్షణ కల్పిస్తున్న జవాన్లే ధ్యేయంగా హమాస్ ప్రయోగించిన ఆర్పీజీ షెల్ దాడుల్లో 18 మంది మృతి చెందినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. ఈ ప్రాంతానికి కొద్ది దూరంలోనే రెండంతస్తుల భవనాన్ని పేల్చేందుకు సైనికులు ప్రయత్నిస్తుండగా ఈ దాడి జరిగిందని, భవనం శిథిలాల కింద చిక్కుకొని మరో ముగ్గురు చనిపోయారని తెలిపింది. సెంట్రల్ గాజాలో ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇంకో ముగ్గురు సైనికులు దుర్మరణంపాలయ్యారని వివరించింది. మరోవైపు గాజాలోని ఖాన్‌యూనిస్ నగరాన్ని తమ దళాలు చుట్టుముట్టాయని ఐడీఎఫ్ మంగళవారం ప్రకటించింది. హమాస్ అగ్రనేత యాహ్యా సిన్వార్ స్వస్థలం ఖాన్‌యూనిస్ కావడం గమనార్హం. ఇదిలా ఉండగా, బందీలను విడిపించేందుకు రెండు నెలలపాటు కాల్పుల విరమణకు సిద్ధమంటూ హమాస్ ముందు ఇజ్రాయెల్ ప్రభుత్వం ఓ ప్రతిపాదనను పెట్టినట్లు ఇజ్రాయెల్ పత్రికలు కథనాలను ప్రచురించాయి.

ఏప్రిల్ 16న లోక్‌సభ ఎన్నికలు?

న్యూఢిల్లీ, జనవరి 23: లోక్‌సభ ఎన్నికలపై ఢిల్లీ ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) జారీ చేసిన ఓ సర్క్యులర్ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 16న జరగొచ్చని, ఏర్పాట్లు చేసుకోవాలంటూ ఆయన ఓ సర్క్యులర్ ద్వారా అధికారులను ఆదేశించారు. దీంతో, సార్వత్రిక ఎన్నికలు ఆరోజే జరుగుతాయని తీవ్ర చర్చ జరిగింది. దీనిపై ఢిల్లీ సీఈవో ట్విటర్‌లో స్పందించారు. ఎన్నికల సంఘం ప్రణాళిక ప్రకారం పోలింగ్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యేందుకు ఈ తేదీని రిఫరెన్స్‌గా మాత్రమే పేర్కొన్నట్లు ఆయన వివరించారు.

సమతా క్రాంతిదర్శికి భారతరత్న

సామాజిక సమానత్వానికి జీవితాంతం కృషి చేసిన కర్పూరీ ఠాకూర్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం



న్యూఢిల్లీ, పాట్నా, జనవరి 23: దేశంలో సామాజిక సమానత్వ రాజకీయాల ఆద్యులలో ఒకరైన బిహార్ మాజీ ముఖ్యమంత్రి, సోషలిస్టు నేత కర్పూరీ ఠాకూర్‌కు కేంద్రప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నను ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇది కర్పూరీ ఠాకూర్ శతజయంతి సంవత్సరం కావటం విశేషం. కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్నను ప్రకటించటంపై ప్రధాని నరేంద్రమోదీ స్పందిస్తూ.. 'నిమ్న వర్గాల అభ్యున్నతి పట్ల కర్పూరీ ఠాకూర్ చూపిన రాజీలేని అంకితభావం, ఆయన దార్శనిక నాయకత్వం భారత సామాజిక-రాజకీయ ముఖచిత్రంపై చెరిగిపోని ముద్ర వేసింది. ఈ పురస్కారం ఆయన కృషిని గౌరవించటానికి మాత్రమే కాదు.. మరింత న్యాయబద్ధమైన, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం కోసం ఆయన చేపట్టిన కర్తవ్యాన్ని ముందుకు తీసుకెళ్లటం కోసం కూడా. ఆ దిశగా మనలో స్ఫూర్తిని నింపటం కోసం ఈ అవార్డు తోడ్పడుతుంది' అని పేర్కొన్నారు. నిరాడంబరతకు, నిస్వార్థానికి, అత్యున్నత విలువలకు నిలువెత్తు ప్రతిబింబం వంటి కర్పూరీ ఠాకూర్ (1924-88) తాను జన్మించిన బిహార్‌లోనే కాదు.. యావత్ ఉత్తరాది ప్రజానీకంపై ప్రభావం చూపిన నేత. అందుకే ఆయనను ప్రజలు ప్రేమతో జన్‌నాయక్ (ప్రజానాయకుడు) అని పిల్చుకునేవారు.

సాధారణ నేపథ్యం నుంచి..

1924 జనవరి 24వ తేదీన బిహార్‌లో సమస్థిపూర్ జిల్లాలోని పితోంఝియా గ్రామంలో నాయీబ్రాహ్మణ సామాజిక వర్గంలో కర్పూరీ ఠాకూర్ జన్మించారు. ఆ రోజుల్లో ఉధృతంగా సాగుతున్న స్వాతంత్ర్యోద్యమం ఆయనను ఆకర్షించింది. ఏఐఎస్ఎఫ్ విద్యార్థిసంఘంలో చేరారు. కాలేజీ చదువులు వదిలిపెట్టి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 1942-45 మధ్య జైలు జీవితం గడిపారు. స్వాతంత్ర్యానంతరం తన గ్రామంలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. ప్రజాజీవితంలో ఉన్న ఆయన 1952లో సోషలిస్టు పార్టీ తరపున బిహార్ అసెంబ్లీకి పోటీ చేసి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ రోజుల్లో బిహార్ నుంచి ఆస్ట్రియాకు వెళ్లిన ఓ ప్రతినిధి బృందంలో కర్పూరీ కూడా ఉన్నారు. ఆయనకు కోటు లేకపోవటంతో ఒక స్నేహితుడి వద్ద అడిగి తీసుకున్నారు. అయితే, అది కూడా చిరిగిపోయి ఉంది. అయినప్పటికీ అలాగే వేసుకున్నారు. దాన్ని చూసిన యుగోస్లేవియా అధినేత మార్షల్ టిటో కర్పూరీ ఠాకూర్‌కు ఒక కొత్త కోటు అందించారు. కర్పూరీ తన ప్రజాజీవితంలో తొలి నుంచీ అత్యంత నిరాడంబరంగా ఉండేవారు. రెండు సార్లు బిహార్ సీఎంగా పని చేసిన ఆయనకు సొంత ఇల్లు, కారు వంటి సౌకర్యాలు అటుంచి సరైన దుస్తులు కూడా ఉండేవి కావు. వాటి గురించి ఆయన ఎన్నడూ పట్టించుకునే వారు కాదు.

మద్య నిషేధం

రాజకీయంగా అంచెలంచెలుగా ఎదిగిన కర్పూరీ ఠాకూర్ బిహార్ మంత్రిగా, డిప్యూటీ సీఎంగా పని చేశారు. 1970 డిసెంబరులో తొలిసారిగా కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. పదవిలో ఏడు నెలలు మాత్రమే కొనసాగారు. 1977లో మరోసారి ఆ పదవిని అధిష్ఠించారు. రెండేళ్లపాటు పదవిలో ఉన్నారు. సీఎంగా తొలిసారి పదవిని చేపట్టినప్పుడే రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధాన్ని అమలు చేశారు. ఆ తర్వాత కాలంలో, రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్ కల్పించే ముంగేరీలాల్ కమిషన్ సిఫార్సులను అమలు చేశారు. ఈ కమిషన్ మండల్ కమిషన్ కన్నా చాలా ముందే బీసీలకు విద్య, ఉద్యోగాల్లో వాటాను సిఫార్సు చేసింది. కులవివక్షకు వ్యతిరేకంగా కర్పూరీ జీవితాంతం పోరాడారు. సామాజిక సమానత్వం కోసం ఆయన అమలు చేసిన విధానాలు, సంస్కరణల ఫలితంగా.. విద్య, ఉద్యోగాలు, సాగు రంగాల్లో లక్షలాది మంది ప్రజలు లబ్ధి పొందారు.

ఎంతో మందికి స్ఫూర్తి ప్రదాత

స్వాతంత్ర్యానంతరం సోషలిస్టు ఉద్యమానికి నేతృత్వం వహించిన రామ్ మనోహర్ లోహియా ప్రభావం కర్పూరీ ఠాకూర్‌పై గణనీయంగా ఉంది. నాటి దిగ్గజ నేత జయప్రకాశ్ నారాయణ్‌తోనూ సన్నిహితంగా మెలిగారు. బీసీ వర్గాల నుంచి ముందుకొచ్చిన లాలూ, ములాయం, నితీశ్ తదితర నేతలకు కర్పూరీ ఠాకూర్ స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. 1988 ఫిబ్రవరి 17వ తేదీన కర్పూరీ ఠాకూర్ మరణించారు. మరణించే వరకూ వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ వచ్చారు. బిహార్‌లో అనేక ప్రభుత్వ విద్యాసంస్థలకు ఆయన పేరు పెట్టారు. ఆయన స్వగ్రామం పితోంఝియాను కర్పూరీగ్రామ్‌గా పిలుస్తున్నారు. కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్నను ప్రకటించటంపై బిహార్ సీఎం నితీశ్ స్పందిస్తూ.. సామాజికంగా అణిచివేతకు, నిర్లక్ష్యానికి గురైన వర్గాలు, దళితులలో ఇది సానుకూల భావోద్వేగాలను తీసుకొస్తుందని చెప్పారు.

కర్పూరీతోనే బీసీల రాజ్యం

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో బీసీల గాలి వీచేలాచేసింది బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూరేనని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. అంతకుముందు అక్కడ అధికారమంతా అగ్రకులాల చేతుల్లో ఉండేదని, బీసీల నాయకత్వం ఆయనతోనే ప్రారంభమైందని తెలిపారు. బిహార్‌లో మహిళలకు రిజర్వేషన్ల ఘనత కూడా కర్పూరీ ఠాకూర్‌దేనన్నారు. ఆయనకు భారతరత్న ప్రకటించడం బీసీ వర్గాలను గౌరవించడమేనని లక్ష్మణ్ పేర్కొన్నారు.



ఆ శిల 250 కోట్ల ఏళ్లనాటిది!

న్యూఢిల్లీ, అయోధ్య, జనవరి 23: అయోధ్యలో బాలరాముడిగా కొలువుదీరిన రామ్‌లల్లా విగ్రహాన్ని చూసి భక్తులు మురిసిపోతున్నారు. కర్ణాటకకు చెందిన శిల్పి అరుణ్ యోగిరాజ్ ఈ 51 అంగుళాల బాలరాముడి విగ్రహాన్ని జీవం ఉట్టిపడేలా అందంగా తీర్చిదిద్దారు. దీనికోసం ప్రత్యేక నల్ల గ్రానైట్ శిలను ఉపయోగించారు. దీన్ని కర్ణాటలో నాణ్యమైన గ్రానైట్ గనులకు ప్రసిద్ధి చెందిన మైసూరు జిల్లాలోని జయపుర హోబ్లీ గ్రామం నుంచి తీసుకొచ్చారు. ఈ గ్రానైట్ శిల 250 కోట్ల సంవత్సరాల పురాతనమైనదని బెంగళూరులోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్ఐఆర్ఎం) డైరెక్టర్ హెచ్ఎస్ వెంకటేశ్ ధ్రువీకరించారు. బాలరాముడి విగ్రహ తయారీకి వాడిన శిల అత్యంత మన్నికైనదని, ఎలాంటి వాతావరణ మార్పులనైనా తట్టుకుని వేలాది సంవత్సరాలపాటు దృఢంగా ఉంటుందని వెంకటేశ్ చెప్పారు. ఈ శిలలో ఎలాంటి అంతర్గత పగుళ్లు ఉండవని, అలాగే ఇది నీటిని సంగ్రహించదని తెలిపారు.

తెల్ల పాలరాతి విగ్రహం ఆలయంలో మరోచోట..



న్యూఢిల్లీ, జనవరి 23: అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ కోసం విగ్రహాన్ని ఎంపిక చేయడానికి రామజన్మభూమి ట్రస్టు మూడు విగ్రహాల మధ్య ఓటింగ్ నిర్వహించింది. అరుణ్ చెక్కిన విగ్రహం ఎంపిక కాగా.. మిగిలిన రెండు విగ్రహాలను కూడా ఆలయంలోని ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. వాటిలో ఒకటి రాజస్థాన్ శిల్పి సత్యనారాయణ పాండే చెక్కిన తెల్ల పాలరాతి విగ్రహం. ఇది ప్రస్తుతం ఆలయ ట్రస్టు వద్ద ఉంది. ఇందులో రామ్‌లల్లా బంగారు విల్లు, బాణం పట్టుకుని ఉన్నాడు. కర్ణాటకకు చెందిన గణేశ్ భట్ అనే మరో శిల్పి కూడా బాలరాముడి విగ్రహాన్ని తయారు చేశారు.

నా గుండె నిండా అయోధ్యే: మోదీ

న్యూఢిల్లీ, జనవరి 23: తన హృదయమంతటా అయోధ్య నిండిపోయిందని, తనతో అది విడదీయరాని భాగంగా మారిపోయిందని ప్రధాని మోదీ చెప్పారు. అయోధ్యలో గడిపిన క్షణాలు తన జీవితంలో ఎన్నటికీ మర్చిపోలేనివని పేర్కొన్నారు. అయోధ్య పర్యటనలో తాను అనుభూతి చెందిన విషయాలను తెలియజేస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మంగళవారం ఆయన లేఖ రాశారు. '140 కోట్ల మంది భారతీయులతో కలిసి రామ్‌లల్లాను ఆహ్వానించటం ఒక అద్భుతమైన సందర్భం. శ్రీరాముడితోపాటు భారతీయుల ఆశీస్సుల వల్లే అది సాధ్యమైంది. వారికి నేనెప్పుడూ కృతజ్ఞుడినై ఉంటా' అని మోదీ పేర్కొన్నారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహం ప్రాణప్రతిష్ఠకు వెళ్తున్న ప్రధానిని అభినందిస్తూ రాష్ట్రపతి ముర్ము అంతకుముందు ఆయనకు ఒక లేఖ రాశారు.

తొలిరోజే 5లక్షల మందికి దర్శనం!

(మొదటి పేజీ తరువాయి)





అర్ధరాత్రి నుంచే క్యూలైన్లలోకి లక్షలాది మంది ప్రవేశించారు. ఉదయం నుంచి భక్తుల తాకిడి పెరుగుతూ పోయి, మధ్యాహ్నానికి మందిర ప్రధాన ద్వారం వద్ద రద్దీ పతాక స్థాయికి చేరుకుంది. ఆలయానికి చేరుకొనే ప్రధాన మార్గమైన 13 కిలోమీటర్ల రామ్ పథ్‌లో యాత్రికులు పోటెత్తారు. ఉదయం 6గంటలకు ఆలయ సముదాయంలోకి భక్తుల ప్రవేశం మొదలైందని, మధ్యాహ్నం 2గంటల వరకూ 2.5లక్షల నుంచి 3 లక్షల మంది స్వామివారిని దర్శించి ఉంటారని అయోధ్య డివిజనల్ కమిషనర్ గౌరవ్ దయాళ్ ప్రకటించారు. క్యూలు, బ్యారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులను క్రమబద్ధీకరించడానికి యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రాత్రి ఆలయం మూసివేసే సమయానికి దాదాపు 5లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకొంటారని అంచనా వేస్తున్నట్లు మరో అధికారి వెల్లడించారు. రాముడి దర్శనం కోసం భక్తులు భారీగా తరలి రావడంతో వారిని అదుపుచేసేందుకు భద్రతా సిబ్బంది నానా తంటాలు పడ్డారు. ఆలయం వద్ద 8వేల మందికి పైగా పోలీసులను మోహరించామని, పరిస్థితి అదుపులోనే ఉందని యూపీ ఇన్ఫర్మేషన్ డైరెక్టర్ శిశిర్ పేర్కొన్నారు. భారీ రద్దీ కారణంగా ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేసినట్లు వచ్చిన వదంతులను అయోధ్య పోలీసులు ఖండించారు. కాగా, రామమందిరంలో ఏర్పాట్లను యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మంగళవారం పరిశీలించారు. . కాగా, బాల రాముడిని దర్శించుకోవడానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంపై ట్రస్టు ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ హర్షం వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా 'జై శ్రీరాం' నినాదాలు ప్రతిధ్వనిస్తున్నాయని, మనమంతా త్రేతాయుగం నాటి అయోధ్యలో ఉన్నట్లుగా అనిపిస్తోందని పేర్కొన్నారు. వనవాసం తర్వాత రాముడు తిరిగి వచ్చినప్పటి దృశ్యాలు మళ్లీ ఇప్పుడు కనిపిస్తున్నాయన్నారు.

బాల రాముడు ఇకపై 'బాలక్ రామ్'

అయోధ్యలో నిర్మితమైన దివ్య, భవ్య రామమందిరంలో ప్రతిష్ఠించిన నూతన రామ్‌లల్లా విగ్రహానికి 'బాలక్ రామ్'గా నామకరణం చేశారు. ఈ విగ్రహంలో రాముడు ఐదేళ్ల బాలుడిని పోలి ఉండటమే దీనికి కారణమని ఆలయ పూజారి అరుణ్ దీక్షిత్ తెలిపారు. మొదటిసారి విగ్రహాన్ని చూసినప్పుడు తానెంతో ఉద్వేగానికి గురయ్యాయని, తన ముఖమంతా కన్నీటితో తడిసిపోయిందన్నారు. ఇప్పటివరకూ దాదాపు 50-60 విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠలు నిర్వహించానని, వాటన్నింటిలోకీ ఇదే తనకు అత్యంత అలౌకిక ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. కాగా, రామాయణం, రామచరిత్ మానస్ లాంటి గ్రంథాలను విస్తృతంగా అధ్యయనం చేసిన తర్వాతే బాలరాముడి విగ్రహానికి ఆభరణాలను సిద్ధం చేసినట్లు శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ పేర్కొంది.

అయోధ్య రామయ్యకు కంచి కామకోటి పీఠం ఆభరణాలు

హైదరాబాద్, జనవరి 23: అయోధ్యలో కొలువుదీరిన శ్రీరాముడికి కంచి కామకోటి పీఠం నుంచి ప్రత్యేక ఆభరణాలు అందాయి. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఈ ఆభరణాలను స్వయంగా స్వామివారికి సమర్పించారు. విజయేంద్ర సరస్వతికి ఆదివారం రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు పూర్ణ కుంభంతో స్వాగతించారు. అనంతరం ఆలయాన్ని సందర్శించిన విజయేంద్ర సరస్వతి ప్రాణ ప్రతిష్ఠకు సంబంధించిన క్రతువులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ప్రతిపక్షాలకు 'బాలరాముడి' భయం!

న్యూఢిల్లీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఊహించిన దానికంటే ఎక్కువగా ప్రజల్లో సానుకూల స్పందన లభించడంతో ప్రతిపక్షాలు తమ భవిష్యత్తు కార్యాచరణపై తీవ్ర ఆలోచనలో పడ్డట్లు కనిపిస్తోంది. తాము అనుకున్న దానికంటే ఎక్కువ ప్రతిస్పందన ప్రజల్లో కనిపిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు అంగీకరించారు. అసోంలో రాహుల్‌గాంధీ ఆలయ సందర్శనకు ప్రయత్నించడం, ఇండియా కూటమికి చెందిన పలు పార్టీల నేతలు కూడా పూజల్లో పాల్గొనడం జనంలో ఒక అయోమయాన్ని సృష్టించిందని, ఈ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విమర్శిస్తే తాము ప్రజల్లో మరింత వ్యతిరేతను ఎదుర్కొంటామన్న భయంలో చాలా మంది ప్రతిపక్ష నేతలు ఉన్నారని ఆయన అన్నారు. అయితే ఈ విషయంపై ప్రతిపక్ష పార్టీల మధ్య అంతర్గత చర్చలు జరుగుతున్నాయని, త్వరలో ఇండియా కూటమి నేతలు సమావేశం కావాల్సిన ఆవశ్యకతను అందరూ గుర్తించారని చెప్పారు. మరో వారం రోజుల్లో పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతాయని, ఈలోపే ఇండియా కూటమి నేతలంతా ఒకసారి సమావేశమవుతారని ఆయన చెప్పారు. రామమందిరాన్ని మోదీ ఎన్నికల ఎజెండాగా మారిస్తే.. దానిని ఎదుర్కోవడం కోసం ప్రతిపక్షాలు మరింత సంఘటితమవుతాయన్నారు.

రాహుల్‌పై కేసు

అసోం సీఎం ఆదేశాలతో నమోదు చేసిన పోలీసులు



గువాహటి, జనవరి 23: కాంగ్రెస్ యువరాజు రాహుల్ గాంధీపై అసోం పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. భారత్ జోడో న్యాయ యాత్ర పేరిట రాహుల్ నిర్వహిస్తున్న పాదయాత్రను మంగళవారం ఉదయం వారు అడ్డుకున్నారు. రాజధాని గువాహటి నగరంలోకి ఆయన పాదయాత్ర ప్రవేశించకుండా పోలీసులు బారికేడ్లు అడ్డం పెట్టగా.. కాంగ్రెస్ శ్రేణులు వాటిని ఛేదించుకుని నగరంలోని ప్రధాన రహదారిపైకి అడుగుపెట్టాయి. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించాలంటూ ప్రజలను రెచ్చగొట్టిన రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని అసోం సీఎం హిమంత విశ్వశర్మ ఆ రాష్ట్ర డీజీపీని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ఆ రాష్ట్ర పోలీసులు రాహుల్ గాంధీపైన, ఆయనతో పాటు ఉన్న కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, కన్హయ్యకుమార్‌పైన.. హింసకు ప్రేరేపించడం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం సహా పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. బారికేడ్లను ఛేదించే క్రమంలో పోలీసు సిబ్బందితో జరిగిన ఘర్షణలో అసోం రాష్ట్ర కాంగ్రెస్ ప్రెసిడెంట్ భూపేంద్ర బోరాకు, అసోం అసెంబ్లీలో విపక్ష నేత దేవవ్రత సైకియాకు గాయాలయ్యాయి. అలాగే పలువురు పోలీసులకు గాయాలైనట్టు డీజీపీ డీజీ సింగ్ తెలిపారు. ఈ ఘర్షణకు ముందు.. మేఘాలయ నుంచి అసోంలోకి అడుగుపెట్టిన రాహుల్‌గాంధీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అదే మార్గంలో ప్రయాణించడానికి అనుమతించిన హిమంత సర్కారు ఇప్పుడు కాంగ్రెస్‌కు అనుమతి ఇవ్వడం లేదని మండిపడ్డారు. బారికేడ్లను విరగ్గొట్టిన కాంగ్రెస్ కార్యకర్తలను ఆయన సింహాలుగా అభివర్ణించారు. అయితే.. ఇలాంటి హింసాత్మక ప్రవర్తన అసోం సంస్కృతి కాదని.. తమది శాంతియుత రాష్ట్రమని హిమంత వ్యాఖ్యానించారు.

రేపటి నుంచి కాంగ్రెస్ రాష్ట్రస్థాయి సమావేశాలు

» లోక్‌సభ ఎన్నికలకు పార్టీ సన్నద్ధత!

న్యూఢిల్లీ, జనవరి 23: లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధతలో భాగంగా గురువారం నుంచి కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించనుంది. ఈ సమావేశాలకు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహించనున్నారు. తొలి సమావేశం ఇటీవల పార్టీ అధికారంలోకి వచ్చిన తెలంగాణలో జరగనుంది. ఈ నెల 28న ఉత్తరాఖండ్, వచ్చే నెల 3న ఢిల్లీ, 4న కేరళ, 10న హిమాచల్ ప్రదేశ్, 11న పంజాబ్, 13న తమిళనాడు, 15న ఝార్ఖండ్‌లో ఈ సమావేశాలు నిర్వహిస్తామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' కొనసాగుతున్న సంగతి తెలిసిందే. కాగా, ఈ నెల మొదట్లో నిర్వహించిన కీలక సమావేశంలో ఖర్గే పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. విభేదాలను విడిచిపెట్టాలని, పార్టీ అంతర్గత విషయాలను మీడియా ముందు మాట్లాడవద్దని, పార్టీ విజయం కోసం జట్టుగా పనిచేయాలని సూచించారు. మరో సమావేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన పార్టీ సీనియర్ నేతల సమావేశంలో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఇతర పార్టీలతో సీట్ల పంపకంపై చర్చించారు.

సరోగసీ చట్టం అమలు తీరుపై సమాచారం ఇవ్వండి

» రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం లేఖ

న్యూఢిల్లీ, జనవరి 23: సరోగసీ చట్టం-2021 అమలు తీరుపై సమాచారం ఇవ్వాలని కేంద్ర ఆరోగ్య శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరింది. అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ)ని ఉపయోగించి ఎన్ని జంటలు, ఎంత మంది ఒంటరి మహిళలు, అవివాహితలు సంతానాన్ని పొందారో డాటా పంపించాలంటూ లేఖ రాసింది. ఈ చట్టాన్ని సక్రమంగా అమలు చేస్తోందీ లేనిదీ తెలుసుకోవడానికి ఈ వివరాలు ఇవ్వాలని తెలిపింది. సరోగసీ, ఏఆర్‌టీ చట్టాలు.. కృత్రిమ గర్భధారణ అందించే ఆస్పత్రులపై పలు ఆంక్షలు విధించాయి. సాంకేతిక పరిజ్ఞానం దుర్వినియోగం కాకుండా పలు నిషేధాలు కూడా ఉన్నాయి. వీటి అమలు తీరుపైనే ప్రస్తుతం కేంద్రం సమాచారం సేకరించనుంది.

చౌకబారు ఎత్తులు!

రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీ బలం తగ్గించడానికి వైసీపీ కుయుక్తులు

» గంటా రాజీనామాకు ఆకస్మిక ఆమోదం
» ఆళ్ల రాజీనామాపై మాత్రం మౌనం
» వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన ఎమ్మెల్యేలకు అనర్హత నోటీసులు
» టికెట్లు నిరాకరించిన ఎమ్మెల్యేలు
» ప్రతిపక్షానికి ఓటేస్తారని భయం
» అందుకే రీసర్వే పేరుతో డ్రామాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మూడేళ్లకు ఆమోదం



వైసీపీ పెద్దల కుయుక్తుల్లో భాగంగా.. ఏనాడో మూడేళ్ల కిందట శాసనసభ్యత్వానికి టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేసిన రాజీనామాను శాసనసభ స్పీకర్‌తో మంగళవారం ఆకస్మికంగా ఆమోదింపజేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయాలన్న కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు చేపట్టిన ఉద్యమానికి సంఘీభావంగా ఆయన అప్పట్లో రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆయన పలు అసెంబ్లీ సమావేశాలకూ హాజరయ్యారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కూడా వేశారు. అప్పుడేమీ మాట్లాడని స్పీకర్ కార్యాలయం ఇప్పుడు హఠాత్తుగా ఆయన రాజీనామాను ఆమోదిస్తున్నట్లు ప్రకటించింది. ఇదే సమయంలో వైసీపీ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రాజీనామాపై మాత్రం నిర్ణయం తీసుకోకపోవడం విశేషం. దానిని ఆమోదించకపోవడాన్ని విపక్షాలు ఆక్షేపిస్తున్నాయి.

రాబోయే రాజ్యసభ ఎన్నికల్లో విజయానికి అధికార పక్షం వైసీపీ చౌకబారు ఎత్తుగడలకు దిగజారుతోంది. టీడీపీ సంఖ్యాబలం తగ్గించడానికి నానా పాట్లు పడుతోంది. మూడు రాజ్యసభ స్థానాలకు వచ్చే నెలలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ మూడింటినీ గెలుచుకునేంత సంఖ్యా బలం అసెంబ్లీలో వైసీపీకి ఉంది. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేలే ఓటర్లు. కానీ చాలామంది సిటింగ్ ఎమ్మెల్యేలకు జగన్ సీట్లు నిరాకరించారు. వారంతా ఆగ్రహంతో రగిలిపోతుండడంతో రాజ్యసభ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. వైసీపీలో అంతర్గత సంక్షోభాన్ని ఆసరాగా చేసుకుని ఇందులో ఒక సీటుకు పోటీ పెట్టాలని ప్రధాన ప్రతిపక్షం టీడీపీ భావిస్తోంది. దీంతో సీట్లు గల్లంతైన వైసీపీ ఎమ్మెల్యేలు టీడీపీ అభ్యర్థికి ఓటేస్తారేమోనని అధికార పక్షం ఆందోళన చెందుతోంది. టికెట్లు దక్కని 50 మంది వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యేల్లో సగం మంది టీడీపీకి వేసినా ఆ పార్టీ ఒక రాజ్యసభ సీటును ఖాయంగా గెలుచుకుంటుంది. దీనివల్లే ఆ పార్టీ బలం తగ్గించడానికి వైసీపీ యత్నాలు మొదలుపెట్టింది. శాసనసభలో టీడీపీకి పడే ఓట్లు తగ్గించడానికి వైసీపీ మరో ప్రయత్నం కూడా చేస్తోంది. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నలుగురు సిటింగ్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయించడానికి పావులు కదుపుతోంది. ఆనం రామనారాయణరెడ్డి(వెంకటగిరి), కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి(నెల్లూరు రూరల్), మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి(ఉదయగిరి), ఉండవల్లి శ్రీదేవి (తాడికొండ-ఎస్సీ).. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేయలేదని ఆరోపిస్తూ వారిని నిరుడు మార్చిలో వైసీపీ నుంచి సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ సమయంలో వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరలేదు. ఇప్పుడు రాజ్యసభ ఎన్నికల్లో వాతావరణం సమస్యాత్మకంగా మారడంతో.. ఆకస్మికంగా వారిపై అనర్హత వేటు వేయాలంటూ కొద్ది రోజుల క్రితం స్పీకర్‌కు లేఖ ఇచ్చారు. తర్వాత కొద్ది రోజుల్లోనే ఈ నలుగురికీ స్పీకర్ కార్యాలయం తమపై వచ్చిన ఫిర్యాదుకు సమాధానం ఇవ్వాలని కోరింది. 15 రోజుల అదనపు సమయం కావాలని వారు తిరుగు సమాధానం పంపారు. టీడీపీ నుంచి కూడా నలుగురు ఎమ్మెల్యేలు వైసీపీలోకి వెళ్లారు. వీరిలో కరణం బలరాం(చీరాల), వల్లభనేని వంశీ (గన్నవరం), మద్దాలి గిరి(గుంటూరు పశ్చిమ), వాసుపల్లి గణేశ్(విశాఖ దక్షిణ) ఉన్నారు. వీరితోపాటు జనసేన ఏకైక ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ కూడా వైసీపీలో చేరారు. తమ పార్టీ నుంచి వైసీపీలోకి వెళ్లిన నలుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని టీడీపీ శాసనసభాపక్షం కూడా స్పీకర్‌కు విజ్ఞప్తి చేసింది. వారికీ నోటీసులు వెళ్లాయి. వారు కూడా సమాధానం ఇవ్వడానికి అదనపు సమయం కోరారు. వారి విషయంలో స్పీకర్ నిర్ణయం తెలియరానప్పటికీ.. అదనపు సమయం ఇచ్చే ఉంటారని వినవస్తోంది. అటు గంటా రాజీనామా ఆమోదం.. ఇటు టీడీపీ నుంచి మారిన వారిపై అనర్హత వేటుతో ఆ పార్టీ బలం సభలో 18కి పడిపోతుంది. అదే సమయంలో వైసీపీ నుంచి మారినవారిపై వేటు వేస్తే ఆ పార్టీ బలం కూడా తగ్గిపోతుంది. కానీ అది జరుగుతుందా అని టీడీపీ వర్గాలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నాయి. మరోవైపు.. తాము సీట్లు నిరాకరించిన ఎమ్మెల్యేలు పార్టీకి వ్యతిరేకంగా ఓటేయకుండా అడ్డుకోవడానికి కొత్త ఎత్తు వేసింది. రీసర్వే జరిపిస్తున్నట్లు అనుకూల మీడియాకు లీకులిచ్చింది. రీసర్వేలో తమకు అనుకూలంగా వస్తే మళ్లీ సీటు తమకే ఇస్తారేమోనన్న ఆశతో ఈ ఎమ్మెల్యేలు ప్రతిపక్షానికి ఓటు వేయకుండా తమతోనే ఉండిపోతారని, అందుకే రాజ్యసభ ఎన్నికలయ్యే వరకూ రీసర్వే పేరుతో వారిని కట్టిపడేయాలని జగన్ అండ్ కో భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ముంబై నయానగర్ హింసలో 13 మంది అరెస్టు

న్యూఢిల్లీ, జనవరి 23: ఆదివారం రాత్రి ముంబైలోని నయానగర్‌లో హింసకు కారణమైన 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని నయానగర్‌లోని మీరా రోడ్డులో కొందరు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీపై దుండగులు రాళ్లు విసిరారు. ర్యాలీ నిర్వహించినవారిపై దాడికి పాల్పడ్డారు. వాహనాలను ధ్వంసం చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు 13 మందిని అరెస్టు చేశారు. మరోవైపు, మీరారోడ్డు పక్కన నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 20కి పైగా నిర్మాణాలు, షాపులను కూల్చివేశారు.

బీజేపీకి తొత్తుగా జగనన్న

» స్వలాభం కోసం ఏపీ తాకట్టు
» మోదీకి వైసీపీ ఎంపీల ఊడిగం
» జగన్‌పై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఫైర్



విజయనగరం/శ్రీకాకుళం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): "వైసీపీ ప్రభుత్వ స్వలాభం కోసం కేంద్రంలోని బీజేపీకి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టింది. మన రాష్ట్రంలో బీజేపీకి ఒక్క ఎంపీ కానీ, ఎమ్మెల్యే కానీ లేరు. అంటే ఈ రాష్ట్రంలో బీజేపీ పాలన వద్దని ప్రజలు కోరుకున్నారు. అలాంటి మన రాష్ట్రంపై బీజేపీ పెత్తనం ఏంటి?" అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిప్పులు చెరిగారు. జిల్లాల పర్యటన చేపట్టిన ఆమె.. మంగళవారం విజయనగరం పట్టణంలో విజయనగరం, పార్వతీపురం జిల్లాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ సర్కారు విధానాలను ఎండగట్టారు. "ఏపీకి హోదా విషయంలో వైసీపీ, టీడీపీ ప్రభుత్వాలు రెండూ ప్రజలను మోసగించాయి. మోదీకి వైసీపీ ఎంపీలు ఊడిగం చేస్తున్నారు. "జగనన్న యువతను మోసం చేశారు. ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. ఐదేళ్లుగా జాబ్ క్యాలెండర్ లేదు. మద్య నిషేధం లేదు. రోడ్లు లేవు, రాజధాని లేదు. మెట్రో లేదు. పోలవరం లేదు. మరి ఓటు అడిగే హక్కు ఎక్కడిది?" అంటూ జగన్‌పై షర్మిల నిప్పులు చెరిగారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తొలి సంతకం ఏపీ హోదాపైనే ఉంటుందని షర్మిల చెప్పారు. "వైవీ సుబ్బారెడ్డి రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూపిస్తామంటున్నారు. అందుకు సిద్ధంగా ఉన్నాం. డేటు, టైము మీరు చెప్పినా సరే.. నన్ను చెప్పమన్నా సరే. మాతో పాటుగా ప్రతిపక్షం, మేధావులు, మీడియాకు మీరు చూపిస్తే రాష్ట్ర అభివృద్ధి తెలుస్తుంది. మరోమారు చెబుతున్నా.. డేట్, టైము మీరు చెప్పినా.. నేను చెప్పినా సరే" అంటూ సవాల్ విసిరారు. కాగా, శ్రీకాకుళం జిల్లాలో జరిగిన షర్మిల పర్యటనలో అధికార పార్టీ వైసీపీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు పాల్గొన్నారు. శ్రీకాకుళం నుంచి షర్మిల బయలుదేరగానే పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.

మాజీ మంత్రి కొణతాలతో షర్మిల భేటీ

షర్మిల మంగళవారం రాత్రి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణతో భేటీ అయ్యారు. విశాఖలో ఉన్న కొణతాల ఇంటికి వెళ్లారు. సుమారు 20 నిమిషాల పాటు ఇరువురు చర్చించుకున్నారు.

బాబుకు 'స్టార్ క్యాంపెయినర్'

» షర్మిలపై తొలిసారి ఏపీ సీఎం జగన్ విమర్శలు

అనంతపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు, సోదరి వైఎస్ షర్మిలపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తొలిసారిగా స్పందించారు. ఆమె విపక్ష నేత చంద్రబాబుకు 'స్టార్ క్యాంపెయినర్'గా మారారని విమర్శించారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో మంగళవారం జగన్ నాలుగో విడత వైఎస్సార్ 'ఆసరా' కింద బటన్ నొక్కి రూ.6394.83 కోట్ల నిధులను పొదుపు మహిళల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'రాష్ట్రాన్ని విభజించిన పార్టీలోకి ప్రవేశించి చంద్రబాబుకు మరో స్టార్ క్యాంపెయినర్‌గా మారారు' అంటూ షర్మిల పేరెత్తకుండానే విమర్శించారు. పొరుగు రాష్ట్రంలో నివాసముంటున్న స్టార్ క్యాంపెయినర్లు చంద్రబాబును జాకీలు పెట్టి లేపుతున్నారంటూ జనసేన అధిపతి పవన్ కల్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరిని విమర్శించారు. 'పసుపు కమలాలు' అంటూ బీజేపీ నేతలను ఎద్దేవా చేశారు.

అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా శ్రీలంకలో హిందువులు అధికంగా నివసించే ఉత్తర ప్రాంతంలోని అనేక ఆలయాలలో సంబరాలు చేసుకున్నారు. ప్రముఖ నల్లూర్ కోవిల్ ఆలయంలో సోమవారం నిర్వహించిన వేడుకల్లో భారత కాన్సులేట్ అధికారులు కూడా పాల్గొన్నారు. - కొలంబో

మరో వైసీపీ ఎంపీ అవుట్!

» పార్టీకి, లోక్‌సభ సభ్యత్వానికి శ్రీకృష్ణదేవరాయలు రాజీనామా
» త్వరలో టీడీపీలో చేరికకు సిద్ధం!

గుంటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయన మంగళవారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. 'గత కొన్ని రోజులుగా నా సీటు విషయంలో అనిశ్చితి నెలకొంది. అటు నాయకులు, ప్రజలు, కేడర్ గందరగోళంలో పడిపోయారు. దీని వల్ల అటు నాయకులకు, పార్టీకి, నాకు ఎవరికీ ఉపయోగం లేదు. వీటన్నిటికీ తెరదించేందుకే వైసీపీకి, ఎంపీ పదవికి రాజీనామా చేస్తున్నా.' అని ప్రకటించారు. పల్నాడు నుంచి భారీ సంఖ్యలో ఆయన వద్దకు వచ్చిన పలువురు వైసీపీ స్థానిక ప్రజాప్రతినిధులు కూడా అక్కడే తమ రాజీనామాలను ప్రకటించడం గమనార్హం. నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో పెట్టిన ఆయనతో కలిసి నడుస్తామని స్పష్టం చేశారు. లావు త్వరలో టీడీపీలో చేరతారని.. నరసరావుపేట నుంచే లోక్‌సభకు పోటీచేస్తారని పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది.

వజ్రాలు పొదిగిన బంగారు వాచ్!

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. అది.. 2021, కరోనా కాలం! దీంతో హంగూఆర్భాటాలకు దూరంగా, అత్యంత సన్నిహితుల మధ్య ఆ వివాహం జరిగింది. అయితే.. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు 'అనుకోని అతిథులు' కూడా హాజరయ్యారు. వారిలో ఒకరు.. వైసీపీ రాజ్యసభ సభ్యుడు, పారిశ్రామిక వేత్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి. ఇంకొకరు... టీటీడీలో 'ఆల్ ఇన్ వన్'గా వ్యవహరించే ధర్మారెడ్డి! పిలవని పేరంటానికి వచ్చిన వీళ్లను చూసి ఆ న్యాయమూర్తి ఆశ్చర్యపోయారు.

వివాహం తర్వాత ఆయన సమీపంలోని ఒక అతిథి గృహంలోకి వెళ్తుండగా... ఆయనతోపాటే వీరూ ప్రవేశించారు. టీటీడీ అదనపు ఈవోగా ధర్మారెడ్డితో పరిచయం ఉండటం, ఆయనతోపాటు వచ్చిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రాజ్యసభ సభ్యుడు కావడంతో సదరు న్యాయమూర్తి వారిని లోపలికి ఆహ్వానించారు. అసలు వీళ్లెందుకు వచ్చారు అనుకుంటుండగానే... వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఒక గిఫ్ట్ బాక్స్‌లో నుంచి ధగధగలాడే వస్తువు ఒకటి బయటికి తీశారు. అది... వజ్రాలు పొదిగిన బంగారు రిస్ట్ వాచ్! ఆ బ్రాండెడ్ వాచ్ విలువ సుమారు రూ.2 కోట్లు! 'తీసుకోండి సర్...' అంటూ దానిని జడ్జి ముందుంచారు. అదిచూడగానే.. ఆ న్యాయమూర్తి షాక్‌కు గురయ్యారు. అంతకుముందు తనకు ఎప్పుడూ ఎదురుకాని ఈ అనుభవంతో కొన్ని క్షణాలపాటు ఆయన మైండ్ బ్లాంక్ అయింది. వెంటనే తేరుకుని... కన్నెర్ర చేశారు. ఆ కానుకను వాళ్లవైపునకే విసురుగా తోసేశారు. 'ఏమిటీ నాన్సెన్స్ అసలేం జరుగుతోంది. ఇక్కడి నుంచి వెళ్లిపోండి' అని పరుష పదజాలంతో కేకలు వేశారు. దీంతో... వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ధర్మారెడ్డి అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు.

ఇలా బయటికి వచ్చింది...

ఆ న్యాయమూర్తికి జగన్ వ్యవహార శైలి, ఆయన వెంటాడే తీరు బాగా తెలుసు! దీంతోపాటు, తన బాధ్యతగా మొత్తం విషయాన్ని లేఖ రూపంలో అప్పుడే సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. నిబంధనల ప్రకారం... ఈ వ్యవహారంపై నిఘా వర్గాలతో విచారణ జరిపించాల్సి ఉంటుంది. అయితే... ఆ విషయం అంతటితో ముగిసేలా జగన్ మేనేజ్ చేసినట్లు సమాచారం. ఆ న్యాయమూర్తి సుప్రీంకోర్టుకు రాసిన లేఖ గురించి ఇప్పుడు చర్చ మొదలవడంతో ఈ మొత్తం అంశం వెలుగులోకి వచ్చింది.

తొలినుంచీ న్యాయవ్యవస్థపై కన్ను...

తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అక్రమాలు, అవినీతికి పాల్పడి... లెక్కలేనన్ని కేసుల్లో ఇరుక్కుని, విచారణ ఎదుర్కొంటున్న జగన్ మొదటి నుంచీ న్యాయవ్యవస్థపై కన్నేశారు. అంతకుముందు కూడా ఒక జడ్జిని ఇలాగే ప్రలోభాలకు గురిచేయాలని ప్రయత్నించి విఫలమయ్యారు. కేసుల విచారణలో తనకు ఉపయోగపడిన, పడుతున్న వారిని ఎప్పటికప్పుడు ఏదోఒక రూపంలో సంతృప్తి పరుస్తూనే ఉన్నారు. దీనికోసం ఆయన కొందరు వ్యక్తులను వాడుకుంటారు. ఎప్పుడు, ఎక్కడ, ఎవరిని, ఎలా 'ఫీల్డ్'లో దించాలో జగన్‌కు బాగా తెలుసునంటారు. అలాంటి వాళ్లను ఏదో ఒక పదవిలో కూర్చోబెడతారు. అవసరమైనప్పుడు వారిని తన అవసరాల కోసం రంగంలోకి దించుతారు. ధర్మారెడ్డి 'పాత్ర' అలాంటిదే! తిరుమల వెంకన్నపై సామాన్యుల నుంచి వీవీవీవీఐపీల దాకా అందరికీ అచంచలమైన భక్తి! తన పదవిపరంగా ఎంత పవర్‌ఫుల్ వ్యక్తి అయినా... తిరుమలకు వస్తే ధర్మారెడ్డిని అనివార్యంగానైనా కలవాల్సిందే. ఆ విధంగా ఆయన అందరికీ పరిచయం! కానీ... ఆయనది ఖరీదైన గిఫ్టులు ఇచ్చే స్థాయి కాదు. అందుకు... వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లాంటి వారిని ఉపయోగిస్తారు. పరిచయంతో మాట కలిపేందుకు ధర్మారెడ్డి, ప్రలోభాల కానుకలు అందించేందుకు మరొకరు! ఇదీ... జగన్ స్కీమింగ్! నిబద్ధత కలిగిన ఆ న్యాయమూర్తిని 'మంచి' చేసుకునేందుకు కూడా ధర్మారెడ్డినే ప్రయోగించారు. అయితే... ఈ ప్రయత్నం వికటించింది.

చివరగా: మరోవైపు... ఇంకో మూడేళ్లకుపైబడి సర్వీసు ఉన్న హైకోర్టు న్యాయమూర్తులపై జగన్ ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం! వీరు భవిష్యత్తులో సుప్రీంకోర్టు న్యాయమూర్తులయ్యే అవకాశం ఉంటుంది. వీరిని ఎలాగైనా 'మంచి' చేసుకునేందుకు ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తున్నట్లు న్యాయవాద వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ తన కేసుల కోసమేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నిజమేనా...?

దేశంలో పేదరికం గణనీయంగా తగ్గిందని గతవారం నీతి ఆయోగ్ ప్రకటించింది. నరేంద్రమోదీ ఏలుబడిలో తొమ్మిది సంవత్సరాల్లో ఏకంగా పాతికకోట్లమంది దారిద్ర్యంనుంచి బయటపడ్డారంటున్న ఆ గణాంకాలు వెలువడటానికి కొద్దిముందు డావోస్ సదస్సు సందర్భంలో ఆక్స్‌ఫామ్ అసమానతలమీద తన నివేదిక వెలువరించింది. శతకోటీశ్వరులు సహస్రకోటీశ్వరులవుతున్న ఈ ప్రపంచంనుంచి దారిద్ర్యాన్ని తరిమికొట్టడానికి మరో రెండువందలేళ్ళుపడుతుందంటూ ఎప్పటిలాగానే అది కుబేరులను ఆడిపోసుకుంటూ, పేదలపక్షాన ప్రభుత్వాలకు విధానాలను మార్చుకోమంటూ చాలా హితవులు చెప్పింది. గత ఏడాది జనవరిలో ఈ సంస్థ 'సర్వైవల్ ఆఫ్ ది రిచెస్ట్: ది ఇండియా స్టోరీ' పేరిట ఒక అనుబంధ నివేదిక వెలువరించి, భారతదేశంలో పేద ధనిక అగాధం పెరిగిపోతోందని, ఆకలితో ఉన్నవారు 19 నుంచి 35 కోట్లకు పెరిగారని హెచ్చరించిన ఆర్నెల్లకు నీతిఆయోగ్ తన నివేదికలో 2015–20 మధ్యకాలంలో పదమూడుకోట్లమంది దారిద్ర్యంనుంచి విముక్తి చెందారంటూ ప్రకటించిన విషయం తెలిసిందే. భారతదేశంలో పేదరికం ఇప్పటికీ నిర్దిష్టమైన అంచనాలకు అందని బహురూపిగా, పరిష్కారం సాధ్యం కాని అంశంగానే ఉండిపోయిందా?

తొమ్మిదేళ్ళలో దేశంలో పేదరికం దాదాపు 18శాతం తగ్గిందని, ప్రధానంగా ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ పేదరికాన్ని చక్కగా జయించాయంటున్న నీతిఆయోగ్ నివేదికను కాంగ్రెస్ మరో జుమ్లాగా అభివర్ణించింది. లోక్‌సభ ఎన్నికలముందు, అవి ముగిసేవరకూ ఇటువంటి తప్పుడు లెక్కలే ప్రజలముందుకు వస్తాయని, థర్డ్‌పార్టీ సర్వేల ఆధారంగా ముద్రించిన ఈ నివేదికకు తగిన ప్రాతిపదికలు లేవని ఆ పార్టీ విమర్శ. వేతనాలు తగ్గిపోతూ, ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్న కాలంలో, పేదరికం పెద్ద ఎత్తున నాశనమైందని, నిరుద్యోగం సమసిపోయిందని ఎలా చెబుతారంటూ ఆ పార్టీ ప్రశ్నిస్తోంది. పాతికకోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రకటించడం ద్వారా వారికి సబ్సిడీలు, ఉచితరేషన్, ఇతరత్రా సంక్షేమ పథకాలు వర్తింపకుండా చేసే కుట్ర జరుగుతోందని కూడా ఆ పార్టీ విమర్శ. నీతి ఆయోగ్ నివేదిక సరైనదే అయితే, దేశంలో వినియోగం ఎందుకు తగ్గింది, ప్రభుత్వం తన రేషన్ పథకాలను మరింత విస్తరిస్తూ 80కోట్లమందికి ఉచిత రేషన్ ఎందుకు ఇస్తున్నదని దాని ప్రశ్న. పాతికకోట్లమందిని సంక్షేమం నుంచి గెంటేయాలన్న దుర్బుద్ధి కేంద్రపాలకులకు ఉన్నదని అనలేం కానీ, తమ పాలనలో పేదలు పాతికశాతం తగ్గారని చెప్పుకోవడం ఎన్నికల ముందు బీజేపీకి అవసరం. ఇటీవలే అన్నార్తుల కోసమంటూ ఉచిత తిండిగింజల పంపిణీ పథకాన్ని మరో ఐదేళ్ళు పెంచడానికీ, ఈ కొత్త లెక్కలకు సంబంధం లేదని కాంగ్రెస్‌కు తెలియకపోదు.

ఈ దేశంలో పేదలు ఎందరో, ఆకలితో నకనకలాడుతున్నవారు ఎందరో చాలా కమిటీలు ఏవో లెక్కలు వేశాయి. పేదరికాన్ని ఇలా కొలవాలంటూ మరికొన్ని కమిటీలు సూచనలు చేశాయి. దారిద్ర్యాన్ని నిగ్గుతేల్చే మన విధానాలన్నీ లోపభూయిష్టమైనవేనని కొందరు ఆర్థికవేత్తలు తీసిపారేస్తుంటారు. నీతి ఆయోగ్ నివేదికకు ప్రాతిపదికలు ఏమిటో తెలియదు కానీ, అది చెబుతున్నదీ నిజమేనని సరిపెట్టుకోవాలి. అంతర్జాతీయ ఆకలిసూచిలో అంత అధమస్థానంలో ఎందుకు ఉన్నాం, పోషకాహారలోపంమీద పోరాటంలో పాతిక రాష్ట్రాలు విఫలమైనాయని ఇదే నీతి ఆయోగ్ ఎందుకు అంటున్నది అన్నవి వేరే ప్రశ్నలు.

మిగతా ప్రపంచమంతా కరోనా ఉత్పాతంలో కొట్టుమిట్టాడుతూంటే, ఐదుగురు బిలియనీర్లు మూడేళ్ళలో తమ ఆస్తులను రెట్టింపు చేసుకున్నారని, మరో దశాబ్దంలోనే ట్రిలియనీర్ అవతరించబోతున్నాడని ఆక్స్‌ఫామ్ అంటోంది. జెఫ్ బెజోస్, ఎలాన్ మస్క్, లారీ ఎల్లిసన్‌లలో ఆ పరుగుపందెంలో గెలిచేదెవరు? అన్న చర్చలో, ప్రస్తుత విధానాలు కొనసాగితే దారిద్ర్యనాశనానికి మరో 230 ఏళ్ళుపడుతుందన్న హెచ్చరిక సహజంగానే వెనక్కుపోయింది. సూపర్ రిచ్‌మీద భారీగా పన్నులు వేయండని కొందరు పాశ్చాత్యకుబేరులు ఎప్పటిలాగానే డిమాండ్ చేశారు కానీ, కార్పొరేట్ ఆధిపత్యాలను విచ్ఛిన్నం చేయడం, అధికలాభాలకు, అపరిమిత ఆస్తులకు వీలుకల్పిస్తున్న విధానాలను తిరగదోడటం జరిగేపని కాదు. తక్కువ పన్నురేట్లతో, ఎక్కువ ఎగవేత మార్గాలతో, ఏ మాత్రం పారదర్శకతలేని ప్రభుత్వ విధానాలను సంపన్నులే నిర్దేశిస్తుంటే, అందుకు పూర్తి భిన్నంగా మరింత శ్రమదోపిడీకి వీలైన కార్మికచట్టాలు తయారవుతూంటే పరిస్థితుల్లో మార్పువస్తుందని ఆశించడం వృథా.



కర్పూరీ ఠాకూర్ చూపిన మార్గంలో పనిచేస్తున్న ఓబీసీ కమిషన్ (దీనిని కాంగ్రెస్ వ్యతిరేకించింది)ను ఏర్పాటు చేసిన ఘనత మా ప్రభుత్వానికే దక్కింది. మా 'పీఎం–విశ్వకర్మ' పథకం ఆ సేతు శీతాచలం ఓబీసీ వర్గాలకు చెందిన కోట్లాది శ్రామిక జనావళి శ్రేయస్సుకు కొత్త మార్గాలు తెరిచింది.

'బహుజన భారత' బాంధవుడు


సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసి కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ జీ నూరవ పుట్టిన రోజును నేడు మనం జరుపుకోనున్నాం. ఆ మహనీయుడిని కలిసే అవకాశం నాకు ఎప్పుడూ రాలేదు. అయితే, ఆయనతో సన్నిహితంగా పనిచేసిన కైలాసపతి మిశ్రా నుంచి ఆయన గురించి చాలా విన్నాను. అత్యంత వెనుకబడిన వర్గాలలో ఒకటైన నాయి సమాజ్‌కు చెందిన కర్పూరీ ఠాకూర్ ఎన్నో అడ్డంకులను అధిగమించి దీక్షతో శ్రమించి సమాజ అభ్యున్నతికి ఆయన అకుంఠిత కృషి చేశారు.

నిరాడంబరంగా జీవించిన జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ సామాజిక న్యాయం కోసం పోరాడారు. ఆ పోరాటమే ఆయన జీవితం. తన చివరి శ్వాస వరకు నిరాడంబరమైన జీవనశైలి అనుసరించిన కర్పూరీ ఠాకూర్ సామాన్య ప్రజలతో మమేకమై సామాజిక న్యాయం కోసం కృషి చేశారు.

ఆయన నిరాడంబరత చాటిచెప్పే ఉదంతాలు అనేకం ఉన్నాయి. తన కుమార్తె వివాహంతో సహా ఏదైనా వ్యక్తిగత వ్యవహారాలకు తన సొంత డబ్బు ఖర్చు చేయడానికి ఠాకూర్ ఇష్టపడేవారని ఆయనతో పనిచేసినవారు గుర్తు చేస్తారు. బిహార్ ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో రాజకీయ నాయకుల కోసం ఒక కాలనీ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆయన స్వయంగా ఎలాంటి భూమి, డబ్బు తీసుకోలేదు. 1988లో ఆయన మరణించినప్పుడు పలువురు నాయకులు ఆయన గ్రామానికి వెళ్లి నివాళులు అర్పించారు. ఆయన ఇంటి పరిస్థితి చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఒక గొప్ప వ్యక్తి అంతచిన్న ఇల్లులో ఎలా నివసించారు!

ఆయన నిరాడంబరతకు అద్దం పట్టే సంఘటన ఒకటి 1977లో బిహార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజుల తర్వాత చోటుచేసుకుంది. అప్పుడు ఢిల్లీ, పాట్నాలో జనతా ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆ సమయంలో లోక్‌నాయక్ జేపీ జన్మదినాన్ని పురస్కరించుకుని పాట్నాలో జనతా పార్టీ నేతలు సమావేశమయ్యారు. జేపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు అనేకమంది ప్రముఖులతో కలిసి చిరిగిన కుర్తాతో ముఖ్యమంత్రి హోదాలో కర్పూరీ ఠాకూర్ కూడా వెళ్లారు. ఇది చూసి చంద్రశేఖర్ తనదైన శైలిలో కర్పూరీ ఠాకూర్ కొత్త కుర్తా కొనుక్కోవడానికి కొంత డబ్బు విరాళంగా ఇవ్వాలని ప్రజలను కోరారు. డబ్బులు స్వీకరించిన కర్పూరీ ఠాకూర్ ఆ మొత్తాన్ని సీఎం ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇచ్చారు. అదీ కర్పూరీ ఠాకూర్ గొప్పతనం! తనకు సాటి ఎవరూ లేరని కర్పూరీ ఠాకూర్ తన ప్రవర్తనతో చాటి చెప్పారు.

సామాజిక న్యాయం కోసం జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ పరితపించారు. సామాజిక హోదాతో సంబంధం లేకుండా వనరుల పంపిణీ నిష్పాక్షికంగా జరగాలని ఆయన కోరుకున్నారు. ప్రతి ఒక్కరికి అవకాశాలు లభించే సమాజాన్ని అభివృద్ధి చేయాలని ఆయన కలలు కన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో, భారత సమాజాన్ని పట్టి పీడిస్తున్న వ్యవస్థాగత అసమానతలను నిర్మూలించడానికి ఆయన పట్టుదలతో కృషి చేశారు.



కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న సమయంలో రాజకీయ రంగంలో ఉన్న జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ కాంగ్రెస్ వ్యతిరేక వైఖరిని అవలంబించారు. కాంగ్రెస్ దాని వ్యవస్థాపక సూత్రాల నుంచి పక్కదారి పట్టింది అని ఆయన చాలా ముందుగానే గుర్తించి స్పష్టమైన కాంగ్రెస్ వ్యతిరేక వైఖరిని అవలంబించారు.

1950వ దశకం ప్రారంభంలో జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. తొలి నుంచి ఆయన కార్మికవర్గం, కూలీలు, చిన్న రైతులు, యువకుల పోరాటాలకు అండగా నిలిచారు. చట్టసభల్లో కార్మికులు, కూలీలు, యువత గళం వినిపించి తిరుగులేని శక్తిగా ఎదిగారు. విద్యకు ఆయన అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. తన రాజకీయ జీవితమంతా పేదలకు విద్యా సౌకర్యాలను మెరుగుపరచడానికి కృషి చేశారు. స్థానిక భాషలో విద్యా బోధన జరగాలి అని సూచించారు. దీనివల్ల చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు జీవితంలో విజయం సాధించి ఉన్నత స్థానాలకు ఎదుగుతారని ఆయన భావించారు. ముఖ్యమంత్రిగా సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం అనేక చర్యలు అమలు చేశారు.

ప్రజాస్వామ్యం, చర్చలు, సమావేశాలు కర్పూరీ ఠాకూర్ వ్యక్తిత్వంలో అంతర్భాగంగా నిలిచాయి. చిన్నతనంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న సమయంలో, అత్యవసర పరిస్థితిని వ్యతిరేకించిన సమయంలో ఈ స్ఫూర్తి ఆయనలో మళ్లీ కనిపించింది. జేపీ, డాక్టర్ లోహియా, చరణ్ సింగ్ వంటి వారు ఆయన ప్రత్యేక దృక్పథాలను ఎంతగానో ప్రశంసించారు.

వెనుకబడిన తరగతుల అభివృద్ధి, సంక్షేమం కోసం జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ చేసిన భారతదేశ చరిత్రలో నిలిచిపోతుంది. వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజలకు తగిన గుర్తింపు, అవకాశాలు, గౌరవం లభించాలని ఆయన పట్టుదలతో పని చేశారు. దీనికోసం ఆయన రూపొందించిన విధానాలకు తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అయితే, ఆయన వ్యతిరేకతకు తలొగ్గలేదు. ఒత్తిళ్లకు లొంగలేదు. పుట్టుక ఒకరి భవితవ్యాన్ని నిర్ణయించదు అన్న దృఢ విశ్వాసంతో ఆయన పనిచేసి విధానాలు రూపొందించారు. సమ్మిళిత సమాజానికి పునాది వేసే విధానాలు అమలు చేశారు. సమాజంలో అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన ఆయన అన్ని వర్గాలకు చెందిన ప్రజల కోసం పనిచేశారు. సంకుచిత భావాలతో ఆయన పని చేయలేదు. ఈ స్వభావం ఆయనకు గుర్తింపు, గౌరవం లభించేలా చూసింది.

జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ భావాలు, విధానాలను ఆదర్శంగా తీసుకుని గత పదేళ్లుగా మా ప్రభుత్వం పని చేస్తోంది. సామాజిక సాధికారత సాధించడం లక్ష్యంగా మా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తూ, ప్రజా సంక్షేమ విధానాలు అనుసరిస్తోంది. అయితే, కర్పూరీ ఠాకూర్ వంటి కొద్దిమంది నాయకులకు మినహా సామాజిక న్యాయం నినాదం కేవలం రాజకీయ నినాదంగా మిగిలిపోవడం మన రాజకీయ వ్యవస్థలో అతిపెద్ద విషాదం. కర్పూరీ ఠాకూర్ విధానాల నుండి స్ఫూర్తి పొంది సమర్థమైన పాలనా విధానాన్ని అమలు చేస్తున్నాం. గత కొన్నేళ్లలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం బారి నుంచి విముక్తి పొందారు. వీరంతా అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందినవారు. వలస పాలన నుంచి విముక్తి పొంది దాదాపు 70 సంవత్సరాల తర్వాత కూడా వీరికి తగిన గుర్తింపు, గౌరవం లభించలేదు. సామాజిక న్యాయం సాధన కోసం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందాలి అన్న దృఢ సంకల్పంతో మా ప్రభుత్వం పని చేస్తుంది. మా ప్రభుత్వ విధానాలు, సాధించిన విజయాలు చూసి జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ ఎంతో గర్వపడేవారని నేను నమ్మకంగా, గర్వంగా చెప్పగలను.

నేడు ముద్రా రుణాల వల్ల ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు పారిశ్రామికవేత్తలుగా మారుతున్న తరుణంలో కర్పూరీ ఠాకూర్ కలలుగన్న ఆర్థిక స్వావలంబన కార్యరూపం దాలుస్తోంది. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను పొడిగించే అదృష్టం మా ప్రభుత్వానికే దక్కింది. కర్పూరీ ఠాకూర్ చూపిన మార్గంలో పనిచేస్తున్న ఓబీసీ కమిషన్ (దీనిని కాంగ్రెస్ వ్యతిరేకించింది) ఏర్పాటు చేసిన ఘనత కూడా మాకు దక్కింది. మా పీఎం–విశ్వకర్మ పథకం భారతదేశం అంతటా ఓబీసీ వర్గాలకు చెందిన కోట్లాది మందికి శ్రేయస్సు కొత్త అవకాశాలు అందుబాటులోకి తెచ్చింది.

వెనుకబడిన తరగతులకు చెందిన వ్యక్తిగా నేను జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ గారికి కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిన అవసరం చాలా ఉంది. దురదృష్టవశాత్తూ 64 ఏళ్ల వయసులో కర్పూరీ ఠాకూర్ మరణించారు. చాలా అవసరమైన సమయంలో మనం కర్పూరీ ఠాకూర్ మనకు దూరం అయ్యారు. అయినా ఆయన తన కృషి వల్ల కోట్లాది భారతీయుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన నిజమైన ప్రజా నాయకుడు!

• నరేంద్ర మోదీ
భారత ప్రధానమంత్రి

(నేడు కర్పూరీ ఠాకూర్ శత జయంతి)

మోదీకి రాముడు, ఆమ్ ఆద్మీకి ఎవరు?

అయోధ్యలో సోమవారం రామమందిరంలో జరిగిన శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ భారతదేశ స్వాతంత్ర్యానంతర చరిత్రలో ఒక కీలక ఘట్టంగానే భావించాలి. 1992 డిసెంబర్ 6న పి.వి.నరసింహారావు హయాంలో జరిగిన బాబ్రీ మసీదు కట్టడ విధ్వంసపు తార్కిక ముగింపు 2024 జనవరి 22న జరిగింది. ఈ మధ్యకాలం అంతా భారతీయ జనతా పార్టీ చారిత్రక ప్రయాణం ఒక శిఖరాధిరోహణగా చెప్పవచ్చు. 1991లో 89 సీట్లున్న బీజేపీ ఆ తర్వాత దినదిన ప్రవర్థమానమవుతూనే వచ్చింది. పదేళ్ల పాలన ముగింపు జరుగుతున్న సమయంలోనే ఈ ప్రాణ ప్రతిష్ఠ జరగడం యాదృచ్ఛికం కాదు. ప్రజల దృష్టి మరోవైపు మళ్లకుండా ఉండేందుకు జరిగిన ప్రయత్నంలో భాగంగానే ఈ చారిత్రక ఘట్టం ఆవిష్కృతమయింది. బీజేపీ నేతలు ఊహించిన విధంగానే దేశంలో ప్రజలు ఈ ఘట్టానికి పెద్ద ఎత్తున ప్రతిస్పందించారు. వాడవాడలా ప్రజలు శ్రీరాముడి పట్ల తమ భక్తి శ్రద్ధలు చాటుకున్నారు. ఈ ఘట్టాన్ని విస్మరించాలనుకున్న వారు కూడా విస్మరించలేకపోయారు. ఒక భావోద్వేగం దేశమంతటా వెల్లివిరిసినట్లు కనిపించింది. దేశమంతటా కాషాయ పవన ప్రభంజనం వీచిందేమో అనిపించింది. ఈ క్రమంలో రాహుల్ భారత్ జోడో న్యాయయాత్ర గురించి వార్తలు గాలిలో కొట్టుకుపోయాయి. తమ వార్తలు ఎక్కడున్నాయో ప్రతిపక్షాలు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అయితే ప్రజలు భక్తి శ్రద్ధలు ప్రకటించినంత మాత్రాన దేశంలో భారతీయ జనతా పార్టీకి తిరుగులేదని భావించడం సరైనదా? బీజేపీ ఈ ఘట్టాన్ని రాజకీయాలకు, ఎన్నికల్లో విజయానికి ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తుందన్న విషయం ఆ పార్టీ వారు కూడా కాదనలేరు. కొంతకాలంగా బీజేపీ నేతలందరూ మందిరాల చుట్టూ తిరుగుతూ వాటిని ప్రక్షాళనం చేస్తున్నారు. శ్రీరామజన్మభూమి ఆలయంలో రామ్ లల్లా విగ్రహం ప్రతి ఫ్రేమ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కనపడేలా ప్రత్యక్ష ప్రసారాలు జరిగాయి. ఆ కార్యక్రమం తర్వాత మోదీ దృష్టిని ఆకర్షించేందుకు రాజకీయ నాయకులు, ముఖేశ్ అంబానీ వంటి వ్యాపారవేత్తలు, అమితాబ్ బచ్చన్ వంటి సినీనటులు, సాధ్వీ రితంబర, వీరభద్రాచార్య వంటి యోగి పుంగవులు, ఇంకా ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు ఉత్సుకత ప్రదర్శించారు. మోదీని రాజర్షి అని, ఒక భగవదంశ అని సాధువులు కొనియాడారు. ఇక రానున్నది రామరాజ్యమే అని ఒక సాధువు ప్రకటించారు. దేశంలో ఒక బలమైన అధికార వ్యవస్థ చుట్టూ మతం, రాజకీయం, వ్యాపారం సంఘటితం కావడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. గతంలో రాచరిక వ్యవస్థలోనూ ఇవే లక్షణాలు కొనసాగాయి. ఈ వ్యవస్థను ఎదుర్కోవడం అంత సులభమేమీ కాదు.

మోదీ పూజ చేయడంతో పాటు పలువురి దృష్టిని ఆకర్షించిన మరో దృశ్యం ఆయన ప్రాణప్రతిష్ఠ చేస్తున్న సమయంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ ఆయన పక్కనే నిలుచుని పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు ఉన్న అనేక అనుబంధ సంస్థల్లో భారతీయ జనతా పార్టీ ఒకటి. అందువల్ల మోదీ ప్రాణప్రతిష్ఠ చేస్తున్నారంటే ఆ కార్యక్రమాన్ని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మాత్రమే ఆయన ద్వారా చేయిస్తూ ఉండాలి. అక్కడకు వచ్చిన సాధువుల్లో అత్యధికులు ఆరఎసఎస్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్నవారే. అందువల్ల ఇది ఒక గురువు మరో శిష్యుడితో చేయిస్తున్న కార్యక్రమంగానే భావించాలి. భాగవత్‌ను పక్కన ఉంచుకోవడం ద్వారా ఒక బలమైన సంస్థ తన వెనుక ఉన్నదన్న సంకేతాన్ని మోదీ ప్రపంచ వ్యాప్తంగా పంపారు. నిజానికి బాబ్రీ మసీదు కట్టడం కూల్చివేయడం కూడా ఆరఎసఎస్ ఒక పద్ధతి ప్రకారం నిర్వహించింది. ఆ రోజు సర్ సంఘ్ చాలక్ సుదర్శన్ జీ శిలాన్యాస్ దగ్గరుండి నిర్వహించారు. ఈ రోజు మరో సంఘ్ చాలక్ శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను దగ్గరుండి మరీ చేయించారు.



రామమందిర ప్రచార హోరులో తన అప్రజాస్వామిక, ఏకపక్ష, నియంతృత్వ చర్యలకు ఆమోదయోగ్యత లభిస్తుందని, తన వైఫల్యాలను ఎవరూ పట్టించుకోరని మోదీ భావిస్తుండవచ్చు. ఈ ఆమోదయోగ్యత దేశ వ్యాప్తంగా లభిస్తుందా? ఉత్తరాది రాష్ట్రాలకూ, దక్షిణాది రాష్ట్రాలకు ఈ విషయంలో వ్యత్యాసం ఉంటుందా అన్న చర్చను పక్కన పెడితే మోదీ ఎజెండా స్వభావాన్ని ప్రజలు అర్థం చేసుకునేలా చేయగల శక్తి ప్రతిపక్షాలకు ఉన్నప్పుడే అవి విజయం సాధించగలవు. ఎన్నికల్లో స్పష్టంగా ప్రజల సమస్యలు, వారి నిత్యావసరాలు, నిరుద్యోగం, ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు, ప్రజాస్వామిక నిబద్ధతలు, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం మొదలైనవన్నీ చర్చనీయాంశం కావాలి.

ఈ కార్యక్రమం తర్వాత రామజన్మభూమికి సంబంధించిన సానుకూల వాతావరణం వేడి తగ్గకుండా ఉండేందుకు సంఘ్ పరివార్ సంస్థలన్నీ మరో రెండు, మూడునెలల్లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మోదీ గెలుపునకు ఉధృతంగా పనిచేస్తాయనడంలో సందేహం లేదు. సంఘ్ పరివార్‌లో పలువురు పెద్దలు అంతర్గతంగానైనా మోదీ వ్యవహార శైలిని విమర్శించేవారు. కాని ఇప్పుడు ఆ విమర్శలను వారు పక్కన పెట్టక తప్పదు. నిజానికి 1950వ దశకంలో గోల్వాల్కర్ ఆరఎసఎస్ సర్ సంఘ్ చాలక్‌గా ఉన్న కాలంలో తొలి రోజుల్లో రాజకీయ పార్టీల పట్ల ఏహ్యభావంతో ఉండేవారు. మన సాంస్కృతిక ఆధ్యాత్మిక వారసత్వ సంపదను పునరుద్ధరించడానికి రాజకీయాలు అవసరం లేదని, రాజకీయాల్లో ఉన్న పోటీతత్వంలో విచ్ఛిన్నకర స్వభావం వల్ల తమ లక్ష్యానికి విఘాతం కలుగుతుందని ఆయన భావించారు. అధికార రాజకీయాల వల్ల ఆ రాజకీయాల్లో ఉన్న వారిపై అనైతిక ప్రభావం పడుతుందని అభిప్రాయపడ్డారు. అలాంటి గోల్వాల్కర్ భావసారూప్యం గల రాజకీయ వేదిక ఏర్పాటు చేయడం అవసరమని భావించినందువల్లే తొలుత జనసంఘ్, తర్వాత బీజేపీ ఏర్పాటుకు వీలు కలిగింది. ఇప్పుడు అధికార రాజకీయాలు ఎంత కలుషితమైనా, ఎంత అనైతికమైనా పట్టించుకోగలిగిన స్థితిలో సంఘ్ పెద్దలూ లేరు. అధికార రాజకీయాల్లో వారూ భాగమయ్యారు. రామమందిర దర్శనంతో పాటు మోదీ విశ్వరూప సందర్శనం కూడా కలిసి మెలిసి సాగుతాయి. వ్యక్తి ఆరాధన పెంచారని ఇందిరాగాంధీని విమర్శించిన వారే మోదీ ఆరాధనను తార స్థాయికి తీసుకువెళుతున్నారు.

రానున్న మూడు నెలల్లో కోటి మంది రామమందిరాన్ని దర్శిస్తారని బీజేపీ నేతలు భావిస్తుండగా, రెండో రోజునే 3 లక్షల మందికి పైగా దర్శించుకోవడం గమనార్హం. 'జో రామ్ కో లాయే హై హమ్ ఉన్ కో లాయేంగే' (రాముడిని తీసుకువచ్చిన వారినే మేము అధికారంలోకి తీసుకువస్తాం) అని కన్హయ్యా మిట్టల్ పాడిన పాట ఇప్పటికే ఉత్తరాదిన విస్తృతంగా ప్రచారమవుతోంది. కాంగ్రెస్ బీజేపీతో అయితే రాజకీయంగా పోరాడగలదు కాని శ్రీరాముడితో ఎలా పోరాడగలదు?' అని మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు ఎప్పుడో ప్రశ్నించారు. 2014లో నరేంద్రమోదీ తొలిసారి దేశ రాజకీయాల్లో అడుగుపెట్టినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల వ్యతిరేకతపైనే దృష్టి సారించారు. 2019లో ఆయన తన ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను తట్టుకునేందుకు పుల్వామా, బాలాకోట్ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి జాతీయ వాదాన్ని ఎన్నికల్లో ప్రధానాంశంగా మార్చారు. ఈ అయిదేళ్లు ఆయన ఎంత అభివృద్ధి గురించి మాట్లాడినా జాతీయవాద తీవ్రతను క్రమక్రమంగా పెంచుతూ వచ్చారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేశారు. ఇప్పుడు 2024లో ఆయనకు నేరుగా శ్రీరాముడే తోడయ్యారు. ఈ పదేళ్లలో ఆయన హిందూత్వను తన రాజకీయాల్లో ఒక అంతర్లీన అంశంగా జోడిస్తూనే వచ్చారు.



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

వీలున్నప్పుడల్లా ఆలయాలను సందర్శిస్తూ వార్తల్లో ఉంటూనే వచ్చారు. కాశీ, ఉజ్జయిని కారిడార్లను ప్రారంభించారు. నదుల్లో స్నానాలు చేసి తర్పణలు గావించారు. అయోధ్య ప్రాజెక్టును ఒక పద్ధతి ప్రకారం ఆయన రూపొందించుకుని 2024 ఎన్నికలకోసం సిద్ధంగా ఉంచుకున్నారు. 'ప్రజలు మతానికి ఎంత గాఢంగా హత్తుకుపోతే వారిని పాలించడం అంత సులభం. రాజు తన రాజకీయాలకోసం మతాన్ని ఉపయోగించుకోవాలి' అని ఇటాలియన్ రాజకీయ తత్వవేత్త నికోలో మాకియవెల్లి లాంటి వాళ్లు ఎప్పుడో చెప్పారు. ఇప్పుడు మతానికీ, రాజకీయాలకూ తేడాలేనంత స్పష్టంగా వ్యవహరించడం మోదీ చేస్తున్న వినూత్న ప్రయోగం.

ఇవాళ మారుతున్న వాతావరణం చూస్తుంటే నుదుటిపై బొట్టు పెట్టుకుంటే మనను బీజేపీ అభిమానులుగా భావిస్తారేమో అన్న ఆలోచన కలుగుతోంది. మనం వెలిగించే దీపంలో రాజకీయం కదులుతున్నట్లనిపిస్తోంది. భక్తికీ, రాజకీయానికీ పెద్ద తేడా కనపడని పరిస్థితితో పాటు భక్తి ఒక పార్టీ స్వంతమా అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. లేకపోతే అస్సాంలో రాహుల్ గాంధీని గుడికి వెళ్లకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఎందుకు ఏర్పడింది? అయినప్పటికీ రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీల ముందు ఏది ఎజెండా కావాలన్న విషయంలో ప్రజలే ఒక స్పష్టమైన వైఖరిని అవలంబించగలరు. రాజకీయ నేతలకంటే ప్రజలే వివేకంగా ప్రవర్తించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈ పదేళ్ల కాలంలో మోదీ ఒకవేళ నిర్మాణాత్మకమైన పనులు ఏమైనా చేసి ఉంటే రామమందిర ప్రచార హోరులో ఆ పనులు కొట్టుకుపోతాయని భయంగా ఉన్నదని ఒక బీజేపీ నాయకుడు చెప్పారు. కాని ఈ హోరులో తన అప్రజాస్వామిక, ఏకపక్ష, నియంతృత్వ చర్యలకు ఆమోదయోగ్యత లభిస్తుందని, తన వైఫల్యాలను ఎవరూ పట్టించుకోరని కూడా మోదీ భావిస్తుండవచ్చు. ఈ ఆమోద యోగ్యత దేశ వ్యాప్తంగా లభిస్తుందా? ఉత్తరాది రాష్ట్రాలకూ, దక్షిణాది రాష్ట్రాలకు ఈ విషయంలో వ్యత్యాసం ఉంటుందా అన్న చర్చను పక్కన పెడితే మోదీ ఎజెండా స్వభావాన్ని ప్రజల్లో అర్థం చేసుకునేలా చేయగల శక్తి ప్రతిపక్షాలకు ఉన్నప్పుడే అవి విజయం సాధించగలవు. ఎన్నికల్లో స్పష్టంగా ప్రజల సమస్యలు, వారి నిత్యావసరాలు, నిరుద్యోగం, ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు, ప్రజాస్వామికంగా వ్యవహరించిన తీరు, అణగారిన వర్గాలకు జరిగిన సామాజిక న్యాయం ఇవన్నీ చర్చనీయాంశం కావాలి. ఇవేవీ చర్చనీయాంశం కాకుండా కేవలం రామమందిరమే ఎన్నికల ఎజెండాను నిర్ణయిస్తే

పెట్టుబడి జాతరలో రేవంత్ సర్కార్

గల్ఫ్ లేఖ

తెలంగాణ ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజులకే ఎ.రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లారు. వర్ధమాన దేశాలు ప్రతిష్ఠాత్మకంగా భావించే స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు వెళ్ళి రావడం జరిగింది. పెట్టుబడి, పారిశ్రామికవేత్తల జాతరగా భావించె దావోస్‌లోని ప్రపంచ ఆర్థిక సదస్సులో పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో ఒక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాధినేతగా రాష్ట్రంలోని అవకాశాలపై ఆయన మాట్లాడిన తీరు అభినందనీయం. ప్రపంచ వ్యాప్తంగా ఏ రకమైన వాణిజ్య లేదా పరిశ్రమ కార్యకలాపాలయినా సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా తమ సామర్థ్యాన్ని పెంపొందించవల్సిన అవశ్యకత ఏర్పడిందని తెలంగాణ బృందం నొక్కి చెప్పింది. అసలు ఐ.టి. సాంకేతిక పరిజ్ఞాన సహాయం లేకుండా వర్తమాన కాలంలో వ్యాపార సంస్థలు మనుగడ సాధించడం కష్టమని ప్రస్తావిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలో ఏ పరిశ్రమ లేదా వ్యాపార సంస్థకు అవసరమైన ఐ.టి. సాంకేతిక నైపుణ్య సహాయాన్ని అందించే సామర్థ్యం తెలంగాణ రాష్ట్రానికి ఉందని ముఖ్యమంత్రి బృందం సోదాహరణంగా వివరించింది.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రి, పరిశ్రమల మంత్రికి దావోస్ వేదిక ప్రప్రథమం కావచ్చు కానీ పరిశ్రమల కార్యదర్శి జయేశ్ రంజన్‌కు ఈ రకమైన అనేక వేదికలు, సదస్సులు, భేటీలలో పాల్గొని కీలకపాత్ర పోషించిన అనుభవం అపారంగా ఉంది. అదే విధంగా, విదేశీ వ్యవహారాల శాఖలో దౌత్యవేత్తగా యూరోప్ డివిజన్‌లో పని చేసిన ఇ. విష్ణువర్ధన్ రెడ్డి ప్రస్తుతం డిప్యూటేషన్‌పై తెలంగాణ ప్రభుత్వంలో ఉన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో విదేశీ పెట్టుబడులు, విదేశాలకు సంబంధించిన ఇతర అంశాలను పరిశీలించే విష్ణువర్ధన్ రెడ్డి ఒక బ్యూరోక్రాట్‌గా కాకుండ ఒక డిప్లోమాట్‌గా వ్యవహరించడం రాష్ట్ర ప్రభుత్వానికి కలిసి వచ్చే అంశం.

ముఖ్యమంత్రితో పాటు వెళ్ళిన పరిశ్రమలు, ఐటి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబులు వ్యక్తిగతంగా అనేక మంది పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలతో సమావేశమై తమ రాష్ట్రంలో ఉన్న అవకాశాల గురించి విడమర్చి చెప్పారు. తమకు కల్గిన కొన్ని సందేహాలపై మంత్రి శ్రీధర్ బాబుతో అరబ్బు పారిశ్రామికవేత్తలు, వారి సంస్థలలో ఉన్నత హోదాలలో పని చేసే పాశ్చాత్య దేశస్థులైన అధికారులు కొందరు అడిగిన ప్రశ్నలకు ఆయన నివృత్తి చేసిన తీరులో నిజాయితీ కనిపించింది. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా ప్రభుత్వాలు మారడం సహజం గానీ పెట్టుబడుల విషయంలో ప్రతి ప్రభుత్వం కూడ గత ప్రభుత్వం కంటె మెరుగ్గా కృషి చేస్తుందని మంత్రి బృందం చెప్పడం పార్టీలకు అతీతంగా విదేశీగడ్డపై తెలంగాణ ప్రతిష్ఠను పెంపొందించడంలో నూతన ప్రభుత్వ చిత్తశుద్ధిని వెల్లడించిందని చెప్పవచ్చు. ఒక నెల వయస్సు కల్గిన నవ ప్రభుత్వం నుండి అంతకు మించి ఆశించడం సబబు కూడా కాదు.



ప్రజాస్వామ్యప్రక్రియలో భాగంగా ప్రభుత్వాలు మారడం సహజం గానీ పెట్టుబడుల విషయంలో ప్రతి ప్రభుత్వం కూడ గత ప్రభుత్వం కంటె మెరుగ్గా కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం చెప్పడం పార్టీలకు అతీతంగా విదేశీగడ్డపై తెలంగాణ ప్రతిష్ఠను పెంపొందించడంలో నూతన ప్రభుత్వ చిత్తశుద్ధిని వెల్లడించిందని చెప్పవచ్చు. ఒక నెల వయస్సు కల్గిన నవ ప్రభుత్వం నుండి అంతకు మించి ఆశించడం సబబు కూడా కాదు.

ఒక కీలక మంత్రిగా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి తర్వాయి స్థానంలో చక్రం తిప్పిన కె.టి.ఆర్ మంత్రి అయిన నాలుగు సంవత్సరాలకు దావోస్‌కు వెళ్ళగా రేవంత్ రెడ్డి, శ్రీధర్ బాబులు సర్కారు కొలువు తీరిన కేవలం ఒక నెలలోపే వెళ్ళారనేది గమనించాలి. స్విట్జర్లాండ్, బ్రిటన్, యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్, సౌదీ అరేబియాలలో బృందాలు వేర్వేరుగా ప్రవాసులతో కూడ సమావేశమయ్యాయి. సమయా భావం, చివరి వరకు తిరుగు ప్రయాణంలో అనిశ్చిత పరిస్థితుల మధ్య కూడ వీలయినంత ఎక్కువ మంది తెలంగాణ ప్రవాసులను కలుసుకోవడానికి ఆసక్తి చూపడం అభినందనీయం.

ముఖ్యమంత్రికి ఇది మొదటి అధికారిక పర్యటన కావడంతో సహజంగా ఆయన విదేశీ గడ్డపై ఏ విధంగా వ్యవహరించారనే విషయమై అందరూ ఆసక్తి చూపడం కద్దు. దావోస్‌లో ఒక భారతీయ న్యూస్ చానెల్ ప్రతినిధితో కరచాలనం చేస్తూ మాట్లాడిన కొన్ని మాటల ఆధారంగా రేవంత్ ఆంగ్ల భాషా పరిజ్ఞానం విషయమై సామాజిక మాధ్యమాలలో విపక్షాలు చర్చ మొదలుపెట్టాయి. ఆయనకు ఆంగ్ల భాషానైపుణ్యం లేకపోవడంతో అంతర్జాతీయ వేదికలపై తెలంగాణను ప్రపంచం ఎలా చూస్తుందనే విషయాలపై ఒక రచ్చ లేపారు. ఒక నాయకుడి విద్యార్హతలు, భాష ప్రావీణ్యతను మరొక నాయకుడితో పోల్చరాదు. బహు భాష కోవిదులు అయినా పాలన దక్షత లోపించి అనేక మంది హేమాహేమీలు వెనుకబడ్డారు. పి.వి. నర్సింహారావుతో పోల్చితె జలగం వెంగళరావు అన్నింటా వెనుకబడ్డా ఒక సమర్ధ నేతగా, పాలనా దక్షుడిగా చరిత్రకెక్కారు. ఆంగ్లం తెలియని దివంగత కరుణాకరన్ రాజకీయ చతురత ముందు ఆంగ్ల భాషా కోవిదుడయిన శశి థరూర్ పూర్తిగా శూన్యమని చెప్పవచ్చు. కేవలం తన స్వంత బిహారి యాసలో మాట్లాడె లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా సాధించిన ప్రగతి అమెరికా, బ్రిటన్‌లలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల బిజినెస్ విద్యార్థులకు ఒక ఆదర్శంగా నిలిచింది.

ప్రభుత్వం నడపడానికి ప్రభుత్వాధినేతగా ముఖ్య మంత్రికి కావల్సింది దార్శనికత, దక్షత కానీ ఆంగ్ల భాషా పరిజ్ఞానం కాదు. భాషా ప్రతిపాదికన ప్రతిష్ఠ పెరిగి పెట్టుబడులు వస్తే, మరీ అరబ్బీ భాష మాట్లాడె అరబ్బు ప్రపంచంలో మరియు మాండరిన్ భాషకు మాత్రమే పరిమితమైన చైనాలో విదేశీ పెట్టుబడులు ఏ విధంగా వస్తున్నాయో తెలుసుకోవాలి. స్వయాన మన భారతదేశంలో ఇప్పటి వరకు పని చేసిన ప్రధానులందరిలోనూ నరేంద్ర మోదీకి ఇతర ప్రధానులతో పోల్చితె ఆంగ్ల భాష పరిజ్ఞానం తక్కువ. అయినా దౌత్యపరంగా ఇతర ప్రధాన మంత్రులు అందరి కంటే చాల సమర్థంగా అరబ్బులతో దౌత్యక సంబంధాలు నెలకొల్పారనే విషయాన్ని విస్మరించరాదు. ఒక నాయకుని పాలన దక్షత, దార్శనికతతో ఆ నేత భాషా పరిజ్ఞానాన్ని ముడిపెట్టకూడదు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్

హేతుబద్ధ ఆలోచనకు యువత దూరమవుతోందా?

'ఈ రోజు (జనవరి 22) రామ జన్మభూమిలో రాముని విగ్రహం ప్రతిష్ఠ అయింది కదా. మన ఇంట్లో దీపాలు వెలిగిద్దాం' అని మా అమ్మాయి ఆఫీసు నుంచి వచ్చిన నాతో అంది. సరే, నీ ఇష్టం అన్నాను. కానీ ఒక్కసారిగా ఆలోచనలో పడ్డాను. కొద్దిగా మోడరేట్ అయిన పీజీ చేస్తున్న నా కూతురు, దేశంలోని కోట్లాది మంది లాగే, జై శ్రీరామ్ హోరులో పడిపోయింది. ఒక రెండు దశాబ్దాల కిందటి వరకు అస్తిత్వ కార్యక్రమాలు ఎన్ని జరిగాయో, నాస్తిక ఉద్యమాలు, సభలు, సమావేశాలు అంతే స్థాయిలో జరిగేవి. హేతువాద ఉద్యమం, నాస్తికోద్యమం, కుల రహిత సమాజం... ఎన్నో భిన్న వేదికల పేరుతో, ఎన్నో సామాజిక సంస్కరణ ఉద్యమాలు జరిగేవి. మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అనేక మంది యువకులు ఇంటర్ పూర్తి చేసి డిగ్రీలో చేరే సరికి, ఈ విధమైన హేతువాద, నాస్తిక, కుల రహిత ఉద్యమాల పట్ల ఆకర్షితులయ్యేవారు. ప్రధానంగా, వామపక్ష విద్యార్థి సంఘాల పట్ల ఆకర్షితులయ్యేవారు ఈ నాస్తిక, హేతువాద ఉద్యమాల పట్ల అనుకూలతతో ఉండేవారు. ఒక్కోసారి, కళాశాలల్లో మతప్రాతిపదికన కూడా విద్యార్థులు చీలిపోయేవారు. మొత్తానికి, దేవుడున్నాడని కొందరు, లేడని కొందరు, దేవుడి పేరుతో రాళ్లూ రప్పలను పూజించడం ఏంటని ప్రశ్నిస్తూ ఎన్నో పుస్తకాలు కూడా వచ్చేవి. ఇలా, ఒక ఆరోగ్యకరమైన ప్రశ్నించే వాతావరణం అప్పట్లో ఉండేది. సరే, జీవితంలో స్థిరపడి, వయస్సు మీదపడ్డ అనంతరం ఏ వాదానికి అనుకూలం కాకుండా ఉన్నవారు కూడా ఎంతోమంది ఉన్నారు.

అయితే, గత దశాబ్దన్నర కాలంగా ఈ విధమైన హేతువాద, నాస్తిక, కుల రహిత ఉద్యమాలు రాష్ట్రంలో పూర్తిగా తగ్గిపోయాయి. ఉధృతంగా జరిగిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఈ విధమైన ఉద్యమాలు పూర్తిగా కనుమరుగయ్యాయని చెప్పొచ్చు. ఇదే, సమయంలో కేంద్ర ప్రభుత్వంలో భారతీయ జనతాపార్టీ అధికారంలో రావడం, ఒక పద్ధతి ప్రకారం హిందూ మతప్రచారం పెద్ద ఎత్తున కొనసాగడం, ఇప్పటి యువత ఈ హిందూ మత ప్రచారంలో తమకు తెలియకుండానే కొట్టుకుపోవడం మనం చూస్తున్నాం. గతంలో ప్రతి పదిమందిలో కనీసం ముగ్గురైనా హేతువాదాన్ని అవలంబించేవారుండేవారు. ఇప్పుడయితే ఒకస్సైడే. దీనికి ప్రధాన కారణం, గణేష్ నవరాత్రులు, బతుకమ్మ, దుర్గా నవరాత్రులు, దాండియా, హనుమాన్ జయంతి ఇలా ప్రతీదీ మతకోణంలో చూడడం, వీటిని పెద్ద ఎత్తున నిర్వహించడం వల్ల ఇవి సాంస్కృతిక ఉత్సవాలుగా మారి యువత తమకు తెలియకుండానే మత విశ్వాసాలకు మళ్లుతున్నారు. మత విశ్వాసాలు ఉండడం తప్పని అనడం కాదుకానీ... ప్రశ్నించే తత్వాన్ని, హేతుబద్ధంగా ఆలోచించే విధానాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని ఇప్పటి యువతకు దూరం చేస్తుందనే అనుమానం కలుగుతోంది.

— ------------------------------------

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3 కనిష్ఠం 20.3



'పగ్స్' దుస్తులు, ఆక్సిజన్ మాస్కులు ధరించి అవగాహన కల్పిస్తున్న పెటా సభ్యులు

'పగ్స్' వద్దు.. వీధి శునకాలు ముద్దు

వీధి కుక్కలను పెంచుకోవాలని పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ ఆనిమల్స్ (పెటా ఇండియా) ప్రచార సమన్వయ కర్త ఉత్కర్ష్‌గార్గ్ సూచించారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో పేటా ఆధ్వర్యంలో పగ్స్ జాతి శునకాల రూపంలో ఉన్న దుస్తులు, ఆక్సిజన్ మాస్కులు ధరించి వాటికి శ్వాస తీసుకోవడంలో ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించారు. పగ్స్ జాతి శునకాల పెంపకంపై నిషేధం విధించాలని కేంద్ర పశు సంవర్ధకశాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలకు ఫిర్యాదు చేశామన్నారు. పెటా ఇండియా చేసిన ప్రచారం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.

- కవాడిగూడ, ఆంధ్రజ్యోతి

'స్థానిక' రగడ

- రంగారెడ్డి, మేడ్చల్‌లో అవిశ్వాసాల జోరు
- మీర్‌పేట్‌లో మేయర్ బీజేపీకి.. కాంగ్రెస్‌కు 'డిప్యూటీ'పై ఒప్పందం
- నెగ్గి తీరుతాం : జవహర్‌నగర్ అసమ్మతి కార్పొరేటర్లు

8

19.85 లక్షలు

- గ్రేటర్‌లో గృహజ్యోతి దరఖాస్తుల సంఖ్య ఇదీ
- విధి విధానాలు ప్రకటిస్తే మరిన్ని పెరిగే అవకాశం
- ఉచిత విద్యుత్ కోసం నగరవాసులు ఎదురుచూపు
- 200 యూనిట్లలోపు అందించేందుకు డిస్కం కసరత్తు
- గ్రేటర్‌లో 52 లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లు
- 200 యూనిట్ల లోపు వాడే వారు 28 - 30 లక్షలు
- అర్హుల గుర్తింపునకు ప్రత్యేక పోర్టల్ రూపకల్పనకు ప్రణాళికలు



కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో ఒకటైన గృహజ్యోతి పథకం అమలుపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) కసరత్తు మొదలు పెట్టింది. గృహ జ్యోతి కింద గ్రేటర్‌లో 19.85 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు గుర్తించింది. ఉచిత విద్యుత్‌పై ప్రభుత్వం విధి విధానాలు ప్రకటిస్తే అర్హుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

హైదరాబాద్ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో 52 లక్షల గృహవిద్యుత్ వినియోగదారుల్లో సుమారు 30 లక్షల కనెక్షన్లు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్నారు. గ్రేటర్‌లో అర్హుల సంఖ్య 30 లక్షలు ఉన్నా.. పూర్తిస్థాయిలో గృహజ్యోతికి దరఖాస్తులు రాలేదు. అద్దె ఇళ్లల్లో ఉంటున్న లక్షల మంది దరఖాస్తు చేసుకోకపోవడం, ఉచిత విద్యుత్ పై ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించకపోవడంతో దరఖాస్తుల సంఖ్య తక్కువగా వచ్చినట్లు తెలుస్తోంది. ఈ పథకాన్ని అమల్లోకి తీసుకువస్తే ప్రభుత్వం ప్రతినెలా డిస్కంకు రూ. 220 కోట్లు చెల్లించాల్సి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పథకం అమలు చేసేందుకు ఉన్న అవకాశాలపై డిస్కం దృష్టిసారించింది. కర్ణాటక రాష్ట్రంలో ఇప్పటికే ఈ పథకం అమలు చేస్తున్న నేపథ్యంలో అక్కడి పరిస్థితులపై ఉన్నతాధికారులు సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నారు. గృహజ్యోతి అమలు చేస్తే తలెత్తే సాంకేతిక సమస్యలు, ఉచిత విద్యుత్‌తో పెరిగే డిమాండ్, క్షేత్రస్థాయిలో విద్యుత్ శాఖ తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ ప్రారంభించారు. కర్ణాటక తరహాలో గృహజ్యోతి పథకం అమలుకు రాష్ట్రంలో విద్యుత్‌శాఖ ఓ ప్రత్యేక పోర్టల్ అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం ఉందని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

200 యూనిట్ల లోపు..

గ్రేటర్‌లో 20-25 శాతం గృహ కనెక్షన్‌దారులు వినియోగించే విద్యుత్ యూనిట్లు ప్రతినెలా మారుతుంటాయి. వేసవి కాలం ఫిబ్రవరి నుంచి మే వరకు సాధారణం కంటే 30-40 శాతం విద్యుత్‌డిమాండ్ అధికంగా నమోదవుతుంది. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు 20 సర్కిళ్లు ఉండగా గ్రేటర్‌జోన్ పరిధిలో 9 సర్కిళ్లు కీలకం. డిస్కంకు వచ్చే ఆదాయం 65 శాతం గ్రేటర్‌జోన్ నుంచి వస్తుంది. ఈ లెక్కన గృహజ్యోతి అమల్లోకి తీసుకొస్తే గ్రేటర్‌లో సుమారు 25 లక్షల వినియోగదారులకు లబ్ధి చేకూరే అవకాశాలుంటాయని ఓ అంచనా. గ్రేటర్‌జోన్ నుంచి టీఎస్ఎస్పీడీసీఎల్‌కు గృహ, కమర్షియల్, హెచ్‌టీ కేటగిరిలో ప్రతినెలా రూ. 900-1200 కోట్ల విద్యుత్‌బిల్లులు వసూలవుతుంటాయి. డిస్కంకు వచ్చే ఆదాయంలో 65-70 శాతం కమర్షియల్, హెచ్‌టీ కనెక్షన్ల ద్వారా వస్తుంది. ఈ కారణంగా గృహలక్ష్మి అమల్లోకి తెచ్చినా భారీ నష్టాలు వచ్చే అవకాశాలు తక్కువేనని కొంతమంది అధికారులు అంటున్నారు. గృహజ్యోతితో విద్యుత్ చౌర్యం నివారించడంతో పాటు ప్రతి యూనిట్ విద్యుత్ బిల్లు పరిధిలోకి వస్తుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం గృహజ్యోతి విద్యుత్ బిల్లులను ప్రతినెలా విద్యుత్ సంస్థలకు చెల్లిస్తే ఆర్థికంగా కొంత నిలదొక్కుకుంటాయని రిటైర్డు అధికారులు సూచిస్తున్నారు.

కర్ణాటకలో ఇలా..

కర్ణాటకలో గృహజ్యోతి పథకంలో భాగంగా ప్రతి కనెక్షన్‌కు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. గతంలో కనెక్షన్‌దారుడు ప్రతినెలా ఎంత విద్యుత్ వినియోగించాడో గుర్తించి దానికి మరో 15-20 శాతం అదనంగా వాడే వెసులుబాటు కల్పిస్తున్నారు. దరఖాస్తుదారుడు కనీసం ఏడాది పాటు కర్ణాటకలో నివసించినవారై ఉండాలి. కుటుంబంలో ఒక సభ్యుడు మాత్రమే అర్హుడు. 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగిస్తే దానికి యూనిట్ ప్రకారం చార్జీ విధిస్తున్నారు. గృహజ్యోతి అమలుకోసం ప్రత్యేకంగా "సేవా సింధు పోర్టల్ గృహజ్యోతి వెబ్‌సైట్" అందుబాటులోకి తీసుకొచ్చింది. దరఖాస్తు దారుడు ఆధార్, విద్యుత్ కనెక్షన్ నెంబర్‌లను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. అద్దెదారులయితే ఒప్పంద పత్రం (రెంటల్ అగ్రిమెంట్), లేదా నివాస రుజువు పత్రం అందజేయాలి. ఆన్‌లైన్‌తో పాటు నేరుగా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కర్ణాటక ప్రభుత్వం ప్రజలకు కల్పిస్తోంది. ఈ పథకాన్ని గత ఏడాది ఆగస్టు 5వ తేదీ నుంచి అందుబాటులోకి తీసుకొచ్చింది. 2.14 కోట్ల మంది 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వినియోగించుకుంటున్నారు.

వేర్వేరు గదుల్లో ఇద్దరి ఆత్మహత్య

- వరుసకు అక్కా తమ్ముళ్లు
- ఎవరిమీద అనుమానం లేదు


స్రవంతి


సీహెచ్ శేఖర్ గౌడ్

రాజేంద్రనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఒకే ఇంట్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. వారిద్దరూ వరుసకు అక్కా తమ్ముళ్లు. యాదాద్రి భువనగిరి జిల్లా, అడ్డగూడురు మండలం, ధర్మారం గ్రామానికి చెందిన కప్పె సోమయ్య గౌడ్, కప్పె నర్సింహగౌడ్ అన్న దమ్ములు. బతుకు దెరువు కోసం వారు నగరానికి వచ్చి హైదర్‌గూడ కేశవ్‌నగర్‌లో నివసిస్తున్నారు. నర్సింహగౌడ్ వదిన స్వప్న పై అంతస్తులో నివసిస్తుండగా, కింది పోర్షన్‌లో సోమయ్య, స్రవంతి దంపతులు నివసిస్తున్నారు. ఐదేళ్లుగా స్వప్న సోదరుడు సీహెచ్ శేఖర్‌గౌడ్ ఆమె వద్ద ఉంటున్నాడు. పది రోజుల క్రితం సోమయ్యగౌడ్, నర్సింహగౌడ్ బంధువులు ధర్మారంలో చనిపోయారు. మంగళవారం దశదినకర్మ ఉండగా సోమయ్యగౌడ్, నర్సింహగౌడ్, స్వప్న అక్కడికి వెళ్లారు. సోమయ్య భార్య స్రవంతి, పిల్లలు శశికుమార్(11), చందు(8) ఇంట్లోనే ఉన్నారు. నర్సింహగౌడ్ బావమరిది సీహెచ్ శేఖర్‌గౌడ్ కూడా ఇంటి వద్దనే ఉన్నాడు.

స్కూల్ నుంచి వచ్చి చూడగా..

మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో సోమయ్య స్రవంతి

మిగతా 8వ పేజీలో..

రూ. వెయ్యి ఇవ్వడానికి వెళ్తే..

70 గ్రాముల మంగళసూత్రం తెంపుకొని పరారీ

8

గ్యాస్ సిలిండర్ తెచ్చేందుకు వెళ్తుండగా..



- రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి
- వేర్వేరు చోట్ల మరో ఇద్దరు..
- ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి మహిళకు తీవ్రమైన గాయాలు

వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. గ్యాస్ సిలిండర్ తీసుకురావడానికి వెళ్తే డీసీఎం ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, మద్యం మత్తులో ద్విచక్రవాహనం నడుపుతూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఓ యువకుడు, లారీ ఢీకొని వృద్ధుడు దుర్మరణం చెందారు.


మహేష్‌బాబు (ఫైల్)

చందానగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతిచెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లా, కోవెలముడి మండలానికి చెందిన రామినేని మహేష్‌బాబు(32)ఉపాధి నిమిత్తం 8 నెలల క్రితం హైదరాబాద్ వచ్చాడు. భార్య పాతూరి రత్నంబాతో కలిసి ఆర్‌సీపురంలో నివసిస్తూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. భార్య మంగళవారం వంట చేస్తుండగా గ్యాస్ అయిపోయింది. విషయం భర్తకు చెప్పగా సాయంత్రం 5.50 గంటలకు మియాపూర్‌లో స్నేహితుడి ఇంటికి వెళ్లి సిలిండర్ తీసుకురావడానికి స్కూటీపై బయలుదేరాడు. చందానగర్ మెయిన్‌రోడ్డులో క్రీమ్‌స్టోన్ ఐస్‌క్రీమ్ షాపు వద్ద డీసీఎం మహేష్‌బాబు ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. కింద పడిపోయిన అతడి పైనుంచి డీసీఎం వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు సమీపంలో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే తన భర్త మరణించాడని మృతుడి భార్య చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టి..

గాజులరామారం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ద్విచక్రవాహనం నడుపుతూ కరెంట్ స్తంభాన్ని

మిగతా 8వ పేజీలో..

బస్సులో నుంచి జారిపడిన మహిళ

- చేతిపై నుంచి టైరు వెళ్లడంతో నుజ్జు నుజ్జు

జీడిమెట్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సులో నుంచి జారిపడి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. పాపిరెడ్డినగర్‌కు చెందిన జి. మల్లీశ్వరి(45) క్రాస్ రోడ్డులో ఓరియంటల్ ఇన్సూరెన్స్‌లో హౌస్‌కీపర్‌గా పనిచేస్తోంది. మంగళవారం ఉదయం 7.40 గంటలకు బస్సెక్కింది. ప్రమాదవశాత్తు ఫుట్‌బోర్డు నుంచి జారి కిందపడిపోయింది. బస్సు ముందు టైరు ఆమె చేతి పై నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయింది. జగద్గిరిగుట్ట పోలీసులు ఆమెను ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో డీసీపీ కుమారుడి మృతి


చంద్రతేజ్(ఫైల్)

రెజిమెంటల్ బజార్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో డీసీపీ కుమారుడు మృతి చెందాడు. మాదాపూర్, సెంట్రల్ జోన్ డీసీపీగా పనిచేసి ప్రస్తుతం పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఎం. వెంకటేశ్వర్లు రెండో కుమారుడు చంద్రతేజ్ (28)గండిపేట సీబీఐటీ కాలేజీలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. సొంతంగా బిజినెస్ చేసుకుంటున్నాడు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఛాతిలో నొప్పి రావడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని వెంకటేశ్వర్లు స్వగ్రామం నల్లగొండ జిల్లా, హాలియా మండలం, పంగవానికుంటకు తరలించారు. చంద్రతేజ్ ఇటీవల సంక్రాంతికి పండగ కానుకగా తన తండ్రికి కారు గిఫ్ట్‌గా ఇచ్చినట్లు సమాచారం. ఆ ఆనందం నుంచి తేరుకోకముందే కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు ఢిల్లీలో సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నారు. కుమార్తె వివాహం ఇటీవల చేశారు.



జాతీయ జెండాతో విద్యార్థినుల నాట్య ప్రదర్శన

ఓయూలో సంబరం

- ఘనంగా బిజినెస్ మేనేజ్‌మెంట్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

8

షోయగం


లేజర్ లైట్ల వెలుగుల్లో గోల్కొండ కోట

- గోల్కొండ కోటలో త్రీడీ సౌండ్, లేజర్ షో
- నేటి నుంచి అత్యాధునికంగా..

చారిత్రక గోల్కొండ కోట కొత్త సొయగాలను సంతరించుకోనుంది. వందల ఏళ్ల కీర్తి కలిగిన కోటను తిలకించేందుకు వచ్చే పర్యాటకులను మరింత ఉల్లాసపరిచేందుకు నూతన ఆవిష్కరణలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఇప్పటికే కొనసాగుతున్న సాధారణ సౌండ్ అండ్ లేజర్ షోను అధునాతన సాంకేతికతతో తీర్చిదిద్దారు.

హైదరాబాద్ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గతానికి భిన్నంగా సరికొత్తగా ఏర్పాటు చేసిన సిస్టమ్ బుధవారం నుంచి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నగర పర్యాటక ప్రాంతాల్లో ప్రఖ్యాతిగాంచిన గోల్కొండ కోట విశిష్టతను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 11వ శతాబ్దానికి చెందిన కోటలోని వివిధ ప్రదేశాలు, కట్టడాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటాయి. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) పర్యవేక్షణలో నిర్వహిస్తున్న కోటలో ఎప్పటికప్పుడు అధునాతన ప్రదర్శనలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. 1993లో ఇక్కడ సౌండ్ అండ్ లేజర్ షో ఏర్పాటు చేశారు. ప్రీ రికార్డెడ్ సౌండ్ ట్రాక్స్, ఫిక్స్‌డ్ లైట్లపై ప్రతిరోజూ సాయంత్రం షోను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం నడుస్తున్న ఈ ప్రదర్శనను మరింత కొత్తగా, అంతర్జాతీయ స్థాయిలో చూపించేందుకు కేంద్ర ప్రభుత్వం నూతనంగా త్రీడీ మ్యాపింగ్ ప్రొజెక్షన్, హై రెజల్యూషన్ ప్రొజెక్టర్లు, లేజర్ లైట్లు, మూవింగ్ హెడ్స్ వంటి సాంకేతికతను అమర్చింది. విదేశాల్లోని పార్కుల్లో కనిపించే లైటింగ్‌ను ఇందులో ఏర్పాటు చేశారు.

ప్రాజెక్టు ప్రత్యేకతలు

కోట బయట గోడల ఇల్యుమినేషన్ వామ్ వైట్ (తెలుపు) రంగులో ఉంటుంది. ముఖద్వారం,

మిగతా 8వ పేజీలో..

విద్యార్థిని సేవలకు కేంద్రం 'ఆకర్షణ

● గణతంత్ర వేడుకలకు ఆహ్వానం

సనత్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఈనెల 26న నిర్వహించే గణతంత్ర వేడుకలకు సనత్‌నగర్‌లో నివసించే హెచ్‌పీఎస్ విద్యార్థిని ఆకర్షణ సతీష్‌కు ఆహ్వానం అందింది. కేంద్ర రక్షణశాఖ నుంచి ఆహ్వానం అందినట్లు ఆకర్షణ తండ్రి సతీష్ తెలిపారు. ప్రభుత్వం 5 రోజుల పాటు సౌకర్యాలను కల్పించిందన్నారు. నగరంలో పలు ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల్లో లైబ్రరీలు ఏర్పాటు చేసిన ఆకర్షణ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవానికి ఆహ్వానం పలికిందన్నారు.



ఆకర్షణ సతీష్

నేడు జిల్లా అభివృద్ధిపై మంత్రి పొన్నం సమీక్ష

హైదరాబాద్ సిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా అభివృద్ధిపై బుధవారం సమీక్ష నిర్వహిస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఉదయం 11గంటలకు సమావేశం జరగనుంది. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనుల్లో ఇప్పటివరకు ఎంతమేరకు పూర్తయ్యాయి.. మొత్తం పనుల్లో ఆగినవి ఎన్ని, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నిర్మాణాలు ఎన్ని అనే అంశాలపై మంత్రి సమీక్షించనున్నారు. అలాగే, నిధుల లేమితో నిలిచిపోయిన పనులపై ఆరా తీయనున్నారు. జిల్లాలోని ప్రభుత్వ భూముల వివరాలు, ఆక్రమణకు గురవుతున్న పరిస్థితిని తెలుసుకోనున్నారు. ఆ తర్వాత రెండో సెషన్ కింద హైదరాబాద్ జిల్లా విద్యాశాఖపై సమీక్షించనున్నారు. ప్రధానంగా నగరంలో ఇంటర్, పదో తరగతి ఫలితాల్లో ఏటా జిల్లా ఎందుకు వెనకబడి పోతోందనే విషయంపై ఆరా తీయనున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ జి ల్లా అభివృద్ధిపై మంత్రి సమీక్ష నిర్వహిస్తుండడం ఆసక్తికరంగా మారింది.

ఓటర్ల దినోత్సవానికి ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

హైదరాబాద్ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. ఈనెల 25న రాష్ట్ర స్థాయిలో జరుగనున్న వేడుకలపై మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో ఉదయం 9 గంటలకు జరిగే వేడుకలకు గవర్నర్ తమిళిసై ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. వేడుకల్లో పాల్గొనే వారికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాల నుంచి వచ్చే వారు ఉదయం 8.30 గంటల వరకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



గౌలిపుర మిత్ర క్లబ్ మైదానంలో నిర్వహించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిలో బాక్సింగ్ కోచ్ సత్యనారాయణ తదితరులు

ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి

యాకుత్‌పుర, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): యాకుత్‌పుర నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బస్తీ కమిటీలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. గౌలిపుర మిత్ర క్లబ్ మైదానంలో నిర్వహించిన నేతాజీ జయంతిలో బాక్సింగ్ కోచ్ బి.సత్యనారాయణ, కృష్ణారావు, ముత్యం, జీవన్‌తో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

హైదర్‌గూడలో..



నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహవ వద్ద నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు

రాజేంద్రనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మంగళవారం హైదర్‌గూడలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. నేతాజీ యూత్ క్లబ్ అధ్యక్షుడు సులిగె వెంకటేశ్ మాట్లాడుతూ 1897 జనవరి 23న ఒరిస్సాలోని కటక్ నగరంలో తండ్రి జానకి సింగ్ బోస్, తల్లి ప్రభావతిల 14 మంది సంతానంలో తొమ్మిదో సంతానంగా సుభాష్ చంద్రబోస్ జన్మించారన్నారు. 1942లో ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించారన్నారు. కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్, నాయకులు కొలన్ సుభాష్‌రెడ్డి, రామేశ్వర్‌రావు, కొమురయ్య, ఎస్.మల్లారెడ్డి, నర్సింహ, హరినాథ్, సోమారం రవీందర్, కొలన్ సుధాకర్‌రెడ్డి, బీట్యారి సిద్దేశ్వర్, బంగారు రమేశ్, ఎంసీ చిన్నస్వామి, వాసు, రాజేందర్, శ్రీశైలం, బాలకృష్ణ, శివకుమార్, హనుంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్లనుద్దేశించి మాట్లాడుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీను నాయక్

ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

మదీన, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పాదచారులు, వాహనదారులు ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ నిబంధనలు జాగ్రత్తగా పాటించాలని చాంద్రాయణ గుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీను నాయక్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఆయన మహబూబ్‌నగర్ చౌరస్తాలో పాదచారులు, ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. అనంతరం ఉమర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పాదచారులు రోడ్డు దాటేటప్పుడు జీబ్రా లైన్ మీదనే నడవాలని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ రోడ్డు దాటకూడదన్నారు. ఆటోడ్రైవర్లు తమ ఆటోలను నిర్దేశించిన ప్రాంతాల్లోనే ఆపాలన్నారు. ఆటోలలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను కూర్చోబెట్టుకోవద్దని సూచించారు.



సిటీ కాలేజ్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ అధికారులు

సిటీ కాలేజీలో విద్యార్థులకు..

చార్మినార్ జనవరి 23 (ఆంధ్రజ్యోతి): యువకులు ఓవర్ స్పీడ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, బేగంపేట, జి శంకర్ రాజు అన్నారు. మంగళవారం తెలంగాణ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, ట్రాఫిక్ పోలీస్‌లతో కలసి ప్రభుత్వ సిటీ కళాశాలలో రోడ్ సేఫ్టీ అవేర్నెస్ అవగాహన నిర్వహించారు. ప్రభుత్వ సిటీ కళాశాల నుంచి సాలార్ జంగ్ మ్యూజియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకొని వాటిని పాటించాలన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని అది చట్టరీత్యా నేరమన్నారు. 18 సంవత్సరములు నిండిన ప్రతి ఒక్కరు తప్పని సరిగా లైసెన్స్ తీసుకోవాలన్నారు. సమాజంలో జరిగే నేరాలపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమానికి సుమారు ఐదు వందల (ఎన్‌సీసీ - ఎన్ఎస్ఎస్) మంది విద్యార్థులు ఏఆర్. విజయరావు, గంట రాజేష్, సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ బాల భాస్కర్, నాగరాజు వి.రాంచందర్, ఇన్‌స్పెక్టర్, చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, హీరో మోటో శ్రవణ్ కుమార్. తదితరులు పాల్గొన్నారు.



అగ్రి స్టార్టప్ రెండో గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, నాబార్డ్ ప్రతినిధులు

అగ్రి స్టార్టప్‌లతో మంచి ఫలితాలు

రాజేంద్రనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ స్టార్టప్‌లు రైతులకు, సాధారణ ప్రజలకు ఆచరణాత్మకమైన ఆలోచనలు, సులభమైన పరిష్కారాలు చూపుతు స్వతంత్ర్యంగా బలాన్ని పెంపొందించుకునేలా ఉండాలని నాబార్డు మాజీ చైర్మన్ చింతల గోవిందరాజులు అన్నారు. రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) లో ఈ ఐడియా ద్వారా నిర్వహిస్తున్న అగ్రి స్టార్టప్ రెండో గ్రాడ్యుయేషన్ వేడుకలలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. గ్రాడ్యుయేట్ అయిన స్టార్టప్‌లను ఆయన అభినందించారు. నాబార్డుకు చెందిన రేమండ్ బి డీసౌజ మాట్లాడుతూ అగ్రి స్టార్టప్ ఉత్పత్తులను మార్కెట్‌కు సిద్దంగా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నార్మ్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, డాక్టర్ సెందిల్ వినాయగం, తదితరులు పాల్గొన్నారు.



ఆరాంఘర్ దుర్గా కన్వెన్షన్‌లో హైదరాబాద్ గౌడ సంఘం ఆధ్వర్యంలో రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. గౌడ సంఘం నాయకులు బి.వినోభా గౌడ్ తదితరులు

తాగుబోతులకు అడ్డాగా..

పోలీస్ అవుట్‌పోస్ట్

యాకుత్‌పుర, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): యాకుత్‌పుర నియోజకవర్గంలోని గౌలిపుర చౌరస్తాలో ఉన్న గౌలిపుర పోలీస్ అవుట్ పోస్టు భవనం నిరుపయోగంగా వుంది. దీంతో అవుట్ పోస్టు భవనం తాగుబోతులకు అడ్డగా మారింది. శాంతి భద్రతల దృష్ట్యా 1907 సంవత్సరంలో నిర్మించిన భవనంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. కాలక్రమేన ఇది పూర్తిగా పాతబడడంతో నిరుపయోగంగా మారింది. పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాడు బడ్డ అవుట్ పోస్టు భవనాన్ని తిరిగి 2012లో ఆధునీకరించి అందుబాటులోకి తీసుకువచ్చారు. అధునీకరించిన భవనంలో ఏర్పా టు చేసిన ఛత్రినాక అవుట్ పోస్టును అప్పటి నగర పోలీస్ కమిషనర్ అనురాగ్ శర్మ ప్రారంభించారు. ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే ఈ అవుట్ పోస్టు భవనం వాడకంలో లేక ప్రస్తుం తాగుబోతులకు అడ్డగా మారింది. ఇష్టం వచ్చిన్నట్లు గుర్తు తెలియని వ్యక్తులు వాహనాలను పార్క్ చేస్తున్నారు. సమీపంలో ఇక్కడ వైన్ షాపు ఉండటంతో తాగుబోతులు ఇక్కడే తిష్ట వేయడంతో రోడ్డుపై వచ్చి పోయే వారికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.



నిరుపయోగంగా ఉన్న గౌలిపుర పోలీస్ అవుట్‌పోస్ట్ భవనం

ఒకనైన సంబంధిత పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తిరిగి ఇక్కడ పోలీస్ అవుట్ పోస్టను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జల్‌పల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులపై సమీక్ష

పహాడిషరీఫ్ జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జల్ పల్లి మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి పాలకవర్గం సహకారం అవసరం ఉందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన అభివృద్ధి పనుల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, శానిటేషన్ నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. పదిహేను రోజులుగా ప్రజా పాలన కార్యక్రమం వల్ల సమస్యలు పెరిగాయాని త్వరలో సమస్యలను పరిష్కరిష్తామన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకవెళ్లి రద్దు చేసిన ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయాలనీ వత్తిడి చేసి మంజూరు చేయిస్తానాన్నరు. సమావేశంలో మహిళ కౌన్సిలర్లకు బదులు వారి భర్తలు సోదరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఫరాన యూసుఫ్ పటేల్, కమిషనర్ వసంత, డీఈ వెంకన్న, కౌన్సిలర్లు శంశుద్దీన్, జఫర్ బామ్ లక్ష్మీ నారాయణ, శంకర్, మజహార్, దస్తగిర్, హసన్ షా, బాషమ్మ, యాహియా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నారాయణమ్మ కళాశాల్లో జరిగిన కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

నారాయణమ్మ కళాశాలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

నార్సింగ్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నారాయణమ్మ ఇంజనీరింగ్ మహిళా కళాశాల్లో జరిగిన ప్రపంచంలో 150 దేశాల ప్రజలు అయోధ్య బాలరాముని ప్రతిష్ఠ వీడియో కార్యక్రమాన్ని వీక్షించడం జరిగింది. సోమవారం కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్య రామజన్మ భూమి అంశంలో జి.పుల్లారెడ్డి చేసిన సేవ, పోరాట పటిమ అసాధారణమైందని, ఆయన నేడు జాతి మొత్తం గుర్తించుకుంటుందన్నారు.



వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

నుమాయిష్‌లో వైద్య ఆరోగ్య కేంద్రం ప్రారంభం

అఫ్జల్‌గంజ్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): 83వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)లో ఎగ్జిబిషన్ సొసైటీ, యశోద ఆసుపత్రుల సంయుక్తాధ్వర్యంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వైద్య ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సంరక్షణకు కట్టుబడి ఉందన్నారు. ముఖ్యంగా మాత, శిశు సంరక్షణకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. 83 సంవత్సరాల చరిత్ర కలిగిన ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా సుమారు 30 వేల మంది విద్యార్థులకు, ముఖ్యంగా బాలికలకు విద్యను అందిస్తున్నందుకు అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ కమిటీ సెక్రటరీ హనుమంత్ రావు, ఉపాధ్యక్షులు వనం సత్యేంద్ర, అడ్వయిజర్ జీఎస్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు, యశోదా ఆసుపత్రి డైరెక్టర్ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



గౌడ సంఘం ఆధ్వర్యంలో మంత్రులకు, ఎమ్మెల్యేకు సన్మానం

గౌడ కులస్థులకు అండగా ఉంటాం: మంత్రులు

రాజేంద్రనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గౌడ కులస్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌లు అన్నారు. రంగారెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్ జిల్లాల కల్లు సొసైటీల ఆధ్వర్యంలో మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవుపల్లిలోని దుర్గా కన్వెన్షన్‌లో తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో పాటు గౌడ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్ కె.స్వామీగౌడ్, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గౌడ కులస్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. వరంగల్‌లో ఉన్న భూమిని ప్రభుత్వంతో మాట్లాడి గౌడ కులస్థులకు చెందేవిధంగా చూస్తామన్నారు. గీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే ఇచ్చే భీమాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు వివరించారు. సమావేశ నిర్వాహకులు పి.హరిచరణ్‌గౌడ్, టి.ప్రేందాస్ గౌడ్, కాశీ విశ్వనాథ్‌గౌడ్‌లు మాట్లాడుతూ వైన్స్‌లు, బార్లలో గౌడ కులస్థులకు రిజర్వేషన్లు పెంచే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌడ కులస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన జ్ఞానేశ్వర్, గంగాధర్

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బాధ్యతలు స్వీకరించిన జ్ఞానేశ్వర్, గంగాధర్

మంగళ్‌హాట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గడ్డం జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు నాంపల్లి గృహకల్ప భవనం ప్రాంగణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు బాధ్యతలు స్వీకరించి ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన అద్భుతంగా ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ఆర్ పాలన పరిపాలనను మళ్లీ గుర్తు చేసుకునేలా రేవంత్ రెడ్డి నిర్ణయాలు ఉన్నాయని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు ఉద్యోగుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువస్తున్న పథకలు, సంక్షేమ కార్యక్రమాల వల్ల ప్రజల్లో మంచి స్పందన ఉందని గుర్తు చేశారు. కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న నాల్గావ తరగతి ఉద్యోగుల సమస్యలపై సైతం ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం సంతోషంగా ఉన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంద్రప్రస్థం నాటక ప్రదర్శన

రవీంద్రభారతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నాటక రంగ అభివృద్ధి కోసం ప్రతి నెలా నాటకం ప్రేక్షకుడికి వినోదం, నటుడికి ఆనందం పేరిట నిర్వహిస్తోన్న నాటక ప్రదర్శనలు రంజింపజేస్తున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం రవీంద్రభారతిలో రసరంజని సంస్థ ఆధ్వర్యంలో ఇంద్రప్రస్థం నాటకాన్ని ప్రదర్శించారు. గోపి సత్యప్రకాష్ రచించిన ఈ నాటకానికి ఎన్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. చక్కటి నటనతో కళాకరులు ఆకట్టుకున్నారు.



షేక్ అన్సారీకి పురస్కారం ప్రదానం చేస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి, తదితరులు

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్‌కు
మీడియా ప్రతిభా పురస్కారం

చిక్కడపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యూస్‌చానల్ 'ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి' వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్ షేక్ అన్సారీకి మీడియా ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేశారు. జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.శేషశయనారెడ్డి అన్సారీకి పురస్కారం ప్రదానం చేసి శుభాకాంక్షలు తెలిపా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీడియా లో నాణ్యమైన ప్రసారాలకు తెరవెనుక పనిచేసే వారి సమష్టి కృషి కారణమన్నారు. కళాపోషకుడు రాజశేఖరరెడ్డి అధ్యక్షత వహించిన సభలో బి.నరసింహారావు, కే.విజయలక్ష్మి, రవికుమార్, కుసుమభోగరాజు పాల్గొనగా, సంస్థ చైర్మన్ గుదిబండ వెంకటరెడ్డి స్వాగతం పలికారు.



అక్రమ నిల్వ చేసిన మందుల స్వాధీనం చేసుకున్న అధికారుల

నార్సింగ్‌లో ఔషధ నియంత్రణ అధికారుల దాడులు

హైదరాబాద్ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్‌లో అక్రమంగా మందులను నిల్వ చేసిన ఓ కేంద్రంపై ఔషధ నియంత్రణ అధికారులు గురువారం దాడి చేసి విలువైన మందులు, ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. నార్సింగిలోని మార్కెట్ రోడ్‌లో క్వాక్ రాహుల్ కుమార్ శర్మ అన్విష్ క్లినిక్‌కు సంబంధించిన 'ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్‌గా చెప్పుకుంటున్నాడని అధికారులు గుర్తించారు. అతని క్లినిక్‌పై దాడి చేయగా అమ్మకానికి పెద్ద మొత్తంలో మందులను అనధికారికంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. యాంటీబయాటిక్స్, యాంటీ అల్సర్ డ్రగ్స్, పెయిన్ కిల్లర్ డ్రగ్స్, యాంటీ టస్సివ్ డ్రగ్స్, మల్టీ విటమిన్స్ తదితర 27 రకాల మందులతో కూడిన భారీ స్టాక్‌ను ఔషధ నియంత్రణ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిల్వ చేసిన అన్ని రకాల మందులు డ్రగ్ లైసెన్స్ లేకుండా ఉన్నట్లు నిర్ధారించారు. ఇన్‌స్పెక్టర్లు కె. అనిల్ కుమార్, డి. శ్వేత బిందు, శైలజా రాణి, అన్వేష్, రవికిరణ్ దాడులు నిర్వహించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

అప్పాజోస్యుల పద్యావలోకనం పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మన జీవన విధానంలో భాష ముఖ్యమైన పాత్రపోషిస్తుందని, తెలుగు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. మంగళవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో కిన్నెర ఆర్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత అనుమాండ్ల భూమయ్య రచించిన అప్పాలజోస్యుల పద్యావలోకనం పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన బుర్రా వెంకటేశం పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి పుస్తకాన్ని ప్రముఖ పద్య కవి అప్పాజోస్యులు సత్యనారాయణకు అందజేసి అంకితోత్సవం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో భాష పట్ల అభిరుచిని పెంచే విధంగా ప్రయత్నాలు జరగాలని అన్నారు. సభా ప్రారంభకులుగా హాజరైన ప్రముఖ సాహితీవేత్త కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ అప్పాజోస్యుల పద్యావలోకనం పేరిట పుస్తకాన్ని రచంచిన దానిని అప్పాజోస్యుల సత్యనారాయణకు అంకితం ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాంబాగ్‌లో రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులు

అఫ్జల్‌గంజ్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జాంబాగ్ డివిజన్‌లో పాడైపోయిన రోడ్లకు దశలవారీగా ప్యాచ్‌వర్క్‌లను జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసి మరమ్మతులు చేయిస్తున్నామని జాంబాగ్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు అశోక్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం జాంబాగ్ డివిజన్‌లో పలు బస్తీల్లో పాదయాత్ర నిర్వహించి పాడైపోయిన రోడ్లను గుర్తించి యుద్ధ ప్రతిపాదికన ప్యాచ్‌వర్క్‌లను పూర్తి చేస్తున్నామన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



ఆమిర్ ఖురేషీ

మదీన, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న డబ్బులు ఇవ్వడం లేదనే కోపంతో ఓ వ్యక్తిని కత్తితో పొడిచి హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది. శాస్త్రిపురం ఆదిబా హోటల్ సమీప ప్రాంతానికి చెందిన మహ్మద్ ఆమిర్ ఖురేషీ(31), కాలాపత్తర్‌కు చెందిన మహ్మద్ మోసిన్ అహ్మద్‌కు రూ. 25 వేలు అప్పుగా ఇచ్చాడు. డబ్బులు ఎంతకూ ఇవ్వకపోవడంతో ఖురేషీ కోపం పెంచుకున్నాడు. మాట్లాడదామని చెప్పి 2018 డిసెంబర్ 24న కాలాపత్తర్‌లోని విద్యుత్ కార్యాలయం వద్దకు అహ్మద్‌ను రప్పించి కత్తితో పొడిచాడు. తీవ్ర గాయాలైన అహ్మద్ అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసిన కాలాపత్తర్ పోలీసులు దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన మూడో అదనపు మెజిస్ట్రేట్ సెషన్స్ జడ్జి జె.కవిత నిందితుడు ఖురేషీకి జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/tD1Y1jMలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

రంగారెడ్డి, మేడ్చల్‌లో అవిశ్వాసాల జోరు

● మీర్‌పేట్‌లో మేయర్ బీజేపీకి.. కాంగ్రెస్‌కు 'డిప్యూటీ'పై ఒప్పందం

సరూర్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్‌లోనూ మరో 'అవిశ్వాస' మైత్రి చిగురిస్తోంది. మొన్నటిదాకా బడంగ్‌పేట్‌లో బీజేపీ, బీఆర్ఎస్‌లు స్నేహబంధం పెట్టుకున్నట్టు వార్తలు రాగా.. ఇప్పుడు మీర్‌పేట్‌లో బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య 'బంధం' వేశ్లానుకుంటోంది. ఇక్కడ మేయర్, డిప్యూటీ మేయర్ ఇద్దరూ బీఆర్ఎస్‌కు చెందిన వారే ఉన్నారు. అయితే, వారిపై అసంతృప్తితో ఉన్న బీఆర్ఎస్‌లోని మెజారిటీ కార్పొరేటర్లు.. బీజేపీ-కాంగ్రెస్‌ల 'చెలిమి'లో చేరాలని నిర్ణయించుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. గతంలో మంత్రిగా ఉన్న సబితారెడ్డి మీర్‌పేట్‌లో తన పార్టీకి చెందిన ఇద్దరిని మేయర్, డిప్యూటీ మేయర్ కుర్చీల్లో కూర్చోబెట్టారు. మేయర్‌గా ఎం.దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్‌గా తీగల విక్రమ్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఎన్నికలు జరిగిన ఏడాది నుంచే మేయర్‌పై సొంత పార్టీ సభ్యులే అసంతృప్తి వ్యక్తం చేస్తూ పలుమార్లు కలెక్టర్‌తోపాటు మునిసిపల్ శాఖ అధికారులకు సైతం ఫిర్యాదు చేసిన విషయం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా నాలుగేళ్ల పదవీ కాలం ముగియనుండడంతో మరోసారి అవిశ్వాసానికి రంగం సిద్ధం చేస్తున్నారు. పనిలో పనిగా డిప్యూటీ మేయర్ పైనా అవిశ్వాసం పెట్టాలని బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు యోచిస్తుండగా, వారికి పలువురు బీఆర్ఎస్ సభ్యులు సైతం మద్దతు పలుకుతున్నట్టు తెలిసింది. అవిశ్వాసం నెగ్గితే బీజేపీకి మేయర్ పదవి, కాంగ్రెస్‌కు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని ఒప్పందం సైతం చేసుకున్నట్టు తెలిసింది.



మీర్‌పేట్ కార్యాలయం

సబితారెడ్డి సమావేశానికి డుమ్మా..

అవిశ్వాసం విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి సోమవారం సాయంత్రం సొంత పార్టీకి చెందిన సభ్యులతో అంతర్గత సమావేశం ఏర్పాటు చేయగా చాలా మంది సభ్యులు ముఖం చాటేసినట్టు తెలిసింది. మేయర్, డిప్యూటీ మేయర్‌తో కలిపి కేవలం 12 మంది సభ్యులు మాత్రమే మంత్రి వద్దకు వెళ్లినట్టు సమాచారం. దాంతో అసహనానికి లోనైన సబిత.. 'ఏం చేస్తారో ఎలా చేస్తారో నాకు తెలియదు.. మీ పదవులు ఎలా కాపాడుకుంటారో మీ ఇష్టం.. ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ పరువు మాత్రం పోవద్దు'.. అని మేయర్, డిప్యూటీ మేయర్‌లకు తెగేసి చెప్పినట్టు తెలిసింది. దాంతో మీర్‌పేట్‌లో క్యాంపు రాజకీయాలకు రంగం సిద్ధం అవుతున్నట్టు తెలుస్తోంది.

అవిశ్వాస తీర్మానాన్ని సహించేది లేదు : ఎమ్మెల్యే

నార్సింగ్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తన నియోజకవర్గంలో అవిశ్వాస తీర్మానాలు ఎవరు ప్రవేశపెట్టిన తాను సహించేది లేదని, అలాంటి వారికి పూర్తిగా వ్యతిరేకమని, అవిశ్వాస తీర్మానం పెట్టేవారికి ప్రజాక్షేత్రంలో స్థానం లేదని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌పై సొంతపార్టీ సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేపెట్టిన నేపథ్యంలో ఎమ్మెల్యే టీ.ప్రకాశ్‌గౌడ్ మంగళవారం బండ్లగూడలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని గాలికి వదిలేసి, కేవలం డబ్బుల వ్యామోహంతో బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ అవిశ్వాస తీర్మానం పెట్టారని, ఇది ఎంతమాత్రం సముచితం కాదన్నారు. అవిశ్వాస తీర్మానం ఎందుకు పెట్టారో, మేయర్ మహేందర్‌గౌడ్ ఏం తప్పు చేశాడో చెప్పాలని, లేదా ప్రజాక్షేత్రంలో ప్రజలకు వివరించాలన్నారు. ఈ తీర్మానం పై సంతకాలు పెట్టిన వారికి భవిష్యత్తులో జరిగే ఏ ఎన్నికలకు కూడా టికెట్‌లు ఇవ్వబోమని, పార్టీ తరపున క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో మేయర్ మహేందర్‌గౌడ్, కౌన్సిలర్లు శ్రీలతసురేశ్‌గౌడ్, సాగర్‌గౌడ్, పద్మావతి పాపయ్య యాదవ్, బీఆర్ఎస్ గండిపేట మండల అధ్యక్షుడు ఆర్.నర్సింహ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

అవిశ్వాసం నెగ్గి తీరుతాం..

'జవహర్‌నగర్' అసమ్మతి కార్పొరేటర్‌లు బాపట్ల నుంచి రహస్య ప్రదేశంలోకి క్యాంపు

జవహర్‌నగర్ , 23 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్‌పై అవిశ్వాసం పెట్టి తీరుతామని పట్టుబట్టిన అసమ్మతి కార్పొరేటర్‌లు ఇంకా క్యాంపులోనే కొనసాగుతున్నారు. మరోవైపు మేయర్ వర్గీయులు గెలుపే లక్ష్యంగా తమవంతు ప్రయత్నాలు కొనసాగిస్తుండడంతో రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. అసమ్మతి కార్పొరేటర్లు ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల నుంచి క్యాంపును మరో ప్రదేశానికి మార్చి అక్కడే ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

కోర్టుకు వెళ్లిన కార్పొరేటర్...?

- అవిశ్వాస తీర్మానంలో సంతకం పెట్టిన ఓ కార్పొరేటర్ మేయర్‌కు అనుకూలంగా కోర్టును ఆశ్రయించనున్నట్లు సమాచారం.
- అదను కోసం ఎదురుచూస్తున్న కాంగ్రెస్ నాయకులు
- అసమ్మతి కార్పొరేటర్లు సొంత పార్టీ మేయర్‌పై తిరుగుబావుటా ఎగురవేయడంతో మేడ్చల్ కాంగ్రెస్ పెద్దలు జవహర్‌నగర్ పాలకవర్గంపై దృష్టి సారించారు. అవిశ్వాసం కోసం క్యాంపునకు తరలిన 19 మంది కార్పొరేటర్‌ల క్యాంపునకు సంబంధించిన వివరాలు సైతం ఎప్పటికప్పుడు సేకరిస్తున్నారు. వారిని ఎలాగైనా కాంగ్రెస్ పార్టీలో చేరేలా ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం..

మరోమారు సంతకాలు..?

జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్ కావ్యపై అవిశ్వాసం పెట్టాలంటూ 19మంది కార్పొరేటర్‌లు సంతకాలు చేసిన పత్రాలు కలెక్టర్ కార్యాలయంలో అందించారు. అయితే, గతంలో అసమ్మతి వర్గంలో ఉన్న ఓ కార్పొరేటర్ ఇప్పుడు మేయర్ వర్గంలో చేరడంతో ఏదైనా సమస్యలు వచ్చే అవకాశం ఉందని గ్రహించిన అసమ్మతి కార్పొరేటర్లు క్యాంపు నుంచే మారోమారు అవిశ్వాస పత్రంపై సంతకాలు చేసి కలెక్టర్ కార్యాలయానికి పంపించనున్నట్లు విశ్వసనీయ సమాచారం..



ఐక్యవిద్యపై ఎంఓయూ కుదుర్చుకుంటున్న హరే కృష్ణ మూవ్‌మెంట్, వోక్సన్ విశ్వవిద్యాలయ ప్రతినిధులు

గ్రామీణ నిరుపేదల సంక్షేమం కోసం ఒప్పందం

హరేకృష్ణ మూవ్‌మెంట్, వోక్సన్ విశ్వవిద్యాలయం మధ్య ఎంఓయూ

బంజారాహిల్స్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, గిరిజన, నిరుపేదల సంక్షేమం, అభివృద్ధి కోసం హరేకృష్ణమూవ్‌మెంట్ ఏర్పాటు చేసిన ఐక్యవేదికకు తోడ్పాటును అందించేందుకు వోక్సన్ విశ్వవిద్యాలయం ముందుకు వచ్చిం ది. బంజారాహిల్స్‌రోడ్డు నెం. 12లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో మంగళవారం హరేకృష్ణ మూవ్‌మెంట్, అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస వోక్సన్ విశ్వవిద్యాలయ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాల్ విల్లామరిన్ రోడ్రీగేలు సహకార భాగస్వామ్యం కుదుర్చుకున్నారు. అనంతరం సత్యచంద్రగౌరదాస మాట్లాడుతూ గిరిజన ప్రాబల్యం ఉన్న భద్రాచల గిరిజన ప్రాంతం, ఏపీలోని నంద్యాల జిల్లా అహోబిలం గ్రామాలను మొదట ఎంచుకొని కార్యక్రమాలకు శ్రీకారంచుట్టనున్నట్టు తెలిపారు. డాక్టర్ రాల్ విల్లామరిన్ రోడ్రీగే మాట్లాడుతూ విద్య ద్వారా సమాజంలో పరివర్తనాత్మక మార్పును తీసుకురావాలనే తమ లక్ష్యం మన్నారు. ఐక్యవిద్య సహదేవ్ సఖాదాస, వోక్సన్ విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ దయా శంకర్ పాల్గొన్నారు.

'షో'యగం

(5వ పేజీ తరువాయి)

భద్రాద్రి హాల్ త్రివర్ణ పతాకంతో వెలుగొందుతోంది. మొత్తం లక్ష చదరపు అడుగుల వైశాల్యం కలిగిన బయటి గోడలకు

(ప్రసాద్ ఏరియా) వెలుగులు అందించేందుకు 1400 ఎనర్జీ ఎఫిషియంట్ ఎల్ఈడీ లైట్లను అమర్చారు. ఇందులో 25 కిలోవాట్ల సోలార్ పవర్, 30కే ప్రొజెక్టర్లు-8, 20కే ప్రొజెక్టర్లు-2, 20 వాట్ల లేజర్ లైట్లు-6, మూవింగ్ హెడ్‌లైట్లు-20, స్పీకర్లు-14, సబ్ వూవర్లు-8, సరౌండ్ సిస్టమ్-1, 80 కిలోవాట్స్ యూపీఎస్-1 ఉన్నాయి. ప్రతి రోజూ షో సమయం 30 నిమిషాల 20 సెకండ్లు ఉంటుంది. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ప్రదర్శన నిర్వహించనున్నారు. సాధారణ రోజుల్లో 2 నుంచి 3వేల మంది కోటను సందర్శిస్తుండగా, ఆదివారం సుమారు 6వేల మంది వరకు వస్తుంటారని అధికారులు చెబుతున్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

ఇల్యుమినేషన్, సౌండ్ అండ్ లైట్ షోను బుధవారం సాయంత్రం 5 గంటలకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి కేంద్ర మాజీ మంత్రి, మెగాస్టార్ చిరంజీవి, రాజ్యసభ సభ్యుడు విజయేంద్రప్రసాద్ హాజరుకానున్నారు.

సిలిండర్ తెచ్చేందుకు వెళ్తుండగా..

(5వ పేజీ తరువాయి)



మృతి చెందిన భాస్కర్‌రెడ్డి

ఢీకొట్టి ఓ యువకుడు మృతి చెందాడు. సూరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, మాచవరం గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు సూరం భాస్కర్‌రెడ్డి (23)ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తూ, గండిమైసమ్మలో వసతి గృహంలో ఉంటున్నాడు. సోమవారం రాత్రి స్నేహితులతో కలిసి సూరారంలో పార్టీ చేసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున వసతి గృహానికి వెళ్తున్నాడు. మత్తులో ఉన్న భాస్కర్‌రెడ్డి మార్గ మధ్యంలో బైక్ అదుపు తప్పడంతో కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తల, కుడికాలుకు తీవ్రమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భాస్కర్‌రెడ్డి సోదరుడు భార్గవ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

లారీ ఢీకొని వృద్ధుడు..

జీడిమెట్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. సూరారం, విశ్వకర్మకాలనీకి చెందిన ఎం.మొయినొద్దీన్(73) మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో జీడిమెట్ల డీపీ కాలనీ వద్ద సైకిల్‌పై రోడ్డు దాటుతున్నాడు. వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో కాళ్లు, వెన్నెముక విరిగిపోయాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. జీడిమెట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూలో సంబరం

ఘనంగా బిజినెస్ మేనేజ్‌మెంట్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

తార్నాక, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం గోల్డెన్ జూబ్లీ సంబరాలను ఓయూలో ఠాగూర్ ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా ప్రారంభించారు. విద్యార్థులు ఆట పాటలు, నృత్యాలతో సందడి చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం యాభై సంవత్సరాలుగా వేలాది మంది నిపుణులను సమాజానికి అందించిందన్నారు. ఓయూ వీసీ డా. రవీందర్ మాట్లాడుతూ.. ఎంబీఏ విద్యార్థులకు ప్రపంచ స్థాయి అవకాశాలను, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలను రూపొందించడం ప్రాముఖ్యతను వివరించారు. భవిష్యత్‌లో పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థల అవసరాలకు అనుగుణంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ వి. వెంకటరమణ, ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ డి. శ్రీరాములు, ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ పి. వెంకటయ్య, ప్రొఫెసర్‌లు శ్యామ్ మోహన్, స్మిత సాంబ్రాణి, వై. జహంగీర్, సంపత్ కుమార్, జి. విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి గోల్డెన్ జూబ్లీ సంబరాలను ప్రారంభిస్తున్న ఓయూ వైస్ చాన్సలర్ డి. రవీందర్

ఎంఎంటీఎస్‌ను గాడిలో పెట్టండి

● సీఎం రేవంత్ రెడ్డికి సీపీఎం లేఖ

రాంనగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రజలకు అత్యంత చవకైన రవాణా వ్యవస్థ ఎంఎంటీఎస్ రైల్వే అని, అది ప్రస్తుతం అస్తవ్యస్తంగా తయారై ప్రయాణికులను అసౌకర్యానికి గురిచేస్తుందని.. ఈ వ్యవస్థను గాడిలో పెట్టాలని కోరుతూ సీపీఎం పార్టీ తరఫున గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం. శ్రీనివాస్ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. మరమ్మతుల పేరుతో నిరంతరం రైలు సర్వీసులు రద్దు చేయడం వల్ల ఎంఎంటీఎస్‌పై ప్రయాణికులకు విశ్వాసం పూర్తిగా సడలిపోయిందని, రాకపోకలు నిలిచిపోతే సామాన్య ప్రయాణికులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని లేఖలో పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ రవాణా వ్యవస్థను కాపాడాలని, మెట్రో రెండో దశ పనులు త్వరగా పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

వేర్వేరు గదుల్లో ఇద్దరి ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)

కుమారులు శశికుమార్, చందు స్కూల్ నుంచి ఇంటికి వచ్చారు. తలుపులకు లోపల నుంచి గడియ పెట్టి ఉంది. కిటికిలోంచి చూడగా గదిలో తల్లి స్రవంతి ఫ్యానుకు చీరతో ఉరేసుకొని కనిపించింది. హాల్‌లో సీహెచ్ శేఖర్‌గౌడ్ చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. దీంతో వారు ఏడుస్తూ పక్కింటి వారికి చెప్పారు. వారు వచ్చి చూసి సోమయ్యకు ఫోన్ చేసి విషయం చెప్పి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ బి. నాగేంద్రబాబు, ఎస్ఐ మౌనిక ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొడవలు లేవు.. ఎవరిమీద అనుమానం లేదు

తమ మధ్య ఎలాంటి గొడవలు లేవు. ఎవరి మీద అనుమానం లేదు. 45 రోజుల క్రితం జల్‌పల్లిలో నా భార్య స్రవంతి(28) పేరున 100 గజాల స్థలం కొన్నాను. ఇటీవల రిజిస్ట్రేషన్ చేయించా. నా భార్యకు నడుమునొప్పి ఉండడంతో నన్ను గ్రామంలో జరిగే దశదినకర్మకు వెళ్లి సాయంత్రానికల్లా రమ్మని చెప్పింది. నేను ఊరికి వెళ్లాక ఏమైందో ఏమో.. ఆత్మహత్య చేసుకుంది. మా అన్న బావమరిది సీహెచ్ శేఖర్‌గౌడ్(25) కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. కారణాలు తెలియదు. - సోమయ్య



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మణికంఠ పూజా స్టోర్‌లో అగ్నిప్రమాదం

● భారీగా ఆస్తినష్టం

మల్కాజిగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లోని మణికంఠ పూజ స్టోర్స్‌లో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. పూజాస్టోర్స్‌లో ఉన్న వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. అయితే, సెల్లార్‌లో నిర్వహిస్తున్న పూజాస్టోర్స్‌లో అగ్నిప్రమాదం ఎలా సంభవించింది అన్నది సస్పెన్స్‌గా మారింది. నిర్వాహకులు మాత్రం షార్ట్‌సర్క్యూట్ అంటుండగా.. దీనిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సుమారు రూ.80లక్షల మేర ఆస్తినష్టం అయిందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. స్థానిక కార్పొరేటర్ ఊరపల్లి శ్రవణ్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు జీడి సంపత్‌తో పాటు పలువురు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. పోలీసులు కేసు నమోదుచేసుకుని విచారిస్తున్నారు.

రూ. వెయ్యి ఇవ్వడానికి వెళ్తే..

యూసుఫ్‌గూడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు మంగళ సూత్రం తెంపుకొనిపోయాడో వ్యక్తి. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ శ్రీనివాసం అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న కె. శ్రీదేవికి జవహర్‌నగర్ సాయిబాబా ఆలయం సమీపంలో ఉంటున్న బాబాజీ ఐదేళ్ల క్రితం పరిచయం అయ్యాడు. ఈనెల 21న తన తమ్ముడు సురేష్‌తో కలిసి వెళ్లాడు. అదేరోజు సాయంత్రం బాబాజీ ఆమెకు ఫోన్ చేసి వెయ్యి రూపాయలు కావాలని అడిగాడు. ఆమె ఇంట్లోకి వెళ్లి డబ్బులు ఇవ్వబోగా మెడలోని 70 గ్రాముల బంగారు మంగళసూత్రం తెంపుకొని పారిపోయాడు. ఆమె బయటకు వచ్చి దొంగ అని కేకలు వేయగా అటువైపు వెళ్తున్న గోపీ, రమేష్, రాజు అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

26 నుంచి ఆనంద్ ఉత్సవ్

హైదరాబాద్ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్‌లో ఈనెల 26 నుంచి 28 వరకు ఆనంద్ ఉత్సవ్‌ను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ధ్వజాజీ ఆరోహణ ఉత్సవ సమితి మేనేజింగ్ ట్రస్టీ రూపేష్ వై.షా, జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ లక్ష్మీదాస్ ఆర్.షాలు వెల్లడించారు. దక్షిణ భారత దేశంలో తొలిసారిగా మూడురోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బంజారాహిల్స్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులతో కలిసి ఆనంద్ ఉత్సవ్ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ధ్వజాజీ ప్రాముఖ్యత ఏమిటీ..? అనే పుస్తకాన్ని పద్మావతి ఆవిష్కరించారు. సమావేశంలో ఉత్సవ సమితి జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ అమిత్ ఎం.షా, చైతన్య ఆర్.కుమార్, రోమిత్ ఎల్.షా, ఆనంద్ ఉత్సవ్‌లు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరించిన పద్మావతి, రూపేష్ వై.షా, లక్ష్మీదాస్ ఆర్.షా

విద్యాసంస్థల్లో చైల్డ్‌సేఫ్టీ కమిటీలు

సైబర్ నేరాలపై అవగాహన

ఇన్‌చార్జి డీసీపీ ఎస్.రష్మీ పెరుమాళ్

రాజేంద్రనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కళాశాల, విశ్వవిద్యాలయాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి కళాశాల, యూనివర్శిటీ స్థాయిలో చైల్డ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని రాజేంద్రనగర్ ఇన్‌చార్జి డీసీపీ ఎస్.రష్మీ పెరుమాళ్ అన్నారు. మంగళవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న మార్పులు, నేరాల తీరులో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజేంద్రనగర్ డివిజన్‌లోని 20 పాఠశాలల్లో చైల్డ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసి బాలికలు ఫిజికల్ హెల్త్, మెంటల్ హెల్త్ తోపాటు మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండటం ఎలా.. అనే అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. డివిజన్‌లో మిగిలిన అన్ని పాఠశాలల్లో చైల్డ్‌సేఫ్టీ కమిటీలు వేసుకోవడానికి ముందుకు రావాలని స్కూల్ నిర్వాహకులు, ఉపాధ్యాయులను కోరినట్లు తెలిపారు. త్వరలో కాలేజీ విద్యార్థులకు సైతం నేరాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, కాలేజీ స్థాయిలోను సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

గతంతో పోలిస్తే ఇప్పుడు సాంకేతిక పరంగా చాలా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, సైబర్ నేరాలకు పాల్పడేవారి సంఖ్య కూడా పెరుగుతూ వస్తోందన్నారు. విద్యార్థులు సైబర్ నేరాల బారిన పడకుండా, ఫేక్ వీడియోల వల్ల ఇబ్బందులు ఎదుర్కొనకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు తమ ప్రాంతాలలో నిర్దిష్టమైన అంశాలపై ముందుకు వస్తే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.




ఎస్.రష్మీ పెరుమాళ్

కనువిందు చేసే కృత్రిమం

ఫ్యాషన్

సహజసిద్ధమైన అందాలు అన్నిసార్లూ, అందరికీ సాధ్యపడకపోవచ్చు. అలాంటప్పుడు ఫ్యాషన్‌గా కనిపించడం కోసం, కృత్రిమ అందాలను ఆశ్రయించడంలో తప్పు లేదు. అలా అందుబాటులోకి వచ్చినవే, కృత్రిమ కనురెప్పలు, గోళ్లు, వెంట్రుకలు. వాటి గురించి తెలుసుకుందామా?





కృత్రిమ కనురెప్పలు

ఒత్తైన కనురెప్పలు ముఖానికి కచ్చితంగా అందాన్ని తెచ్చిపెడతాయి. కానీ అలాంటి కనురెప్పలు ఎంతో అరుదుగా కొంతమందికే ఉంటాయి. కనురెప్పలు ఒత్తుగా లేని వాళ్లు ఆర్టిఫిసియల్ ల్యాషెస్‌ను ఎంచుకోవచ్చు. జిగురుతో కనురెప్పల పైన అంటించుకునే వీలుండే ఈ ల్యాషెస్ ఎన్నో రంగుల్లో దొరుకుతాయి. కాబట్టి కనురెప్పల వెంట్రుకలతో చక్కగా కలిసిపోయే కృత్రిమ కనురెప్పలను ఎంచుకోవాలి.

కృత్రిమ గోళ్లు

గోళ్లు అందరికీ దృఢంగా పెరగవు. అలాంటి వాళ్లు ఆర్టిఫిసియల్ నెయిల్స్‌ను గోళ్ల మీద అంటించుకోవచ్చు. నచ్చిన రంగు వేసుకున్న కృత్రిమ గోళ్లు, సహజసిద్ధమైన గోళ్లను మరిపించేలా ఉంటాయి. వేర్వేరు సైజుల్లో దొరికే ఆర్టిఫిసియల్ గోళ్లను గోళ్ల పైన జిగురుతో అంటించుకోవచ్చు. వీటిని తొలగించడం కూడా తేలికే! అవసరం లేనప్పుడు వీటిని భద్రపరుచుకుని, తిరిగి వాడుకోవచ్చు.









కృత్రిమ హెయిర్ ఎక్స్‌టెన్షన్స్

కొందరికి నుదురు పెద్దగా ఉండవచ్చు. ఇంకొందరికి నుదుటి దగ్గర వెంట్రుకలు ఊడిపోయి ఉండవచ్చు. ఇంకొందరికి తలంతా పలుచబడి ఉండవచ్చు. ఇలాంటి వాళ్లు స్టైలిష్‌గా కనిపించడం కోసం కృత్రి హెయిర్ ఎక్స్‌టెన్షన్ల మీద ఆధారపడవచ్చు. సహజసిద్ధ జుట్టును మరిపించేలా ఉండే ఈ ఎక్స్‌టెన్షన్లు వేర్వేరు సైజుల్లో దొరుకుతాయి. నుదురు, చెవుల దగ్గర, తల వెనక, పైన... ఇలా అంటించుకునే ప్రదేశాన్ని బట్టి ఈ ఎక్స్‌టెన్షన్ల సైజులూ, ధరలూ మారుతూ ఉంటాయి.

సెలబ్ షెల్

పాటల్లో మురిపించి... కథలో అప్పుడప్పుడూ కనిపించే రొటీన్ కథానాయిక కాదు ఆమె. హీరో ఎవరైనా... అతడికి సరితూగే పాత్రలతో మెప్పిస్తున్న నటి. పరిశ్రమలోకి అడుగుపెట్టినప్పుడు... ఇప్పుడు... నటనకు ఆస్కారమున్న చిత్రాలకే ప్రాధాన్యమివ్వస్తూ సాగిపోతోంది **భూమి పెడ్నేకర్**. తొలి సినిమాలో భారీ కాయంతో కనిపించిన భూమి... ఆ తరువాత ఏ బాలీవుడ్ తారకూ తీసిపోని రూపాన్ని సంతరించుకుంది. ఎలా..?



అప్పుడు బొద్దుగా...
ఇప్పుడు మెరుపు తీగలా!

భూమి పెడ్నేకర్ పరిశ్రమలోకి వచ్చి పదేళ్లు కూడా కాలేదు. కానీ ఇరవైకి పైగా చిత్రాల్లో నటించింది. ఈ కొద్ది ప్రయాణంలోనే ఎవరికీ తలవంచని దృఢమైన పల్లెటూరి అమ్మాయి పాత్రలకు కేరాఫ్ అడ్రెస్‌గా పేరు తెచ్చుకుంది. చక్కని అభినయంతో మూడు ఫిలిమ్‌ఫేర్‌తో పాటు మరెన్నో అవార్డులు దక్కించుకుంది. అనుష్కా, దీపికా, కత్రినా, కియారా అద్వానీ లాంటి స్టార్ హీరోయిన్ల మధ్యన తనకూ ఒక ప్రత్యేక మార్కెట్‌ను సంపాదించుకుంది. ఎన్నో ఇబ్బందులు పడి పరిశ్రమలో నిలదొక్కుకున్న భూమి... పుట్టింది, పెరిగిందీ ముంబయిలోనే. ఆమె తండ్రి సతీష్ మహారాష్ట్ర మంత్రి. ఓరల్ కేన్సర్‌తో తండ్రి చనిపోవడంతో... తల్లి సుమిత్ర పొగాకు వ్యతిరేక ఉద్యమం నడిపారు. 'ఆర్య విద్యామందిర్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన భూమి... నటి కావాలని కలలు కన్నది. అందుకు ఆమె తల్లితండ్రులు కూడా మద్దతునిచ్చారు. పదిహేనేళ్ల వయసులోనే నటనలో శిక్షణ కోసం 'విజిలింగ్ ఉడ్స్ ఇంటర్నేషనల్'లో చేరాలనుకుంది భూమి. బ్యాంకులో రుణం తీసుకుని మరీ అందులో చేర్పించారు ఆమె తల్లితండ్రులు. అయితే తరగతులకు తరచూ డుమ్మా కొట్టడంతో భూమిని ఆ సంస్థవాళ్లు బయటకు పంపించారు.

ఏడాదిన్నర తిరక్కుండానే 'యష్‌రాజ్ ఫిలిమ్స్'లో అసిస్టెంట్ క్యాస్టింగ్ డైరెక్టర్‌గా చేరింది భూమి. ఆరేళ్లు అక్కడ పని చేసిన తరువాత తరువాత... అంటే 2015లో ఊహించని బ్రేక్ వచ్చింది. మొదటి నుంచి నటి కావాలనుకున్న ఆమెకు 'దమ్ లగాకే హైసా'లో హీరోయిన్‌గా అవకాశం లభించింది. అందులో అధిక బరువు గల అమ్మాయి పాత్ర. దాని కోసం అప్పటికే బొద్దుగా ఉన్న భూమి... మరింత బరువు పెరిగింది. ఆ చిత్రంలోని నటనకుగానూ 'ఫిలిమ్‌ఫేర్ అవార్డు' వరించింది. ఇక అక్కడి నుంచి జయాపజయాలతో సంబంధం లేకుండా ఆమెకు అవకాశాలు వస్తూనే ఉన్నాయి. కానీ అన్నిటికీ ఓకే చెప్పకుండా విభిన్నంగా ఉన్న పాత్రలను మాత్రమే ఎంచుకొంటోంది. తొలి చిత్రం పూర్తయ్యేసరికి 89 కేజీల బరువున్న ఆమె... తక్కువ సమయంలోనే 57 కేజీలకు తగ్గింది. భూమి రూపంలో మార్పు చూసి నాడు అభిమానులే కాదు... బాలీవుడ్ ప్రముఖులు సైతం అభినందనలతో ముంచెత్తారు. విశేషమేమంటే... దీని కోసం ఆమె ఏ డైటీషియన్ సహాయం తీసుకోలేదు.



'తిండి విషయంలో నేను అస్సలు ఆలోచించను. నచ్చింది తినడంలో నాకు ఎంతో ఆనందం. ముఖ్యంగా స్వీట్స్ నాకు బాగా ఇష్టం. అవి లేకుండా నా రోజు పూర్తవదు. బరువు తగ్గే క్రమంలో కూడా నేను నా రోజువారీ ఆహారంలో పెద్దగా మార్పులేవీ చేయలేదు. నెయ్యి, బటర్, బటర్‌మిల్క్... ఇవన్నీ నా మెనూలో ఉంటాయి. వదిలేసిందల్లా పంచదారతో చేసిన వంటలు మాత్రమే. అలాగే పిండిపదార్థాలు (కార్బోహైడ్రేట్స్) పరిమితికి మించి లోపలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నాను.

వర్కవుట్ ఇలా...

- భూమి వర్కవుట్స్‌లో ఒక్కో రోజు ఒక్కో రకం వ్యాయామాలు ఉంటాయి.
- అధిక క్యాలరీలు కరగడానికి వారంలో కనీసం మూడు రోజులు కార్డియో చేస్తుంది.
- కండరాలు దృఢంగా మారడానికి రెండు రోజులు వెయిట్ ట్రైనింగ్.
- వీటితోపాటు యోగా, హై ఇంటెన్సిటీ ఇంటర్వెల్ ట్రైనింగ్ (హెచ్ఐఐటీ) లాంటివి ఉంటాయి.

'ఒకేచోట అదేపనిగా కూర్చోకుండా నాకు నచ్చదు. అలాగే చిన్న చిన్న అవసరాలు... లిఫ్టుకు బదులు మెట్లు ఎక్కడం, దూరం తక్కువగా ఉన్న వాటికి కారులో కాకుండా నడిచి వెళ్లడం, పక్కన నీళ్ల సీసా పెట్టుకోకుండా దాహం వేసినప్పుడల్లా లేచి వెళ్లి తాగడం చేస్తుంటాను. ఇవి కూడా వ్యాయామాల్లాంటివే కదా' అంటుంది భూమి.

ఇదీ మెనూ...

భూమి ఆహారంలో ప్రధానంగా జొన్న, రాగులు లేదా సజ్జ పిండితో చేసి రోటీలు ఉంటాయి. దీంతోపాటు పెద్ద బౌల్ నిండా వెజిటబుల్ సలాడ్, ఆపిల్, కొన్ని వాల్‌నట్స్, డ్రైడ్ బెర్రీస్ వంటి బలవర్ధక ఆహారం తీసుకొంటుంది.

- ఉదయం లేవగానే గ్లాసు గోరువెచ్చటి నీళ్లు, డీటాక్స్ జ్యూస్. రోజుకు కనీసం ఏడు లీటర్ల నీళ్లు తాగుతుంది.
- బ్రేక్‌ఫాస్ట్‌లో మరగబెట్టిన పాలతో ముస్లీ, ఫ్లాక్స్/ సన్ ఫ్లవర్ సీడ్స్, ఎగ్‌వైట్‌తో ఆమ్లెట్, ఏదైనా పండు
- మధ్యాహ్నం లంచ్‌లో బటర్, సబ్జీ, పప్పుతో రోటీ. ఇంట్లో తయారైన పెరుగు లేదా మజ్జిగ. గ్రిల్డ్ చికెన్ శాండ్‌విచ్, కీర, క్యారెట్ సలాడ్. లేదంటేప చికెన్ గ్రేవీతో బ్రౌన్ రైస్.
- సాయంత్రం ఆపిల్, బొప్పాయి లేదా జామ పండు, బాదం, వాల్‌నట్స్, గ్రీన్ టీ.
- రాత్రి భోజనంలో పండ్లు, ఆకుకూరల సలాడ్, బాదం/ జీడిపప్పు, గ్రిల్డ్ చికెన్/ పనీర్. లేదా ఉడకబెట్టిన కూరగాయ ముక్కలు, చిన్న కప్పు బ్రౌన్ రైస్/ మల్టీగ్రెయిన్ రోటీ.

చెబితే నమ్మరు కానీ... ఇప్పటివరకు నేను ఏ డైటీషియన్ లేదా న్యూట్రిషనిస్ట్ వద్దకు వెళ్లలేదు. నేను, మా అమ్మ కలిసి ఒక మెనూ రూపొందించాం. అందుకు నేనైతే గూగుల్‌లో శోధించి, నా శరీర తత్వానికి ఏది సరిపోతుందో చూసుకున్నాను. ఇక అమ్మకైతే బరువు తగ్గడానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలన్నది బాగా తెలుసు. ఏ వంటైనా ఇంట్లో వండిందే తింటాను. ఆహార నియమాలు పాటిస్తూనే క్రమం తప్పని వ్యాయామం నా జీవనశైలిలో భాగం చేసుకున్నాను. బరువు తగ్గడానికి ఇంతకు మించి నేను కష్టపడిందేమీ లేదు. ఏదిఏమైనా డైట్ ప్లాన్ నుంచి రిఫైన్డ్ షుగర్‌ను తీసేయడం నా జీవితంలో తీసుకున్న ఉత్తమ నిర్ణయం' అంటున్న భూమి... ఐదు రోజులకు ఒకసారి నియమాలు పక్కన పెట్టి తనకు ఇష్టమైనవన్నీ లాగించేస్తుంది. 'పంచదారకు బదులు తేనె వాడతాను. అందులో జింక్, పొటాషియం, క్యాల్షియం, విటమిన్ బి-6 సమృద్ధిగా ఉంటాయి. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. నిమ్మ రసంలో, ఓట్స్ లేదా పాలలో... తేనెను ఎలాగైనా తీసుకోవచ్చు. అయితే అతిగా మరిగిస్తే అందులోని పోషకాలు, రుచి పోతాయి' అని చెబుతోంది. పంచదార వాడకంవల్ల 59 శాతం మంది ఆరోగ్యం దెబ్బతిందని అమెరికాలో జరిపిన ఓ అధ్యయనంలో తేలింది.

సినిమాలు, యాడ్ షూటింగ్‌లతో క్షణం తీరిక లేకుండా గడిపే భూమి... ఇన్‌స్టాగ్రామ్‌లో తన పార్టీలు, ఫిట్‌నెస్‌కు సంబంధించిన పోస్టులు తరచూ అప్‌లోడ్ చేస్తుంటుంది. వాటితోపాటు ఆరోగ్యకరమైన జీవన విధానానికి తనకు తెలిసిన సూచనలు, చిట్కాలు ఇస్తుంటుంది. అంతేకాదు... పర్యావరణ హితం కోసం వాతావరణ మార్పులపై అవగాహన కల్పించేందుకు 'ఐక్యరాజ్యసమితి' చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొంటోంది.

స్టైల్ టిప్స్


హై హీల్స్‌లో హై క్లాస్‌గా...



ఎత్తు చెప్పులు ధరిస్తే లుక్ అదిరిపోతుంది కానీ... అవి ఎంతో కొంత అసౌకర్యాన్ని కలిగిస్తాయి. దాంతోపాటు పాదాలకు, చీలమండలకు, వెన్నెముకకు కూడా సమస్యలు తెచ్చిపెడతాయంటున్నారు నిపుణులు. అందుకే చాలామంది వాటిని ధరించడానికి వెనకాడుతూ ఉంటారు. కానీ కొన్ని చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే హై హీల్స్ ఇబ్బందులను అధిగమించవచ్చు. అదెలాగంటే...

- ఎత్తు చెప్పులను ప్రతి రోజూ వేసుకుంటే ఇబ్బందులు తప్పవు. కాబట్టి రోజు విడిచి రోజు వేరే చెప్పులు వేసుకుంటూ ఉండాలి. ఇలా చేస్తే పాదాలు సేదతీరి నొప్పి పెట్టకుండా ఉంటాయి.
- ఎత్తు చెప్పుల వల్ల పాదాలు, మడమలు నొప్పి పెడుతూ ఉంటాయి. అలాం నొప్పి పెడితే... అరచేతులతో పాదాలను ముందుకు వెనక్కి వంచి, టెండాన్లు వదులయ్యేలా చేయాలి. ఇలా చేస్తే నొప్పి నుంచి కాస్త ఉపశమనం లభిస్తుంది.
- పాదాలు ఒరుసుకుపోకుండా, ఇన్‌సోల్స్ వాడుకోవచ్చు. సిలికాన్‌తో తయారైన ఇన్‌సోల్స్ పాదాలకు కుషన్‌లా పని చేస్తాయి.
- ఎత్తు చెప్పుల్లో రోజంతా గడిపితే పాదాలు అలసటకు లోనవుతాయి. ఈ ఇబ్బందిని వదిలించాలంటే ఇంటికి వెళ్లిన వెంటనే వేడి నీళ్లలో పాదాలను 15 నిమిషాల పాటు ముంచి ఉంచాలి. ఇలా చేస్తే అలసటకు గురయిన పాదాల్లోని టెండాన్లు, కండరాలు రిలాక్స్ అవుతాయి.

చిట్కా



దుస్తులు కొత్తగా!

ఖరీదైన దుస్తులు ఒక్క ఉతుకులోనే పాడైపోతే ఉసూరుమంటుంది. వెలసిపోకుండా, కుట్లు ఊడిపోకుండా, కుంచించుకుండా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి.

- **రంగు పోకుండా:** కొత్త దుస్తులను వాషింగ్ మెషిన్‌లో వేసే ముందు, లేదా ఉతికే ముందు ఉప్పు కలిపిన నీటిలో గంట పాటు నానబెట్టాలి. ఇలా చేస్తే రంగులు వదలకుండా ఉంటాయి.
- **బ్లీచింగ్:** రంగు దుస్తులు ఉతికేటప్పుడు వాటిని బ్లీచ్ చేయకూడదు.
- **వేడి నీటిలో:** ఉతికితే కుంచించుకుపోతాయి అనే అనుమానం ఉన్న దుస్తులను వేడి నీటిలో ఉతకాలి.
- **ఇలా వద్దు:** వదులు అయిపోయే వీలున్న దుస్తులను వాషింగ్ మెషిన్‌లో కాకుండా చేత్తో ఉతకాలి. దండెం మీద కాకుండా క్లాత్ డ్రైయర్ స్టాండ్ మీద పరిచి ఆరబెట్టాలి.
- **రీస్టిచ్:** కుట్లు ఊడిపోయే వీలున్న దుస్తులను కొన్న వెంటనే రీ స్టిచ్ చేయించాలి.
- **తగిన వేడి:** ఇస్త్రీ చేసేటప్పుడు క్లాత్ దేనితో తయారయిందో, అందుకు తగిన వేడిని సెట్ చేసుకున్న తర్వాతే ఐరన్ చేసుకోవాలి.
- **పాత దుప్పటిపై:** ఐరన్ చేసేటప్పుడు వేడెక్కిన ఐరన్ బాక్స్‌ను నేరుగా దుస్తుల మీద పెట్టేయకుండా మొదట, పాత దుప్పటి మీద రుద్ది, తర్వాతే ఐరన్ చేయాలి.

ఆ చులకన భావం పోవాలి

రెండేళ్ల వయసు నుంచీ జీవితంతో పోరాటం మొదలెట్టారు అర్చనా విజయన్. 'వైకల్యం ఉన్న నువ్వు డాక్టరెలా అవుతా'వనే ఎగతాళిని ఎదిరించి, మెడికల్ సీట్ సాధించారు. గాయనిగానూ రాణిస్తున్న ఇరవైమూడేళ్ల కేరళ అమ్మాయి స్ఫూర్తివంతమైన కథ ఆమె మాటల్లోనే...



"మనకు ఏదైనా సమస్య ఉన్నప్పుడు మన పరిమితుల గురించి ఆలోచించడం మొదలుపెడతాం. కోరుకున్నది చెయ్యలేమేమోని భయపడతాం. మనలోని లోపాల్ని తలచుకుంటూ కుమిలిపోవడానికి బదులు... మన సామర్థ్యాల మీద దృష్టి కేంద్రీకరించాలి. వాటిని పటిష్ఠం చేసుకోవాలి. లక్ష్యాల్ని ఏర్పరచుకోవాలి. వాటిని నెరవేర్చుకోవడానికి ప్రయత్నించాలి. నేను చేసింది కూడా అదే. ఊహ తెలియనప్పటి నుంచే జీవితంతో పోరాడుతున్నాను. మాది కేరళలోని పాలక్కాడ్. రెండేళ్ళ వయసులో... నాకు 'స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ' అనే జన్యు వైకల్యం ఉందని నిర్ధారణ అయింది. అది కేంద్ర నాడీ వ్యవస్థ మీద తీవ్ర ప్రభావం చూపిస్తుంది. నడవడం కాదు కదా... కదలడం కూడా కష్టమవుతుంది. ఫిజియోథెరపీతో దాన్ని అధిగమించవచ్చని మొదట్లో వైద్యులు చెప్పారు. కానీ అయిదేళ్ళు వచ్చేసరికి అడుగు కూడా వెయ్యలేని పరిస్థితి. మా నాన్న పోస్ట్‌మ్యాన్. నన్ను బడిలో చేర్చడానికి ఆయన ఎందరినో బతిమాలాల్సి వచ్చింది. చివరికి ఒక గవర్నమెంట్ స్కూల్‌లో నాకు అడ్మిషన్ ఇచ్చారు. నాన్న లేదంటే అమ్మ నన్ను స్కూల్‌కు మోసుకొని తీసుకువెళ్ళేవారు. అందరు పిల్లల్లా ఆటలు ఆడలేకపోతున్నానని బాధపడేదాన్ని. అయితే టీచర్లు, తోటి విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉండడం కాస్త ఊరటగా ఉండేది. కానీ హైస్కూల్లో ఎనిమిదో క్లాసులో చేరినప్పుడు... నాకు ఎదురైన అతి పెద్ద సమస్య... టాయిలెట్. అక్కడ ఇండియన్ స్టైల్ టాయిలెట్ ఉండేది. దాంతో వేరే స్కూల్‌కు మారాలనుకున్నాను. ఇది టీచర్ల ద్వారా పాఠశాల యాజమాన్యానికి తెలిసింది. నాకోసం వెస్టర్న్ టాయిలెట్ నిర్మించారు. అంతేకాదు... టెన్త్ క్లాస్ వరకూ నేను ఒకే తరగతి గదిలో పాఠాలు వినడానికి అవకాశం ఇచ్చారు. ఒకవైపు తీవ్రమైన వైకల్యంతో బాధపడుతున్నా... మరోవైపు ఇటువంటి ప్రోత్సాహం బాగా చదవాలనే కోరికను నాలో పెంచింది. టెన్త్‌లో అన్ని సబ్జెక్ట్‌లో 'ఎ-ప్లస్'లో పాసయ్యాను. డాక్టర్ కావాలనేది నా కల. దాంతో సైన్స్ స్ట్రీమ్‌లో చేరడానికి దరఖాస్తు చేసుకున్నాను. 'సైన్స్ కోర్సులంటే ల్యాబ్‌లో గంటల తరబడి నిలబడాల్సి ఉంటుంది. నీ శారీరక స్థితి దానికి అనుకూలంగా లేదు. కాబట్టి సీటు ఇవ్వలేం" అనేది కాలేజీల నుంచి వచ్చిన సమాధానం. "ఎందుకింత పట్టుపడుతున్నావ్? వేరే కోర్సుల్లో చేరొచ్చు కదా!" అని పరిచయస్తులు సలహా ఇచ్చారు. "ఎందుకంటే నేను డాక్టర్ కావాలి" అని వారితో స్పష్టంగా చెప్పాను. ఆఖరికి గవర్నమెంట్ కాలేజీలో సీటు దొరికింది. లేబరేటరీలు వేర్వేరు అంతస్తుల్లో ఉండేవి, లిఫ్టులు లేవు. కొన్నాళ్ళు నా ఫ్రెండ్స్ నన్ను మోస్తూ తీసుకువెళ్ళేవారు. ఆ తరువాత మా పాత స్కూల్ యాజమాన్యం వీల్ ఛైర్‌ను నాకు గిఫ్ట్‌గా ఇచ్చింది. దాంతో ఇంటి నుంచి కాలేజీకి రావడం, తరగతి గదుల మధ్య తిరగడం కాస్త సులువైంది.



నేషనల్ బోర్డ్ వరకూ వెళ్ళాను...

ఇంటర్ రెండేళ్ళూ కష్టపడి చదివాను. టెన్త్ వరకూ మళయాళ మీడియంలో ఉండేదాన్ని. ఇంటర్‌లో ఇంగ్లీష్ మీడియంలోకి మారాను. అయినప్పటికీ 98 శాతం మార్కులతో పాసయ్యాను. 2016లో 'నీట్' ఎగ్జామ్ రాశాను. మంచి ర్యాంక్ వచ్చింది. శారీరక వైకల్యాలున్న వారికి ఎంబిబిఎస్‌లో చేరాలంటే రాష్ట్ర మెడికల్ బోర్డు ధ్రువీకరణ తప్పనిసరి. కాబట్టి ఫిజికల్ ఎగ్జామినేషన్ కోసం త్రివేండ్రం మెడికల్ కాలేజీలో... కేరళ మెడికల్ బోర్డు ముందుకు హాజరయ్యాను. అక్కడి అధికారులు నా దరఖాస్తును తిరస్కరించడమే కాదు... "నువ్వు మెడిసిన్ చదవడానికీ, ప్రాక్టీస్ చెయ్యడానికీ అనర్హురాలివి" అన్నారు. పైపెచ్చు ఎగతాళిగా మాట్లాడారు. అడ్మిషన్ ఇవ్వలేదు.. మరుసటి ఏడాది మళ్ళీ 'నీట్' రాసి, ఎంపికకు వెళ్ళాను. ఈసారీ అదే అధికారులు... అదే వైఖరి. అప్పటి వరకు... వైకల్యాలున్న వారు మెడిసిన్ చదవడానికి ఇండియన్ మెడికల్ కౌన్సిల్ కొన్ని పరిమితులు విధించింది. తరువాత వాటిలో కొంత సడలింపు ఇచ్చింది. దాని ప్రకారం నేను అర్హురాలినే. అయినా అడ్మిషన్ ఇవ్వనన్నారు. ఈలోగా ప్రవేశాల గడువు ముగిసిపోయింది. ఇది నాకు చాలా అవమానంగా అనిపించింది. 'నీట్' కోసం రెండేళ్ళ పాటు ఇంట్లోనే ఉండి ప్రిపేర్ అయ్యాను. ఆ సమయంలోనే ఎన్నో జీవిత పాఠాలూ నేర్చుకున్నాను. "ఈసారి కూడా సీట్ రాలేదు కదా! ఏం చేద్దామనుకుంటున్నావ్?" అనే ప్రశ్నలు ఎందరి నుంచో ఎదురయ్యేవి. మరోవైపు నా తల్లితండ్రుల్లో నా భవిష్యత్తు గురించి ఆందోళన ఎక్కువయింది. కానీ నా లక్ష్యాన్ని మార్చుకొనే ఉద్దేశం నాకు లేదు. న్యాయపోరాటానికి కూడా సిద్ధమయ్యాను. 2018లో మళ్ళీ 'నీట్' రాశాను. ఈసారి 'నేషనల్ మెడికల్ బోర్డు'కు విజ్ఞాపన పంపాను. మద్రాస్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ఆ బోర్డ్ ముందు హాజరయ్యాను. అవకాశం ఇస్తే నేను మెడిసిన్ చేయగలననీ, వైద్య వృత్తికి న్యాయం చెయ్యగలననీ అక్కడ అధికారులను ఒప్పించగలిగాను. నేషనల్ బోర్డు ఇచ్చిన ధ్రువీకరణతో... కొట్టాయం మెడికల్ కాలేజీలో సీట్ వచ్చింది. అలా నా కలలో ప్రధానమైన భాగం నెరవేరింది.

తొలి అడుగు వేశాను...

ఇప్పుడు ఎంబిబిఎస్ నాలుగో సంవత్సరంలో ఉన్నాను. మా అమ్మ దేవి నాతోపాటు కొట్టాయంలోనే ఉండి, నా సంరక్షణ చూసుకుంటోంది. ఈ నాలుగేళ్ళలో... నా చదువుకు నా వైకల్యం ఎక్కడా అడ్డంకి కాలేదు. స్టడీస్‌తో పాటు సాహిత్యం, సంగీతం నాకు ఇష్టం. 'కేరళ స్టేట్ యూత్‌ఫెస్టివల్'తో సహా అనేక వేదికల మీద సంగీత ప్రదర్శనలు ఇచ్చాను. కొన్ని సినిమాల్లో పాటలు కూడా పాడాను. 'బ్యాక్‌ప్యాకర్స్' అనే చిత్రం కోసం ప్రసిద్ధ గాయకుడు హరిచరణ్‌తో పాడిన యుగళ గీతానికి ఎన్నో ప్రశంసలు లభించాయి. మరోవైపు కాలేజీ యాక్టివిటీస్‌లోనూ, వివిధ సామాజిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నాను. నాలాంటివారికోసం తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రధానంగా ప్రస్తావిస్తున్నాను. పాఠశాలలు, కళాశాలలు, రైల్వే స్టేషన్ల లాంటి ప్రదేశాల్లో శారీరక వైకల్యాలు ఉండేవారి కోసం లిఫ్టులు, వీల్ ఛైర్ల కోసం ర్యాంపులు, సౌకర్యవంతమైన టాయిలెట్ల ఏర్పాటు చేయాలి. బాగా చదువుకొని, ఉన్నత స్థానాల్లో ఉన్నవారిలో కూడా వికలాంగులంటే ఉన్న చులకనభావం పోవాలి. వాటికోసం కృషి చేస్తున్నాను. చిన్నప్పుడు ఇల్లు, స్కూలు తరువాత ఎక్కువ కాలం గడిపింది ఆసుపత్రుల్లోనే. వైద్య వృత్తి సమాజానికి ఎంత ప్రధానమైనదో, వైద్యుల ప్రవర్తన ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో నాకు బాగా తెలుసు. మందులు రాసి ఇచ్చినంతమాత్రాన వైద్యుల బాధ్యత పూర్తికాదు. రోగికి మానసిక స్థైర్యాన్ని, కోలుకోగలననే ధీమాను అందజేయాలి. రోగులు చెప్పేది శ్రద్ధగా వినే సహనం కావాలి. నేను మంచి వైద్యురాలిని కాగలననే నా నమ్మకం. మా కుటుంబంలో మొదటి డాక్టర్ కావాలనుకున్నాను. దానికోసం తొలి అడుగు విజయవంతంగా వేశాను. నా కథ నాలాంటివారు కొందరిలోనైనా ఆత్మవిశ్వాసం నింపుతుందని నా ఆశ."

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
బుధవారం • 24 జనవరి 2024
cinema@andhrajyothy.com

సైఫ్‌కు సర్జరీ



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ మోచేతికి సర్జరీ జరిగింది. షూటింగ్‌లో యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొంటున్నప్పుడు ఆయన ఎడమ చేతికి గాయం అయింది. వెంటనే ఆయన ముంబైలోని కోకిలా బెన్ ఆస్పత్రిలో సోమవారం చేరారు. అయితే ఇది కొత్త గాయం కాదు. 2017లో విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో 'రంగూన్' చిత్రంలో నటిస్తున్నప్పుడు కూడా గాయపడ్డారు. అదే గాయం ఇప్పుడు తిరగబెట్టడంతో సర్జరీ అవసరమైంది. దాంతో ఆయన ఎడమ మోచేతికి సర్జరీ చేశారు వైద్యులు. మంగళవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన సైఫ్ బాంద్రాలోని తన నివాసం దగ్గర చేతి కట్టుతో కనిపించారు. 53 ఏళ్ల సైఫ్ ప్రస్తుతం తెలుగులో జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న 'దేవర' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్‌లోనే ఆయన గాయపడ్డాడని అంటున్నారు కానీ, అధికారికంగా ఎవరూ వెల్లడించలేదు. తనకు సర్జరీ జరిగిన విషయాన్ని సైఫ్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. అయితే ఏ షూటింగ్‌లో జరిగిందన్న విషయాన్ని మాత్రం ఆయన పేర్కొనలేదు.



మిస్ పర్ఫెక్ట్‌గా ఉన్న నేను మిసెస్ పర్ఫెక్ట్‌నయ్యా

లావణ్య

'అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం రోజున మా సిరీస్ ట్రైలర్ రిలీజ్ కావడం ఆనందంగా ఉంది. ఈ సిరీస్ స్టార్ట్ చేసినప్పుడు నేను మిస్ పర్ఫెక్ట్. కానీ పూర్తయ్యే లోపు మిసెస్ పర్ఫెక్ట్ అయ్యా. దీనికి ముందు నేను చేసిన కొన్ని ప్రాజెక్టుల వల్ల అలసిపోయా. అలాంటి టైమ్‌లో 'మిస్ పర్ఫెక్ట్' లాంటి స్క్రిప్ట్ దొరకడం నాకు పెద్ద రిలీఫ్' అన్నారు లావణ్య. ఆమెతో పాటు అభిజీత్, అభిజ్ఞ కీలక పాత్రలు పోషించిన 'మిస్ పర్ఫెక్ట్' వెబ్ సిరీస్ ఫిబ్రవరి 2న డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. అన్నపూర్ణ స్టూడియో బేనర్‌పై సుప్రియ నిర్మించారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకుడు. సోమవారం రాత్రి జరిగిన ప్రెస్‌మీట్‌లో సిరీస్ ట్రైలర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో లావణ్య మాట్లాడుతూ 'సుప్రియ గారితో 'సోగ్గాడే చిన్నినాయన' చిత్రం చేశాను. అది హిట్ అయింది. ఈ సిరీస్ కూడా హిట్ కావాలి. మా దర్శకుడు విశ్వక్ దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకున్నా' అన్నారు.

దర్శకుడు విశ్వక్ మాట్లాడుతూ 'లావణ్య 'అందాల రాక్షసి' చిత్రంలో ఎలాంటి పెర్ఫార్మెన్స్ ఇచ్చారో అటువంటి నటనే ఈ సిరీస్‌లో కావాలనుకున్నా. అలాగే అభిజీత్ నటించిన 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' చూశాను. ఆడిషన్ ఇవ్వాల్సిన అవసరం తనకు లేకున్నా ఈ సిరీస్ కోసం ఆడిషన్ ఇచ్చాడు. షూటింగ్ టైమ్ సరదాగా గడిచింది' అని చెప్పారు. నిర్మాత సుప్రియ మాట్లాడుతూ 'కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడం అంటే నాగార్జునగారికి, తాతగారికి ఇష్టం. అందుకే అన్నపూర్ణ సంస్థ పెట్టారు. చాలా మంది కొత్త వాళ్లకు అవకాశం ఇచ్చారు. చాలా మంది అమ్మాయిలు నో చెప్పిన పాత్రను నేను చేస్తానంటూ ముందుకు వచ్చి తన గట్స్ ఏమిటో ప్రూవ్ చేసింది అభిజ్ఞ. అభిజీత్ తన పాత్ర బాగా చేశాడు. మిస్ పర్ఫెక్ట్ కు లావణ్య పర్ఫెక్ట్. ఒక చిన్న కథలో బలమైన పాత్రలు ఉండి మిమ్మల్ని ఆకట్టుకుంటాయి' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో అభిజీత్, రోషన్, కేశవ్, మహేశ్ విట్టా, అభిజ్ఞ, క్రియేటివ్ ప్రొడ్యూసర్ అదీప్ అయ్యర్ తదితరులు కూడా మాట్లాడారు.

స్వేచ్ఛ, ఆత్మగౌరవాలకు అద్దం పట్టే కెప్టెన్ మిల్లర్


జాతీయ ఉత్తమనటుడు ధనుష్ నటించిన 'కెప్టెన్ మిల్లర్' చిత్రం ఈ నెల 26న తెలుగులో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మీడియాతో ముచ్చటించారు.



'కెప్టెన్ మిల్లర్' ఆలోచన నాకు పదేళ్లక్రితమే మొగ్గ తొడిగింది. కథ రాస్తున్నప్పుడు తెలీకుండానే కథానాయకుడిగా ధనుష్ నా మస్తిష్కంలో మెదిలాడు. కథ పూర్తవ్వగానే ఆయన్ను కలిశాను. తనకు కూడా కథ బాగా నచ్చింది. అలా 'కెప్టెన్ మిల్లర్' మొదలైంది. బ్రిటిష్ ఆర్మీలో పనిచేస్తున్న భారతీయ సైనికుడి కథ ఇది. ధనుష్ అద్భుతమైన నటన కనబరిచాడు. ఆయనతో పనిచేయడం గొప్ప అనుభవం.

- ఇది చిత్రమైన కథ. 40శాతం యాక్షన్ ఉంటుంది. మిగతా అంతా హీరో ప్రయాణమే. ఇదోక ప్యూర్ డ్రామా. ప్రేక్షకులు తమకు తాము ఐడెంటిఫై చేసుకునేలా ఇందులో పాత్రలు ఉంటాయి. పాత్రధారులంతా ఒదిగిపోయి నటించారు. ఇందులోని ఓ కీలక పాత్రలో శివరాజ్‌కుమార్ నటించారు. ఆయన పాత్ర సినిమాకే హైలైట్‌గా నిలుస్తుంది. కన్నడ బ్లాక్‌బాస్టర్ 'ఓం'లోని శివన్న నటనను మళ్లీ ఈ సినిమా గుర్తుచేస్తుంది. ఆయన లుక్. స్క్రీన్ ప్రెజన్స్ అద్భుతం. శివన్న పాత్ర ప్రేక్షకులకు ఓ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది.
- ప్రియాంక అరుళ్ మోహన్ ఇందులో కొత్తగా కనిపిస్తుంది. పూర్తిగా అభినయానికి అవకాశం ఉన్న పాత్రను ఇందులో ఆమె చేసింది. అలాగే సందీప్‌కిషన్ కూడా మంచి పాత్ర చేశారు. జీవీప్రకాశ్ సంగీతం, ముఖ్యంగా నేపథ్యసంగీతం ఈ సినిమాకు హైలైట్. 1930లో జరిగే కథ ఇది. అందుకే కెమెర్ డిపార్ట్‌మెంట్‌తోపాటు, ఆర్ట్ డిపార్ట్‌మెంట్ కూడా చాలా శ్రమించాల్సివచ్చింది. సాంకేతికంగా నెక్ట్స్ లెవల్లో సినిమా ఉంటుంది. 'కెప్టెన్ మిల్లర్' స్వేచ్ఛ, ఆత్మగౌరవం గురించి చర్చించే కథ. అందరికీ నచ్చుతుందని నా నమ్మకం.

ఆకట్టుకునేలా అరి



వినోద్‌వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ ప్రధానపాత్రలు పోషిస్తున్న చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. జయశంకర్ దర్శకుడు. శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారంరెడ్డి నిర్మాతలు. ఇందులోని సూర్య పురిమెట్ల పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. సూర్య పాత్ర చాలా కొత్తగా ఉంటుందని, కథ, కథనం, సంగీతం అన్ని అంశాలూ ఆకట్టుకునేలా ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని విడుదల చేయడంలో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ భాగస్వామి కానుందని సమాచారం. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది. వైవా హర్ష, శ్రీనివాసరెడ్డి, చమ్మక్ చంద్ర, శుభలేఖ సుధాకర్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కృష్ణప్రసాద్, శివశంకరప్రసాద్, సంగీతం: అనూప్ రూబెన్స్.

హనుమాన్ విశ్వరూప విజువల్స్‌ని సవాలుగా తీసుకున్నా..



'అసాధారణ విజయాన్ని అందుకున్న 'హను-మాన్' చిత్రానికి విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడిగా పనిచేసే అవకాశం రావడం నా పూర్వజన్మ సుకృతం' అని విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడు ఉదయకృష్ణ అన్నారు. ఆయన విజువల్స్ ఎఫెక్ట్స్ అందించిన 'హను-మాన్' చిత్రం ఎంతటి ఘనవిజయాన్ని అందుకుందో తెలిసిందే. ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో తేజ సజ్జా కథానాయకుడిగా కె.నిరంజన్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం వసూళ్ల పరంగా 200కోట్ల మైలురాయిని దాటి, ఇంకా అదే ఊపును కొనసాగిస్తోంది. ఈ సినిమా విజయం సాధించడం పట్ల ఉదయ్‌కృష్ణ ఆనందం వెలిబుచ్చారు. విజువల్ ఎఫెక్ట్స్ వినియోగించుకోవడంలో ఎస్.ఎస్.రాజమౌళి సరసన సగర్వంగా నిలిచేంత ప్రతిభ ప్రశాంత్‌వర్మలో పుష్కలంగా ఉందని ఉదయ్‌కృష్ణ పేర్కొన్నారు. రెండేళ్లుగా తన జీవితంలో అంతర్భాగంగా మారిపోయిన సినిమా 'హనుమాన్'. ఈ చిత్ర విజయం పడిన శ్రమంతా మరిచిపోయేలా చేసిందని ఆయన అన్నారు. ఈ సినిమాకోసం తను ఫేస్ చేసిన పెద్ద ఛాలెంజ్ పతాక సన్నివేశంలో హనుమంతుని విశ్వరూపమని, దర్శకులు కలలు గనే ఎంత గొప్ప విజువల్ అయినా సునాయాసంగా సాకారం చేసే సామర్థ్యం తనకుందని ఉదయ్‌కృష్ణ చెబుతున్నారు.

పెళ్లికి ముందు...



యూత్‌ను ఎట్రాక్ట్ చేసే కథతో పాటు మంచి సందేశం ఇస్తూ నిర్మించిన 'బిఫోర్ మ్యారేజ్' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. మూడు దశాబ్దాల క్రితం 'టార్జన్ సుందరి', 'ప్రేమ ఘర్షణ', 'సంసార వీణ' వంటి చిత్రాలు నిర్మించిన వై.నాగేశ్వరరెడ్డి తనయుడు ఎద్దుల జగదీశ్వర్ రెడ్డి తీసిన సినిమా ఇది. భరత్, నవీనా రెడ్డి జంటగా నటించిన ఈ చిత్రానికి శ్రీధర్ రెడ్డి అటాకుల దర్శకత్వం వహించారు. ఎస్.కె.ఎం.ఎల్. మోషన్ పిక్చర్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ద్వారా ఆదినారాయణ ఈ సినిమా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'లేడీ ఓరియంటెడ్ సినిమా ఇది. హీరోయిన్ బాగా చేసింది. ఇలాంటి చిన్న సినిమాలను ఆదరించాలి' అని కోరారు. 'పెళ్లికి ముందు తప్పు అనిపించని పొరపాటు ఆ తర్వాత జీవితంలో ఊహించని మార్పులకు కారణం అవుతుంది. అదే విషయాన్ని ఈ చిత్రంలో చెప్పాం. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా క్వాలిటీతో తీయడానికి నిర్మాత సహకరించారు. సినిమా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు దర్శకుడు. యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీసినట్లు నిర్మాత చెప్పారు. మంగ్లీ పాడిన పాట హైలైట్ అవుతుందని తెలిపారు.



నక్షత్రాల వెలుగులతో తివారీ రామాయణ్

దేశమంతా రామనామస్మరణతో పులకించిపోతున్న వేళ నితీష్ తివారి దర్శకత్వంలో రూపొందనున్న 'రామాయణ్' సినిమా విషయంలో ఆసక్తికరమైన అప్‌డేట్ వెలుగు చూసింది. 'కేజీఎఫ్'తో సూపర్‌హీరో ఇమేజ్‌ను సొంతం చేసుకున్న హీరో యష్ ఇందులో రావణ పాత్ర పోషించనున్నట్టు సమాచారం. మరికొన్ని కీలక పాత్రల విషయానికొస్తే.. హనుమంతుడిగా దేవ్‌దత్ నటిస్తుండగా, కుంభకర్ణుడి పాత్రకు బాబీడియోల్ ఎంపికైనట్టు తెలిసింది. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుందని సమాచారం. ఇందులో రాముడిగా రణ్‌బీర్‌కపూర్, సీతగా సాయిపల్లవి నటించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.

తెలుగులోనే కాదు ఏ భాషలోనూ రాని సినిమా



ఒకప్పటి చైల్డ్ ఆర్టిస్ట్ దీపక్ సరోజ్ 'సిద్ధార్థ్ రాయ్' చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. హరీశ్ శంకర్, వంశీ పైడిపల్లి వంటి దర్శకుల దగ్గర పనిచేసిన వి.యశస్వీ ఈ సినిమాకు దర్శకుడు. జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన నిర్మాతలు. మంగళవారం ఉదయం జరిగిన వేడుకలో థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన రచయిత యండమూరి వీరేంద్రనాథ్ మాట్లాడుతూ 'తను నమ్మింది బలంగా తీసే క్రియేటర్ యశస్వీ. 'సిద్ధార్థ్ రాయ్' వంటి సినిమా తెలుగులోనే కాదు ఏ భాషలోనూ రాలేదు. ఇలాంటి కాన్సెప్ట్‌తో సినిమా తీయాలంటే చాలా ధైర్యం కావాలి. ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుంది' అన్నారు. దర్శకుడు సాయిరాజేశ్ మాట్లాడుతూ 'ఈ కథ విని ఆశ్చర్యపోయా. ఇలాంటి కథ తీయాలన్నా, అలాంటి పాత్ర చేయాలన్నా గట్స్ కావాలి. ఈ విషయంలో దీపక్ చాలా లక్కీ. అద్భుతంగా నటించారు' అన్నారు. 'విలన్ లేకుండా హీరో ఉండడు. ఈ సినిమా ఫస్టహాఫ్ విలన్ అయితే, సెకండాఫ్ హీరో. కథ వినగానే అలా అనిపించింది. ఇలాంటి కథతో సమాజానికి ఏం చెప్పదలుచుకున్నావ్ అని దర్శకుడు యశస్వీని కోపడ్డాను. కానీ చాలా అద్భుతంగా సినిమాను తీర్చిదిద్దారు' అన్నారు రచయిత లక్ష్మీ భూపాల. 'అర్జున్‌రెడ్డి', 'యానిమల్' వంటి చిత్రాల కోసం ఆకలితో ఎదురు చూసే ప్రేక్షకులకు మూడో చిత్రం 'సిద్ధార్థ్ రాయ్' అని మరో దర్శకుడు వీరశంకర్ చెప్పారు. 'నా పాత్రను అద్భుతంగా మలిచి ఈ ప్రయాణంలో ప్రతి క్షణం సపోర్ట్ చేసిన మా దర్శకుడికి థాంక్స్. ఈ సినిమాలో పాత్ర గురించి, దాన్ని ఎందుకు చేశానో తర్వాతి వేడుకల్లో మాట్లాడతా' అన్నారు హీరో దీపక్ సరోజ్.

మస్తు షేడ్స్ ఉన్నాయ్‌రా..



కమెడియన్ అభినవ్ గోమఠం హీరోగా మారాడు. ఆయన హీరోగా 'మస్త్ షేడ్స్ ఉన్నాయ్‌రా' అనే పేరుతో సినిమా రానుంది. 'ఈ నగరానికి ఏమైంది' సినిమాలో అభినవ్ చెప్పిన పాపులర్ డైలాగ్ ఇది. అదే హీరోగా అతని తొలి సినిమా టైటిల్‌కి కావడం విశేషం. వైశాలీ రాజ్ హీరోయిన్. తిరుపతిరావు ఇండ్ల దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్.వి నిర్మాతలు. ఈ సినిమా టైటిల్ లోగోను దర్శకుడు తరుణ్‌భాస్కర్ ఆవిష్కరించారు. నటుడిగా అభినవ్ గోమఠంలోని కొత్తకోణాన్ని ఇందులో చూస్తారని, అన్ని ఉద్వేగాలూ ఈ సినిమాలో ఉంటాయని, వచ్చేనెల ద్వితీయార్థంలో సినిమాను విడుదల చేస్తామని దర్శకుడు తెలిపారు. తరుణ్‌భాస్కర్, అలీ రేజా, మొయిన్, చక్రపాణి ఆనంద్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ స్వయంభూ, కథ, అన్వర్ సాధిక్, మాటలు: రాధామోహన్ గుంటి, సంగీతం: సంజీవ్ టి.

ఎన్నికల ప్రయోజనం కోసమే యాత్ర 2

నట్టి కుమార్

లోకసభ ఎన్నికల తర్వాతే రాజకీయ కథాచిత్రం 'యాత్ర 2'ను సెన్సార్ చేయాలని నిర్మాత, పంపిణీదారుడు, తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు నట్టి కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సెన్సార్ బోర్డ్ ఛైర్‌పర్సన్‌కు, హైదరాబాద్ ప్రాంతీయ సెన్సార్ అధికారికి లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న వై.ఎస్.ఆర్. పార్టీకి, ఆ పార్టీ నేత, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అనుకూలంగా ఈ సినిమా తీశారని నట్టి కుమార్ ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రత్యేకించి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకి, కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత సోనియా గాంధీకి వ్యతిరేకంగా తీయడంతో పాటు వారి పాత్రలను కించపరుస్తూ వ్యంగ్యంగా ఈ సినిమాలో చిత్రీకరించారని ఆయన వివరించారు. తాజాగా పబ్లిసిటీ కోసం విడుదల చేసిన ఈ సినిమా ట్రైలర్ ఇందుకు ఓ ఉదాహరణ అనీ నట్టి కుమార్ వెల్లడించారు. సోనియా గాంధీని, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు నాయుడుని చులకన చేసి చూపించడం వెనుక త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రయోజనం పొందాలన్న ఉద్దేశం కనిపిస్తోందని తెలిపారు. సెన్సార్ ఇంకా చేయకుండానే ఫిబ్రవరి 8న ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారనీ, సెన్సార్ మార్గదర్శకాలకు ఇది విరుద్ధమనీ, దీనిపై కూడా చర్య తీసుకోవాలని సెన్సార్ బోర్డ్‌ను కుమార్ కోరారు. చిత్రంలోని పాత్రలు ఎవరి మనోభావాలు దెబ్బ తినకుండా, వ్యంగ్యంగా, అవమానకరంగా , కుట్రపూరితంగా లేకుండా చూసి సెన్సార్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో కూడా లోక్‌సభ ఎన్నికల ముందు 'యాత్ర 2' విడుదలైతే ఓటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని చెబుతూ, . ఇలా తమ నాయకులను కించపరిచే సన్నివేశాలతో ఎన్నికల ముందు ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి ప్రయత్నిస్తే లీగల్‌గా ముందుకు వెళ్తానని నట్టి కుమార్ ఆ లేఖలో పేర్కొన్నారు.



యదార్థ సంఘటనల మూడోకన్ను

అమెరికాలో యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న చిత్రం 'మూడో కన్ను'. సాయికుమార్, శ్రీనివాసరెడ్డి, నిరోషా, వీరశంకర్, కాశీవిశ్వనాథ్, మాధవిలత ఇందులో ప్రధానపాత్రధారులు. నాలుగు కథలతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి దర్శకులు కూడా నలుగురు కావటం విశేషం. సూరత్ రాంబాబు, కె.బ్రహ్మయ్య ఆచార్య, కృష్ణమోహన్, మావిటి సాయిసురేంద్రబాబు ఈ చిత్రానికి దర్శకులు. కె.వి.రాజమహి, సునీత రాజేందర్ దేవులపల్లి నిర్మాతలు. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ చేతులమీదుగా ఘనంగా విడుదల చేశారు. సినిమా విజయం సాధించి అందరికీ మంచి పేరు తీసుకురావాలని శ్రీకాంత్ శుభాకాంక్షలు అందించారు. ఇంకా చిత్ర బృందం మాట్లాడారు. ఈ నెల 26న ఈ సినిమా విడుదల కానుంది.

రొమాంటిక్ హనీమూన్ ఎక్స్‌ప్రెస్

చైతన్యరావు, హెబ్బాపటేల్ జంటగా రూపొందుతోన్న చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. బాలరాజశేఖరుని దర్శకుడు. కె.కె.ఆర్, బాలరాజ్ నిర్మాతలు. కల్యాణీమాలిక్ స్వరపరిచిన 'నిజమా..' అంటూ సాగే ప్రేమగీతాన్ని రామ్‌గోపాల్‌వర్మ చేతులమీదుగా విడుదల చేశారు. 'నిజమా' పాట మెలోడియస్‌గా ఉందని, చాలా బాగా తీశారని, కెమెరా వర్క్ సూపర్ అని రామ్‌గోపాల్‌వర్మ అభినందించారు. కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని వర్మ ఆశాభావం వ్యక్తం చేశారు. విభిన్న కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోందని దర్శకుడు చెప్పారు. సుహాసిని, తనికెళ్ల భరణి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శిష్టా వి.ఎమ్.కె.



ఐసీసీ వన్డే టీమ్ కెప్టెన్‌గా రోహిత్

దుబాయ్: గతేడాదికి సంబంధించి అత్యుత్తమ ఆటగాళ్లతో ఐసీసీ వన్డే జట్టును రూపొందించింది. దీనికి రోహిత్ శర్మను కెప్టెన్‌గా నియమించడం విశేషం. ఈ టీమ్‌లో మొత్తంగా ఆరుగురు భారత ఆటగాళ్లకు చోటు కల్పించింది. ఇందులో విరాట్, గిల్, స్పిన్నర్ కుల్దీప్, పేసర్లు సిరాజ్, షమి ఉన్నారు. ఐసీసీ టెస్టు జట్టులో భారత్ నుంచి స్పిన్ ద్వయం జడేజా, అశ్విన్‌లకు మాత్రమే చోటు దక్కింది.

ఐసీసీ వన్డే టీమ్: రోహిత్ (కెప్టెన్), గిల్, విరాట్, సిరాజ్, షమి, కుల్దీప్ (భారత్), ట్రావిస్ హెడ్, జంపా (ఆసీస్), మిచెల్ (కివీస్), క్లాసెన్, జాన్సెన్ (సౌతాఫ్రికా).

టెస్టు జట్టు: కమిన్స్ (కెప్టెన్), ఖవాజా, హెడ్, క్యారీ, స్టార్క్ (ఆసీస్), కరుణరత్నె (శ్రీలంక), విలియమ్సన్ (కివీస్), రూట్, బ్రాడ్(ఇంగ్లండ్), జడేజా, అశ్విన్ (భారత్).


ప్రాక్టీస్‌లో స్టోక్స్

చెమటోడ్చిన టీమిండియా

నెట్ ప్రాక్టీసులో శ్రేయా‌స్‌కు గాయం


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉప్పల్ స్టేడియంలో జరగనున్న తొలి టెస్టులో సత్తా చాటేందుకు భారత్-ఇంగ్లండ్ జట్లు ప్రాక్టీసు డోసును పెంచాయి. మంగళవారం ఉదయం ఇంగ్లండ్ క్రికెటర్లు నెట్ ప్రాక్టీసులో పాల్గొనగా, మధ్యాహ్నం భారత ఆటగాళ్లు ముమ్మరంగా సాధన చేశారు. బుమ్రా మినహా మిగిలిన క్రికెటర్లందరూ ప్రాక్టీసు సెషన్‌లో పాల్గొన్నారు. తొలుత ఇంగ్లండ్ క్రికెటర్లు ప్రధాన స్టేడియంలో వామప్, ఫీల్డింగ్.. తర్వాత నెట్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేశారు. మధ్యాహ్నం ప్రాక్టీసులో భారత కెప్టెన్ రోహిత్ చాలా సేపు త్రోడౌన్స్ ఎదుర్కొంటూ కనిపించాడు. జైస్వాల్, గిల్ బ్యాటింగ్ చేయగా.. వీరికి అశ్విన్, సిరాజ్, ముకేశ్, స్థానిక బౌలర్లు బంతులేశారు. ప్రాక్టీసులో భాగంగా త్రోడౌన్ స్పెషలిస్ట్ నువాన్ విసిరిన బంతి శ్రేయాస్ అయ్యర్ కుడి ముంజేతికి బలంగా తాకింది. దీంతో విలవిల్లాడిన శ్రేయాస్ కాస్త విరామం తర్వాత ప్రాక్టీస్‌కొచ్చాడు.

ఉప్పల్‌లో మోగనున్న గంట!

లార్డ్స్, ఈడెన్ గార్డెన్స్ మైదానాల్లో టెస్టు మ్యాచ్‌కు గంట మోగించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సంప్రదాయాన్ని ఉప్పల్ స్టేడియంలోనూ ప్రారంభించాలని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు నిర్ణయించారు. ఈ మేరకు స్టేడియంలోని దక్షిణం వైపున్న క్రికెటర్ల డ్రెస్సింగ్ రూమ్ ముందు గంటను ఏర్పాటు చేశారు. గురువారం భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగే తొలిటెస్టును సునీల్ గవాస్కర్ గంట మోగించి ప్రారంభిస్తాడు.

ఉత్తమ క్రికెటర్లు గిల్, దీప్తి

రవిశాస్త్రి, ఫరూక్‌కు జీవన సాఫల్యం
మేఘనకు ఉత్తమ అరంగేట్ర పురస్కారం
ఘనంగా బీసీసీఐ అవార్డుల ప్రదానం





హైదరాబాద్: నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జాతీయ, దేశవాళీ ఆటగాళ్లకు బీసీసీఐ తమ అవార్డులను ప్రకటించింది. మంగళవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో వైభవంగా జరిగిన ఈ వేడుకల్లో భారత పురుషుల జట్టుతో పాటు మహిళల జట్టు ఆటగాళ్లంతా పాల్గొన్నారు. అలాగే టెస్టు సిరీస్ కోసం ఇక్కడే ఉన్న ఇంగ్లండ్ జట్టును కూడా ఆహ్వానించారు. 2019 తర్వాత బీసీసీఐ అవార్డులను ప్రకటించడం ఇదే తొలిసారి. అందుకే 2019-20, 2020-21, 2021-22, 2022-23 ఏడాదికిగాను వివిధ విభాగాల కింద ఒకేసారి పురస్కారాలను ప్రదానం చేశారు. దీంట్లో భాగంగా 2022-23 ఏడాదికిగాను పాలీ ఉమ్రిగర్ ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్‌గా ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ఎంపికయ్యాడు. అంతకుముందు ఉత్తమ క్రికెటర్లుగా షమి (2019), అశ్విన్ (2020), బుమ్రా (2021)కు ఈ అవార్డు దక్కింది. మహిళల్లో ఉత్తమ క్రికెటర్లుగా దీప్తి శర్మ (2019-2022, 2022-23), స్మృతి మంధాన (2020-21, 2021-22) ఎంపికయ్యారు. తెలుగమ్మాయి సబ్బినేని మేఘన 2021కి గాను ఉత్తమ అరంగేట్రం అవార్డుకు ఎంపికైంది. సీకే నాయుడు జీవన సాఫల్య పురస్కారం రవిశాస్త్రి, ఫరూక్ ఇంజనీర్లను వరించింది.

ఇతర అవార్డులను ఓసారి పరిశీలిస్తే..

ఉత్తమ అరంగేట్రం
మయాంక్ అగర్వాల్ (2019), అక్షర్ పటేల్ (2020), శ్రేయాస్ (2021), జైస్వాల్ (2022). మహిళల్లో ప్రియా పూనియా (2019), షఫాలీ వర్మ (2020), సబ్బినేని మేఘన (2021), అమన్‌జోత్ (2022).

దేశవాళీల్లో ఉత్తమ ఆల్‌రౌండర్
బాబా అపరాజిత్ (2019), రిషి ధవన్ (2020, 2021), రియాన్ పరాగ్ (2021).

రంజీల్లో అత్యధిక పరుగులు
రాహుల్ దలాల్ (2019), సర్ఫరాజ్ (2021), మయాంక్ (2022).

స్పెషలిస్ట్ బ్యాటర్‌గానే రాహుల్



హైదరాబాద్: ఇంగ్లండ్‌తో జరుగబోయే ఐదు టెస్టుల సిరీస్‌లో కేఎల్ రాహుల్ వికెట్ కీపింగ్ చేయడని కోచ్ ద్రవిడ్ స్పష్టం చేశాడు. అతడు కేవలం బ్యాటర్‌గానే సేవలందిస్తాడని, టీ20 వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపాడు. దీంట్లో భాగంగానే కేఎస్ భరత్, ధ్రువ్ జురెల్‌లను అదనపు వికెట్ కీపర్లుగా ఎంపిక చేశామని గుర్తుచేశాడు. రాహుల్‌పై అధిక భారం పడకూడదు కాబట్టి ఆ ఇద్దరి నుంచి ఒకరు తుది జట్టులో కీపర్‌గా వ్యవహరిస్తారని తెలిపాడు. ఇద్దరూ చక్కటి ఫామ్‌లో ఉండడంతో ఎంపిక కష్టం కానుందన్నాడు.

పుణె, ముంబా మ్యాచ్ టై



హైదరాబాద్: ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ప్రణయ్ రాణె బోనస్ పాయింట్‌తో యు ముంబా డ్రాతో గట్టెక్కింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో మంగళవారం యు ముంబా, పుణెరి పల్టన్ మధ్య జరిగిన మ్యాచ్ 32-32తో టైగా ముగిసింది. ముంబా రైడర్ గుమాన్ సింగ్ 15 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. డిఫెండర్ గోకుల్ కన్నన్ 6 టాకిలింగ్స్ చేయడం విశేషం. పుణె తరఫున అస్లాం 8 పాయింట్లు, మోహిత్ 7 పాయింట్లు సాధించారు. లీగ్ చరిత్రలో ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్ డ్రాగా ముగియడం ఇది మూడోసారి.



సాత్విక్-చిరాగ్.. నెంబర్ వన్

మళ్లీ టాప్ ర్యాంక్ కైవసం

న్యూఢిల్లీ: గత రెండు వారాలు అంతర్జాతీయ టోర్నీల్లో అద్భుత ప్రదర్శనతో అలరించిన భారత బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ర్యాంకింగ్స్‌లో మళ్లీ అగ్రపీఠాన్ని దక్కించుకున్నారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య మంగళవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం ఓ స్థానం మెరుగుపరచుకొని నెంబర్‌వన్‌గా నిలిచింది. టాప్ ర్యాంక్ అందుకోవడం సాత్విక్ జంటకిది రెండోసారి. గతేడాది ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన తర్వాత భారత ద్వయం టాప్ ర్యాంకర్‌గా అవతరించింది. సాత్విక్ జోడీ గతవారం ఇండియా ఓపెన్, అంతకుముందు వారం మలేసియా ఓపెన్‌లలో రన్నరప్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్ 8, లక్ష్యసేన్ 19, కిడాంబి శ్రీకాంత్ 25, ప్రియాన్షు రజావత్ 30వ ర్యాంకుల్లో ఉన్నారు.

జొకో.. తగ్గేదేలె

ఆస్ట్రేలియన్ ఓపెన్

11వ సారి సెమీస్‌కు

మహిళల్లో గాఫ్, సబలెంక


సబలెంక
గాఫ్

మెల్‌బోర్న్: పురుషుల డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్ తనకచ్చొచ్చిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో దుమ్మురేపుతున్నాడు. ఈ సెర్బియా కింగ్ రికార్డుస్థాయిలో 11వ సారి మెల్‌బోర్న్‌లో సెమీఫైనల్లో ప్రవేశించాడు. మంగళవారం 3 గంటలా 45 నిమిషాల పాటు జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో టాప్‌సీడ్ జొకోవిచ్ 7-6(3), 4-6, 6-2, 6-3తో అమెరికాకు చెందిన 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్‌పై గెలుపొందాడు. ఈ వేదికపై సెమీస్ చేరిన పదిసార్లూ జొకోవిచ్ ట్రోఫీ విజేతగా నిలవడం విశేషం. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం చూస్తున్న జొకోవిచ్ ఫైనల్ బెర్త్ కోసం నాలుగో సీడ్, ఇటలీ స్టార్ జానిక్ సిన్నర్‌తో తలపడతాడు. మరో మ్యాచ్‌లో సిన్నర్ 6-4, 7-6(5), 6-3తో ఐదో సీడ్ ఆంద్రీ రుబ్లేవ్ (రష్యా)ను చిత్తుచేశాడు. కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలోనున్న అమెరికా టెన్నిస్ స్టార్ కొకొ గాఫ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అద్భుత ప్రదర్శనతో దూసుకెళుతోంది. ఈ 19 ఏళ్ల యువ కెరటం మహిళల సింగిల్స్‌లో సెమీఫైనల్ చేరింది. క్వార్టర్‌ఫైనల్లో నాలుగో సీడ్ గాఫ్ 7-6(6), 6-7(3), 6-2తో ఉక్రెయిన్ యువ సంచలనం మార్తా కొస్ట్యుక్‌ను ఓడించింది. సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అరియానా సబలెంకతో గాఫ్ అమీతుమీ తేల్చుకోనుంది. మరో క్వార్టర్స్‌లో రెండో సీడ్ సబలెంక (బెలారస్) 6-2, 6-3తో 9వ సీడ్ బార్బరా క్రెజికోవా (చెక్ రిపబ్లిక్)ను చిత్తుచేసింది.

వచ్చేనెల 23 నుంచి డబ్ల్యూపీఎల్

- షెడ్యూల్ విడుదల
- తొలి మ్యాచ్‌లో ఢిల్లీతో ముంబై ఢీ
- వేదికలుగా బెంగళూరు, ఢిల్లీ
- మార్చి 17న ఫైనల్

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో అంచెకు రంగం సిద్ధమైంది. ఐదు జట్ల లీగ్‌ను వచ్చే నెల 23 నుంచి రెండు వేదికల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు 24 రోజులపాటు సాగే డబ్ల్యూపీఎల్ షెడ్యూల్‌ను బీసీసీఐ మంగళవారం విడుదల చేసింది. బెంగళూరులో జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంప్ ముంబై ఇండియన్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనుంది. మార్చి 15న ఎలిమినేటర్, 17న ఫైనల్ జరగనున్నాయి. మొత్తం 20 లీగ్ మ్యాచ్‌ల్లో టాప్‌లో నిలిచిన టీమ్ నేరుగా ఫైనల్‌కు చేరుకోనుండగా.. రెండు, మూడు స్థానాల్లో నిలిచే జట్లు ఎలిమినేటర్‌లో తలపడతాయి. బెంగళూరు అంచెను ఫిబ్రవరి 23 నుంచి మార్చి 4 వరకు.. ఢిల్లీ అంచెను మార్చి 5 నుంచి 17 వరకు షెడ్యూల్ చేశారు. బెంగళూరు తరహాలోనే ఢిల్లీ అంచె కూడా ముంబై, క్యాపిటల్స్ మధ్య మ్యాచ్‌తోనే మొదలవనుంది. ఐపీఎల్ మాదిరే అమ్మాయిల లీగ్‌ను కూడా ఇంటా, బయటా ఫార్మాట్‌లో నిర్వహించాలని బీసీసీఐ యోచించింది. కానీ, లాజిస్టిక్ సమస్యల కారణంగా రెండు వేదికలకే పరిమితం చేసింది. తొలి సీజన్ మొత్తం ముంబైలోనే జరిగిన సంగతి తెలిసిందే.

కరాటే చాంపియన్‌కు ఆర్థిక కష్టాలు

అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సాయం కోసం అభ్యర్థన



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): గిన్నిస్ బుక్ రికార్డులు, మార్షల్ ఆర్ట్స్‌లో డాక్టరేట్లు, అంతర్జాతీయ స్థాయిలో 75కు పైగా పతకాలు..ఇన్ని సాధించినా ఇప్పటికీ అతడిని ఆర్థిక కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆదిలాబాద్‌కు చెందిన 47 ఏళ్ల పఠాన్ జమీల్ ఖాన్ మూడున్నర దశాబ్దాలుగా కరాటే, తైక్వాండో, కటాతో పాటు వివిధ మార్షల్ ఆర్ట్స్‌లో రాష్ట్రానికి, దేశానికి ప్రాతినిథ్యం వహించి 100కి పైగా పతకాలు సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన జమీల్ మార్షల్ ఆర్ట్సే ఊపిరిగా బతుకుతున్నాడు. తాజాగా ఈనెల 28వ తేదీ నుంచి ఇంగ్లండ్‌లో జరిగే అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పాల్గొనేందుకు జమీల్ అర్హత సాధించాడు. అయితే, ఆ పోటీల్లో పాల్గొనేందుకు దాదాపు రూ.2 లక్షలు ఖర్చు అవుతుంది. స్కూల్ విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తూ జీవనం సాగిస్తున్న జమీల్ ఆర్థిక స్తోమత అంతంత మాత్రమే కావడంతో ప్రభుత్వం, దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. ఎవరైనా సాయం చేస్తే, రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొస్తానని జమీల్ చెబుతున్నాడు.

రికార్డుల వీరుడు: జమీల్ 2017లో కటాలో, 2018లో కరాటేలో గిన్నిస్ రికార్డులు నెలకొల్పాడు. ఇప్పటిదాకా అంతర్జాతీయస్థాయిలో 34 స్వర్ణాలు సహా 73 పతకాలు సాధించాడు. జాతీయస్థాయిలో 29 పసిడి సహా 50కి పైగా పతకాలు గెలిచాడు. అమెరికా విశ్వవిద్యాలయాల నుంచి మార్షల్ ఆర్ట్స్‌లో 2 డాక్టరేట్లు అందుకున్నాడు.

బిజినెస్

గ్రాన్యూల్స్ లాభం రూ.126 కోట్లు

హైదరాబాద్: గ్రాన్యూల్స్ ఇండియా.. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.126 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.124 కోట్లతో పోల్చితే లాభం ఒక శాతం పెరిగింది. కాగా ఈ కాలంలో కంపెనీ ఆదాయం రూ.1,146 కోట్ల నుంచి రూ.1,156 కోట్లకు పెరిగింది. ఈ త్రైమాసికంలో తాము నిలకడ తీరును ప్రదర్శించామని.. ఇది ఎబిటా, నికర లాభంలో ప్రతిబింబించిందని గ్రాన్యూల్స్ ఇండియా సీఎండీ చిగురుపాటి కృష్ణ ప్రసాద్ తెలిపారు.

తాన్లా లాభంలో 20 శాతం వృద్ధి

తాన్లా ప్లాట్‌ఫామ్స్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.1,002.60 కోట్ల ఆదాయంపై రూ.140.10 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 15.3 శాతం, లాభం 20.3 శాతం వృద్ధి చెందింది. డిసెంబరు త్రైమాసికం ముగిసే నాటికి కంపెనీ వద్ద రూ.616. 20 కోట్ల విలువైన నగదు, నగదు సమానమైన నిల్వలున్నాయి. కాగా రూపాయి ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.6 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

- **తగ్గిన ఎన్ఏసీఎల్ లాభం**

డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్.. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.13.23 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.16 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.486.63 కోట్ల నుంచి రూ.355.63 కోట్లకు తగ్గింది.

- **పెరిగిన సైయెంట్ డీఎల్ఎం ఆదాయం**

సైయెంట్ డీఎల్ఎం.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.330.31 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.18.44 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.214.19 కోట్లుగా ఉండగా లాభం రూ.14.65 కోట్లుగా ఉంది.

4% పెరిగిన యాక్సిస్ బ్యాంక్ లాభం

ప్రైవేట్ రంగంలోని యాక్సిస్ బ్యాంక్ స్టాండ్‌ఎలోన్ లాభం డిసెంబరు త్రైమాసికంలో 4 శాతం పెరిగి రూ.6,071 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన లాభం రూ.5,853 కోట్లు. బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.26,798 కోట్ల నుంచి రూ.33,516 కోట్లకు పెరిగింది. త్రైమాసిక సమీక్షా కాలంలో వడ్డీ ఆదాయం రూ.22,226 కోట్ల నుంచి రూ.27,961 కోట్లకు పెరిగినట్లు యాక్సిస్ బ్యాంక్ పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ		విజయవాడ	558
హైదరాబాద్	540	విశాఖపట్నం	565
24 జనవరి		వరంగల్	542
చిత్తూరు	563		
గోదావరి	558	దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	92	గోదావరి	101
వరంగల్	92	విజయవాడ	101
కరీంనగర్	92	గుంటూరు	102
మహబూబ్‌నగర్	92	ఒంగోలు	102
కర్నూలు	92	చిత్తూరు	100
విశాఖపట్నం	101		



రూ.8.5 లక్షల కోట్లు ఫట్

సెన్సెక్స్ 1,053 పాయింట్లు డౌన్ ● 21,300 దిగువ స్థాయికి నిఫ్టీ

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఆర్ఐఎల్, ఎస్‌బీఐ షేర్లలో భారీగా అమ్మకాలు ● చిన్న కంపెనీల షేర్లు విలవిల

ముంబై: భారత స్టాక్ మార్కెట్ మరో భారీ పతనాన్ని చవిచూసింది. బేర్ దెబ్బకు ప్రామాణిక సూచీలన్నీ కుప్పకూలాయి. మంగళవారం ఆరంభ ట్రేడింగ్‌లో 450 పాయింట్ల వరకు లాభపడి 72,000 ఎగువకు చేరిన సెన్సెక్స్ క్రమంగా లాభాలు చేజార్చుకుంటూ రెండు గంటల్లోనే నష్టాల్లోకి మళ్లింది. ఆ తర్వాత నుంచి నష్టాలు పెరుగుతూ వచ్చాయి. చివరికి సూచీ 1,053.10 పాయింట్ల (1.47 శాతం) నష్టంతో 70,370.55 వద్దకు జారుకుంది. నిఫ్టీ కూడా 330.15 పాయింట్లు (1.53 శాతం) క్షీణించి 21,241.65 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 24 నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ల మిశ్రమ సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు మార్కెట్ దిగ్గజాలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ షేర్లలో భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు ప్రధాన కారణమైంది. నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలు కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచాయి. దాంతో మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.8.50 లక్షల కోట్లు తరిగిపోయి రూ.365.98 లక్షల కోట్లకు పడిపోయింది. రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లలో అమ్మకాలే సెన్సెక్స్, నిఫ్టీ సగం నష్టాలకు కారణమయ్యాయి. ప్రధాన కంపెనీలతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి షేర్లలో అమ్మకాలు పోటెత్తాయి. దాంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 2.95 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.79 శాతం పతనమయ్యాయి. హెల్త్‌కేర్ మినహా అన్ని రంగాల సూచీలు నేలచూపులు చూశాయి. బీఎస్ఈ రియల్టీ సూచీ ఏకంగా 5.46 శాతం క్షీణించింది. సర్వీసెస్ ఇండెక్స్ 4.06 శాతం నష్టపోయింది. మెటల్ 3.97 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 3.96 శాతం, ఎనర్జీ 3.70 శాతం, కమోడిటీస్ 3.02 శాతం తగ్గాయి.

ఫారెక్స్ మార్కెట్లోనూ డాలర్‌తో రూపాయి మారకం విలువ 8 పైసలు క్షీణించి 83.15 వద్ద ముగిసింది. ముడి చమురు ధరల పెరుగుదల, ఈక్విటీ మార్కెట్లో భారీ నష్టాలు మన కరెన్సీని బలహీనపరిచాయి. కాగా, అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురు పీపా ధర ఒకదశలో 0.60 శాతం తగ్గి 79.58 డాలర్ల వద్ద ట్రేడైంది.

మార్కెట్ పతనానికి ప్రధాన కారణాలు

◆ ఎర్ర సముద్రంలో హౌతీ మిలిటెంట్ల దాడులతో దక్షిణాసియా దేశాల వాణిజ్యంపై ప్రభావం అధికంగా ఉండవచ్చని ఫిచ్ గ్రూప్ హెచ్చరికతో అంతర్జాతీయంగా మార్కెట్ సెంటిమెంట్ ప్రతికూలంగా మారింది.

జీ షేరు 33 శాతం పతనం

సోనీతో విలీన ఒప్పందం రద్దవడంతో జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేరు ధర బీఎస్ఈలో 32.73 శాతం క్షీణించి రూ.155.90 వద్దకు పడిపోయింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.7,300 కోట్ల మేర తగ్గి రూ.14,974.50 కోట్లకు జారుకుంది. ఇంట్రాడేలో షేరు రూ.152.50 స్థాయికి పతనమై, సరికొత్త ఏడాది కనిష్ఠాన్ని కూడా నమోదు చేసుకుంది.

నోవా అగ్రిటెక్ ఐపీఓకు 9.71 రెట్ల బిడ్లు

హైదరాబాద్‌కు చెందిన నోవా అగ్రిటెక్ ఐపీఓకు భారీ స్పందన లభించింది. కంపెనీ ఆఫర్ తొలి రోజు ముగిసేసరికి.. ఇష్యూ సైజుకు 9.71 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఇష్యూలో అమ్మకానికి పెట్టిన 2.54 కోట్ల షేర్లకు గాను 24.68 కోట్ల షేర్ల కొనుగోలుకు ఇన్వెస్టర్లు బిడ్లు సమర్పించారు. సంస్థాగతేతర ఇన్వెస్టర్లకు కేటాయించిన షేర్లకు గాను 14.66 రెట్ల బిడ్లు రాగా.. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో 12.71 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదైంది.

మెడి అసిస్ట్ తొలి రోజు లాభం 11 శాతం

మెడి అసిస్ట్ హెల్త్‌కేర్ సర్వీసెస్.. మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.418తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు రూ.465 వద్ద లిస్టయింది. ఒక దశలో రూ.509.60 స్థాయికి ఎగబాకింది. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేసరికి 11.06 శాతం లాభంతో రూ.464.25 వద్ద స్థిరపడింది.

4వ అతిపెద్ద స్టాక్ మార్కెట్‌గా భారత్

మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా ప్రపంచంలోని అతిపెద్ద స్టాక్ మార్కెట్లలో తొలిసారిగా హాంకాంగ్‌ను వెనక్కి నెట్టి భారత్ 4వ స్థానానికి ఎగబాకింది. బ్లూంబర్గ్ తాజా డేటా ప్రకారం.. ఈ నెల 22 (సోమవారం) ట్రేడింగ్ ముగిసేసరికి హాంకాంగ్ స్టాక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ 4.29 లక్షల కోట్ల డాలర్లకు పరిమితం కాగా.. మన బీఎస్ఈ మార్కెట్ క్యాప్ 4.33 లక్షల కోట్ల డాలర్లుగా నమోదైంది. భారత స్టాక్ మార్కెట్ క్యాప్ 2023 డిసెంబరు 5న 4 లక్షల కోట్ల డాలర్ల మైలురాయికి చేరింది. అందులో సగం సంపద గడిచిన నాలుగేళ్లలోనే సమకూరడం గమనార్హం.


హైదరాబాద్‌లో జెహ్ ఏరోస్పేస్ తయారీ కేంద్రం

న్యూఢిల్లీ: ఏరోస్పేస్, రక్షణ ఉత్పత్తుల రంగంలోని స్టార్టప్ జెహ్ ఏరోస్పేస్ హైదరాబాద్‌లో తయారీ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించింది. ఏరోస్పేస్, రక్షణ రంగాలకు అవసరమైన ఉత్పత్తులు అందించే ఈ కేంద్రాన్ని 1.6 లక్షల చదరపు అడుగుల వరకు విస్తరించడానికి వీలుంది. జనరల్ కేటలిస్ట్ సంస్థతో పాటు ఏరోస్పేస్ పరిశ్రమ ప్రముఖులు ఎయిర్‌బస్ ఇండియా మాజీ సీఈఓ ద్వారాకానాథ్ శ్రీనివాసన్, బోయింగ్ ఇండియా మాజీ ప్రెసిడెంట్ ప్రత్యూష్ కుమార్ నుంచి 27.5 లక్షల డాలర్ల (రూ.236.5 కోట్లు) సీడ్ ఫండింగ్ అందిన నేపథ్యంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. టాటా బోయింగ్ ఏరోస్పేస్ మాజీ సీఓఓ విశాల్ ఆర్ సంఘ్వీ, టాటా సికోర్‌స్కీ ఏరోస్పేస్ లిమిటెడ్ మాజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వెంకటేశ్ ముద్రగళ్ల.. జెహ్ ఏరోస్పేస్‌ను ఏర్పాటు చేశారు.

బెంగళూరులో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ విస్తరణ

హైదరాబాద్: రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ పేరుతో కార్యకలాపాలను సాగిస్తున్న రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్ (ఆర్‌సీఎంఎల్).. బెంగళూరులో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. తాజాగా బెంగళూరులోని సర్జాపూర్ రోడ్‌లో 100 పడకల హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. బెంగళూరులో రెయిన్‌బోకు ఇది నాలుగో హాస్పిటల్ అని, కొత్త హాస్పిటల్‌తో మొత్తం పడకల సంఖ్య 452కి చేరిందని ఆర్‌సీఎంఎల్ ఎండీ రమేశ్ కంచర్ల తెలిపారు.

'ఎన్‌పీఎస్'కు పన్ను రాయితీలు!



న్యూఢిల్లీ: జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు చర్యలు ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. కంపెనీలు ప్రస్తుతం ఉద్యోగుల మూల వేతనం, గౌరవ భృతి (డీఏ) నుంచి చెల్లించే 10 శాతానికి మాత్రమే ఎన్‌పీఎస్ కింద పన్ను మినహాయింపు లభిస్తుంది. అదే ఈపీఎఫ్‌కైతే 12 శాతం వరకు మినహాయింపు లభిస్తోంది. వచ్చే మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ఈ అసమానతను సరిదిద్దుతారని భావిస్తున్నారు.

సీనియర్లకు ఊరట: ఎన్‌పీఎస్‌లో సభ్యులైన 75 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లనీ ఆర్థిక మంత్రి వచ్చే బడ్జెట్‌లో కొద్దిగా కరుణించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ముఖ్యంగా వీరికి చెల్లించే యాన్యుటీలను పూర్తిగా పన్ను చెల్లింపు నుంచి మినహించే అవకాశం ఉందని ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్ అంచనా వేసింది. ప్రస్తుతం ఎన్‌పీఎస్ నుంచి ఒకేసారి వెనక్కి తీసుకునే 60 శాతానికి మాత్రమే పన్ను మినహాయింపు ఉంది.

వీటికి తోడు కేవలం ఎన్‌పీఎస్ యాన్యుటీలపై మాత్రమే నెట్టుకొచ్చే సీనియర్ సిటిజన్లను ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్ బాదర బందీ నుంచీ మినహాయించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,050 ▲	57,800 ▲	76,500 ▼
ముంబై	62,355 ▼	57,117 ▼	70,311 ▼

ఈ ఏడాది అమ్మకాల్లో 20% వృద్ధి

● మార్కెట్లోకి అప్‌గ్రేడెడ్ క్విడ్, ట్రైబర్, కైగర్ ● రెనో ఇండియా ఎండీ వెంకట్రామ్

హైదరాబాద్: ఫ్రెంచ్ కార్ల కంపెనీ రెనో ఇండియా.. భారత మార్కెట్‌పై అత్యంత ఆశాభావంతో ఉంది. గత ఏడాది (2023)తో పోలిస్తే ఈ సంవత్సరం భారత మార్కెట్లో తమ కార్ల అమ్మకాలు 20 శాతం పెరుగుతాయని రెనో ఇండియా ఎండీ, సీఈఓ వెంకట్రామ్ మామిళ్లపల్లి తెలిపారు. కంపెనీకి చెందిన మూడు అప్‌గ్రేడెడ్ మోడల్ వాహనాలు క్విడ్, ట్రైబర్, కైగర్‌లను హైదరాబాద్ మార్కెట్లోకి విడుదల చేస్తూ ఆయన ఈ విషయం చెప్పారు. రెనో ఇండియా గత ఏడాది భారత మార్కెట్లో 49,000 కార్లను విక్రయించింది. వచ్చే మూడేళ్లలో భారత మార్కెట్లో ఐదు కొత్త మోడల్ వాహనాలను విడుదల చేయబోతున్నట్టు వెంకట్రామ్ వెల్లడించారు. కాగా అప్‌గ్రేడెడ్ రెనో క్విడ్ ధరలు రూ.4,69,500 నుంచి రూ.6,32,500, రెనో ట్రైబర్ ధరలు రూ.5,99,500 నుంచి రూ.8,74,500, రెనో కైగర్ ధరలు రూ.5,99,990 నుంచి రూ.10,99,999 మధ్యన ఉన్నాయి.

2027 నాటికి రూ.లక్ష కోట్ల ఏయూఎం లక్ష్యం

ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్

హైదరాబాద్: వచ్చే మూడేళ్ల (2027 నాటికి)లో ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.లక్ష కోట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సంస్థ అసోసియేట్ డైరెక్టర్ ఆర్‌కే ఝా వెల్లడించారు. ప్రస్తుతం ఎల్ఐసీ ఎంఎఫ్.. ఏయూఎంలు రూ.30,000 కోట్ల స్థాయిల్లో ఉన్నాయని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు కొత్త ఉత్పత్తులను తీసుకురానున్నట్లు ఆయన చెప్పారు. కాగా దేశీయ మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని ఏయూఎంలు ప్రస్తుతం రూ.50.77 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నాయని, ఇవి కూడా 2027 నాటికల్లా రూ.కోటి కోట్లకు చేరే అవకాశం ఉందన్నారు. ఈ ఏయూఎంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజియన్ వాటా రూ.1.43 లక్షల కోట్లుగా ఉందని ఝా పేర్కొన్నారు. ఇందులో హైదరాబాద్ వాటానే రూ.లక్ష కోట్ల వరకు ఉందని, పరిశ్రమ ఆస్తులపరంగా చూస్తే ఎనిమిదో పెద్ద నగరంగా ఉందన్నారు. కాగా సంస్థ కార్యకలాపాలను వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు హైదరాబాద్, సోమాజీగూడలో బుధవారం కొత్త కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు ఝా తెలిపారు.

గోల్కొండ కోట 'సౌండ్ అండ్ లైట్ షో

» నేడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో దేదీప్యమానంగా దర్శనమిచ్చేలా గోల్కొండ కోటను లెడ్ లైట్లతో ఇల్యుమినేట్ చేశారు. పర్యాటలకులను మరింత ఆకట్టుకునేలా ఆధునీకరించిన గోల్కొండ కోట సౌండ్ అండ్ లైట్ షో బుధవారం నుంచి ప్రారంభం కానుంది. గోల్కొండ కోట చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసే విధంగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సౌండ్ అండ్ లైట్ షోను కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. చారిత్రక గోల్కొండ కోట నిర్మాణాల బయటి గోడలు సాయంత్రం వేళల్లో తెలుపు రంగంలో మెరిసే విధంగా విద్యుత్ దీపాలతో ఇల్యుమినేట్ చేశారు. సుమారు లక్ష చ.అ. వైశాల్యం గల బయటి గోడలకు (ఫసాడ్ ఏరియా) వెలుగులు అందించేందుకు 1,400 ఎనర్జీ ఎఫిషియంట్ లెడ్ లైట్లు అమర్చారు. ఇక ముఖద్వారం, భద్రాద్రి హాల్‌లు త్రివర్ణ పతాకంతో వెలుగులు విరజిమ్ముతాయి.

ఖమ్మానికి ఔటర్ రింగురోడ్డు

» ఆక్రమిత ప్రభుత్వ భూములన్నీ వెనక్కి: తుమ్మల



ఖమ్మం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి ఔటర్ రింగురోడ్డు వచ్చేలా నాలుగు వైపులా జాతీయ రహదారులను ప్రతిపాదించామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం నగరానికి నాలుగువైపులా ప్రస్తుతం పనులు జరుగుతున్న ఖమ్మం నుంచి సూర్యాపేట, దేవరపల్లి, కోదాడ, కురవికి, నాగ్‌పూర్ నుంచి అమరావతి వెళ్లే రహదారులను గతంలోనే ఔటర్ రింగురోడ్డు ఏర్పాటు చేసేలా ప్రతిపాదించామని చెప్పారు. ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం పలు అంశాలపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములపై విచారణ నిర్వహించి వెనక్కి తీసుకునేలా చర్యలు చేపట్టాలనీ అధికారులను ఆదేశించారు. పూర్తయిన పనులకు సంబంధించి క్వాలిటీ కంట్రోల్ వారు పరిశీలించిన అనంతరమే బిల్లులు మంజూరు చేయాలని ఆయన సూచించారు.

మహారాష్ట్రతో మాట్లాడి 'లెండి' పూర్తి చేయాలి

» ఈ ప్రాజెక్టును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: కోదండరాం



మద్నూర్, జనవరి 23: తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్ర సర్కారుతో కలిసి లెండి ప్రాజెక్టును పూర్తిచేస్తే ఇక్కడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా మద్నూర్ శివారులో గల మహారాష్ట్రలోని లెండి ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 1985లో లెండి ప్రాజెక్టు కోసం మహారాష్ట్ర, ఉమ్మడి ఏపీ ప్రభుత్వాలు ఒప్పందం చేసుకోగా.. ఆ తర్వాత కాలంలో రెండు రాష్ట్రాల నిర్లక్ష్యంతో ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయన్నారు. తెలంగాణలో గత ప్రభుత్వం లెండి ప్రాజెక్టు గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని, ఈ ప్రాజెక్టు అంశాన్ని ఇరిగేషన్‌శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

'ధరణి' మార్పుతో సమస్యలు పరిష్కారం కావు

» తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్

హైదరాబాద్ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ పేరును భూమాతగా మార్చినంత మాత్రాన భూమి సమస్యలు పరిష్కారం కావని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారగోని ప్రవీణ్‌కుమార్ అన్నారు. పోర్టల్‌ను నిర్వహిస్తున్న విదేశీ సంస్థ కాంట్రాక్ట్‌ను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వ ఐటీ సంస్థ ఎన్ఐఎంకు ప్రాజెక్టును అప్పగించి, లోపాలను సరిదిద్దాలని సూచించారు. సమస్యలను గత ప్రభుత్వమే గుర్తించిందని, కొత్తగా గుర్తించాల్సిందేమీ లేదని చెప్పారు. ప్రస్తుతం ఐదుగురితో నియమించిన కమిటీ సభ్యులు సమర్థులే అయినా వారితో పాటుగా.. 1950 నుంచి ఇప్పటి వరకు జిల్లాల వారీగా భూ రికార్డులను అందించడానికి జిల్లాకు కనీసం ఇద్దరిని నియమించాలని ఒక ప్రకటనలో ఆయన కోరారు.

కాంగ్రెస్ పేరిట నకిలీ వెబ్‌సైట్.. నిందితుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ నేషనల్ కాంగ్రెస్(ఐఎన్‌సీ) పేరుతో నకిలీ వెబ్‌సైట్ సృష్టించి.. విరాళాల పేరుతో లక్షలు దండుకున్న సైబర్ కేటుగాడి ఆటను హైదరాబాద్ సైబర్‌క్రైమ్స్ పోలీసులు కట్టించారు. సిటీ క్రైమ్స్ జాయింట్ కమిషనర్ ఏవీ రంగనాథ్ కథనం ప్రకారం.. రాజస్థాన్ రాజధాని జైపూర్‌కు చెందిన సురేంద్ర చౌదరి 'డొనేట్‌ఐఎన్‌సీ' పేరుతో ఓ వెబ్‌సైట్‌ను సృష్టించాడు. కాంగ్రెస్ పార్టీ పేరుతో సోషల్ మీడియా ప్రచారం చేసి.. తన వెబ్‌సైట్‌ను సందర్శించేవారికి యూపీఐ, బ్యాంకు ఖాతాలు కనిపించేలా పెట్టి.. పార్టీ అభివృద్ధి కోసం తోచినంత సాయం చేయాలనే సందేశాన్ని పెట్టాడు. దీంతో.. దేశంలోని పలు ప్రాంతాల వారు నకిలీ వెబ్‌సైట్‌ను నమ్మి విరాళాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి దృష్టికి ఈ విషయం రాగా.. ఆ వెబ్‌సైట్ నకిలీదని నిర్ధారించుకుని, సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు.. సాంకేతిక ఆధారాల ద్వారా జైపూర్‌కు చెందిన సురేంద్ర చౌదరి నిందితుడని గుర్తించారు. దాంతో ఓ బృందం అక్కడికి చేరుకుని నిందితుడిని అరెస్టు చేసింది.

అయోధ్య మందిరం పేరుతో నకిలీ వెబ్‌సైట్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామ మందిరం పేరుతో సైబర్ చీటర్లు నకిలీ వెబ్‌సైట్లను సృష్టించారని, భక్తులు ఇలాంటి పోర్టళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షీకా గోయల్ హెచ్చరించారు. అయోధ్య ఆలయానికి విరాళాలు, వీఐపీ దర్శన టికెట్ల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. మరి కొన్ని సైబర్ గ్యాంగ్‌లు పాత రూ.2, రూ.5 నాణేలకు రూ.లక్షలు చెల్లిస్తామని పేర్కొంటూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి నేరాలపై బ్యూరో టోల్‌ఫ్రీ నంబర్ 1930, వాట్సాప్ నంబర్ 8712672222కు సమాచారం అందించాలని, బాధితులు ఎవరైనా ఉంటే.. కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్ www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు.

ఇప్పటికైనా అహంకారం వీడండి

» కేటీఆర్‌కు రఘునందన్‌రావు హితవు

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): "మిమ్మల్ని మీరే నాశనం చేసుకున్నరు. బావ కాళ్లు బామ్మర్ది.. బామ్మర్ది కాళ్లు బావ కాల్చుకున్నరు. మీ అహంకారమే మిమ్మల్ని ఓడించింది" అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎం. రఘునందన్‌రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని, కార్యకర్తలను గౌరవించాలని కేటీఆర్‌కు హితవు పలికారు. రేవంత్ భుజంపై తుపాకీ పెట్టి బీఆర్ఎస్‌ను కాల్చాలని బీజేపీ చూస్తోందంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. భారత జాగృతి సమితి అంటూ కవిత కొత్త ప్రచారం అందుకున్నారని, ఆమె బీఆర్ఎస్‌లోనే ఉన్నారా? ఆమెకు టికెట్ ఇస్తారా? అని కేటీఆర్‌ను రఘునందన్ ప్రశ్నించారు.

ఎంపీ రంజిత్‌రెడ్డిపై కేసు

బంజారాహిల్స్ జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఫోన్‌లో బెదిరింపు ధోరణితో మాట్లాడిన చెవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 20న విశ్వేశ్వర్‌రెడ్డికి ఎంపీ రంజిత్‌రెడ్డి ఫోన్ చేశారు. తమ పార్టీ సర్పంచ్‌తో ఎందుకు మాట్లాడుతున్నావంటూ ప్రశ్నించారు. తనను దుర్భాషలాడుతూ.. తీవ్రస్థాయిలో బెదిరించారని విశ్వేశ్వర్‌రెడ్డి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు జీడీ ఎంట్రీ చేసి న్యాయ సలహా నిమిత్తం ఫిర్యాదు కాపీనీ కోర్టుకు పంపించారు. కోర్టు సలహా వచ్చిన నేపథ్యంలో ఎంపీ రంజిత్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు.

మరో రూ.1000 కోట్ల రుణం తీసుకున్న రాష్ట్రం

రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1000 కోట్ల అప్పు తీసుకుంది. ఆర్బీఐ మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించింది. 22 ఏళ్ల కాల పరిమితి, 7.59% వార్షిక వడ్డీతో రుణాన్ని తీసుకుంది.

నకిలీ 'పోచంపల్లి'!

పోచంపల్లి ఇక్కత్ పేరిట ప్రింటింగ్ చీరలు

భూదాన్‌పోచంపల్లిలో విజిలెన్స్ తనిఖీలు

200 ప్రింటింగ్ చీరలు సీజ్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



వస్త్ర దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశం

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23: పోచంపల్లి ఇక్కత్ పేరిట విక్రయిస్తున్న 200 ప్రింటింగ్ చీరలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.30వేల విలువైన చీర రూ.1,200, రూ.7 వేల విలువైన చీర రూ.300కే విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్ పేరుతో నకిలీ పట్టు చీరలు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో తెలంగాణ ఎన్‌ఫోర్స్‌మెంట్, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని వస్త్ర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. సూరత్ తదితర ప్రాంతాల నుంచి ప్రింటింగ్, పవర్‌లూమ్ మిల్లులపై తయారైన వస్త్రాలను చేనేత వస్త్రాలుగా, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలుగా విక్రయిస్తున్న దుకాణదారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి వస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ - ఏకేఎల్‌బీ హ్యాండ్లూమ్ మార్కెట్‌లోని పలు వస్త్ర దుకాణాలను పట్టణంలోని ప్రధాన రహదారిపై గల మరికొన్ని వస్త్ర దుకాణాలపై దాడులు జరిపి నకిలీ చీరలు, ప్రింటింగ్ చీరలు, మిల్లు వస్త్రాలను సీజ్ చేశారు. పట్టణంలోని 12 దుకాణాల నుంచి సుమారు 200 ప్రింటింగ్ చీరలను స్వాధీనం చేసుకున్నారు. చేనేత రిజర్వేషన్ యాక్ట్‌ను ఉల్లంఘించడంతో పాటు పోచంపల్లి ఇక్కత్ చీరల డిజైన్లను ప్రింటింగ్ చేసిన వస్త్రాలను విక్రయించడం నేరమని వెంకటేశం చెప్పారు. చేనేత రక్షణ చట్టం సెక్షన్-6 కింద వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్-జీఐఏ (పేటెంట్ హక్కులు) కలిగిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల డిజైన్లను కొందరు బడా మిల్లు వ్యాపారులు ప్రింటింగ్ చేసి అతి చౌక ధరకు విక్రయిస్తూ తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఇటీవల భూదాన్‌పోచంపల్లి సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు చేనేత కార్మికులు విన్నవించుకున్నారు. ఇదే సమస్యపై 'పేటెంట్‌కు పోటు.. చేనేతకు చేటు' శీర్షికన ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. నకిలీ చీరల విక్రయాలను నియంత్రించాలని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెంకటేశం చెప్పారు.

అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు

భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో నెగ్గిన తీర్మానాలు

» అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు

» కొత్తగూడెంలో అవిశ్వాసానికి కలెక్టర్‌కు వినతి పత్రం

» మీర్‌పేటలోనూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపాలిటీలో అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునిసిపల్ రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. భువనగిరి జిల్లా భువనగిరి, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో మంగళవారం పెట్టిన అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. భువనగిరి మునిసిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉండగా, స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 15, కాంగ్రెస్‌కు 11, బీజేపీకి 7, ఇతరులు ఇద్దరు గెలిచారు. ప్రస్తుతం బీఆర్ఎస్ తరఫున 20, కాంగ్రెస్ నుంచి 9, బీజేపీ నుంచి ఆరుగురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అవిశ్వాస తీర్మానానికి వీరిలో 31 మంది హాజరయ్యారు. తీర్మానాన్ని బలపరుస్తూ అంతా (బీఆర్ఎస్ 16, కాంగ్రెస్ 9, బీజేపీ 6) చేతులెత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. సమావేశానికి చైర్మన్, వైస్‌చైర్మన్‌తోపాటు వారికి మద్దతుదారులైన ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వ్యక్తిగత కారణాల పేరిట తీర్మానానికి ముందే చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య తమ పదవులకు రాజీనామా చేశారు. అలాగే, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ జయబాబుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఇక్కడ మొత్తం 15 వార్డులు ఉండగా.. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, సీపీఎం నుంచి ఒకరు గెలుపొందారు. తాజా రాజకీయ పరిణామాల్లో బీఆర్ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి 10 మంది, సీపీఎం నుంచి ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మంగళవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి హాజరైన 13 మందీ చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో చైర్మన్ జయబాబుపై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల సంఘం నుంచి అనుమతి వచ్చిన అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో చైర్మన్లు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడం గమనార్హం. ఇక, కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిని తొలగించేందుకు అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని కోరుతూ 22 మంది కౌన్సిలర్లు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డా. ప్రియాంక అలాకు వినతి పత్రం అందజేశారు. అలాగే, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేటలోనూ అవిశ్వాసానికి రంగం సిద్ధమవుతోంది. 2020లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ నుంచి ముగ్గురు సభ్యులే గెలిచారు. వారిలో ఒకరు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ తరఫున 19 మంది, బీజేపీ తరఫున 16 మంది గెలిచారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముగ్గురు బీఆర్ఎస్, ఒక ఇండిపెండెంట్, మరో బీజేపీ సభ్యుడు కాంగ్రెస్‌లో చేరారు. దాంతో, ఆ పార్టీ బలం ఏడుకు చేరింది. బీజేపీకి ప్రస్తుతం 14 మంది సభ్యులు ఉన్నారు. తాజాగా, కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ప్రతిపాదిస్తున్న అవిశ్వాస తీర్మానానికి బీఆర్ఎస్‌లోని మెజారిటీ సభ్యులు కూడా అంతర్గతంగా మద్దతు తెలుపుతున్నట్టు సమాచారం. అవిశ్వాసం నెగ్గితే బీజేపీకి మేయర్, కాంగ్రెస్‌కు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని ఒప్పందం సైతం చేసుకున్నట్టు తెలిసింది.

యువకుడి చేతిలో పేలిన బాణసంచా

నేరేడుచర్లలో అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత బయట కొందరు యువకులు బాణసంచా కాల్చారు. నేరేడుచర్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త అరిగెల రవి బాణసంచా కాల్చుతుండడంతో పొరపాటున అది చేతిలో పేలడంతో కుడిచేతి వేళ్లు తెగిపోయాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.

అవిశ్వాసాలకు వ్యతిరేకంగా అప్పీళ్లు

» హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన మునిసిపల్ చైర్‌పర్సన్‌లు

» ప్రభుత్వానికి నోటీసులు జారీ



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను అడ్డుకోవాలని కోరుతూ పలు మునిసిపాలిటీల చైర్‌పర్సన్‌లు, నగరాల మేయర్‌లు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఇప్పటికే సింగిల్ జడ్జి వీరి పిటిషన్‌లను కొట్టేయడంతో ఆ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం ఈ పిటిషన్‌లను మంగళవారం విచారణకు స్వీకరిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన ప్రక్రియను అడ్డుకోవాలని కోరుతూ సదాశివపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పి. జయమ్మ, జనగాం మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, అందోల్‌జోగిపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గూడెం మల్లయ్య, ఆలేరు మునిసిపల్ చైర్‌పర్సన్ వి. శంకరయ్య, జవహర్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. పిటిషనర్‌ల తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్ రెడ్డి వాదనలు వినిపిస్తూ తెలంగాణ మునిసిపాల్టీస్ యాక్ట్ - 2019 సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మానాన్ని ఎలా ఆమోదించాలన్న విధానాన్ని పేర్కొనలేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యల ప్రస్తావన లేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియకు సంబంధించిన స్పష్టమైన రూల్స్ ఆమోదం పొందే వరకు అప్పీలుదారులపై అవిశ్వాస తీర్మానం పెట్టడం చెల్లదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపాల్టీస్ యాక్ట్ - 1965లోని సెక్షన్ 46కు విరుద్ధంగా కొత్త మునిసిపాల్టీ చట్టంలోని సెక్షన్ 37 ఉందని వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం వివరణ ఇవ్వాలని పేర్కొంటూ మునిసిపల్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ కం కమిషనర్, మునిసిపాల్టీలు ఉన్న ఆయా జిల్లాల కలెక్టర్‌లకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

ఈ నెలాఖరులోనే 'అసెంబ్లీ సమీక్షలు'

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం

గులాబి బాసును కలిసిన కేటీఆర్, హరీశ్

పార్లమెంట్ స్థానాల సమీక్షపై నివేదిక అందజేత

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షను ఈ నెలాఖరులోనే నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఈ మేరకు కేటీఆర్, హరీశ్‌రావుకు నిర్దేశించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ సమీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ సమీక్షల్లో పలువురు నేతలు, కార్యకర్తల నుంచి వచ్చిన సలహాలు, సూచనలతో కూడిన నివేదికను ఇద్దరు నేతలు కేసీఆర్‌కు అందించారు. మంగళవారం వారిద్దరూ ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలపై చర్చ జరిగింది. ఈ సమీక్షలను ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించాలని అనుకున్నా దాన్ని ఇంకొంత ముందుకు జరపాలని నిర్ణయించారు. ఈ నెలాఖరు నుంచే వాటిని ప్రారంభించాలని దానికి తగిన కార్యచరణ రూపొందించుకోవాలని కేసీఆర్ సూచించారు. ఈ సమీక్షలు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోనే జరపాలని అనుకున్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ సీనియర్ నేతలు హాజరవుతారు.

గొర్రెల స్కాం నిందితుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ

» క్వాష్ పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకం స్కాంలో నిందితునిగా ఉన్న మేడ్చల్ జిల్లా పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్య కేశవ సాయికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గొర్రెల పెంపకం పథకంలో అవినీతికి పాల్పడ్డారని, అక్రమంగా తప్పుడు ఖాతాల్లోకి నిధులను మళ్లించారంటూ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడానికి మంగళవారం హైకోర్టు నిరాకరించింది. ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, గొర్రెల ఫిట్‌నెస్ పరిశీలన, సర్టిఫికెట్‌ల జారీ వంటి తనకు కేటాయించిన విధులను మాత్రమే తాను నిర్వహించానని ఆయన తెలిపారు. నిధులకు సంబంధించిన ఏ బాధ్యతలు తనకు లేవని, అందువల్ల కేసును కొట్టివేయాలని కోరుతూ ఏ-4గా ఉన్న ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తర ఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గత ఏడాది ఆగస్టులో లావాదేవీలు జరిగితే అదే ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత కేసు పెట్టారని పేర్కొన్నారు. ఈ కేసులో ఏ-1పై కఠిన చర్యలు తీసుకోవద్దని ఇదే హైకో ర్టు ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో తనకు సైతం అవే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఏసీబీ తరఫున న్యాయవాది విద్యాసాగర్ రావు వాదనలు వినిపిస్తూ.. గొర్రెల ట్యాగింగ్, లోడింగ్, ఫొటోగ్రఫీ, పోర్టల్‌లో వివరాల నమోదు వంటి విధులకు పిటిషనర్ బాధ్యుడని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సోమవారం సాయంత్రమే ఈ కేసును ఏసీబీకి అప్పగించినట్టు ప్రభుత్వం పేర్కొందని, ఈ దశలో జోక్యం చేసుకోవడం భావ్యం కాదని పేర్కొంటూ క్వాష్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్టు ప్రకటించింది.

కాంగ్రెస్‌లో పోటాపోటీ!

లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కసరత్తు ముమ్మరం.. నెలాఖరులో పీఈసీ భేటీ.. 2, 3 పేర్లు కేంద్రానికి

» ఖమ్మం నుంచి అయితే సోనియా.. లేకుంటే నువ్వా.. నేనా?

» రేసులో రేణుకా చౌదరి, పొంగులేటి సోదరుడు, ఇతరులూ

» నల్లగొండ, భువనగిరిల్లో ముగ్గురు నేతల ప్రయత్నాలు

» మల్కాజిగిరి సీటుపై కుసుమ్, మైనంపల్లి, ఇతరులూ ఆశ

» నిజామాబాద్‌లో దిల్ రాజు?

» వరంగల్‌లో అద్దంకి దయాకర్?

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో కనీసం 12 సీట్లు గెలుచుకోవాలన్న లక్ష్యంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఆ దిశగా దీటైన అభ్యర్థుల ఎంపికపై కసరత్తును ముమ్మరం చేసింది. సామాజిక సమీకరణలు, గెలుపు అవకాశాలు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని పార్టీ ముఖ్య నాయకులు ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. నెలాఖరులో జరిగే ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) సమావేశంలో చర్చించి.. నియోజకవర్గానికి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీకి పంపనున్నట్లు చెబుతున్నారు. వీటిలో ఖమ్మం స్థానానికి పోటీ తీవ్రంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలంటూ ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని కోరుతూ టీపీసీసీ ఇప్పటికే తీర్మానాన్ని ఆమోదించి పంపిన సంగతి తెలిసిందే. ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలా.. వద్దా అన్న సందిగ్ధంలో సోనియా ఉన్నట్లు చెబుతున్నారు. పోటీకి ఆమె అంగీకరిస్తే ఖమ్మం నుంచే పోటీ చేయించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చింది. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని ఆమె నిర్ణయించుకుంటే ఇక్కడ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఖమ్మం టికెట్ తనకే దక్కుతుందన్న ధీమాతో కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ఉన్నారు. మరోవైపు, తన సోదరుడు ప్రసాద్‌రెడ్డికి ఖమ్మం టికెట్ ఇప్పించుకునేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వర్‌రావు, పాలేరు నియోజకవర్గ నేత రాయల నాగేశ్వర్‌రావు తదితరులూ తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక, అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట టికెట్ దక్కని పటేల్ రమేశ్ రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ టికెట్ హామీ ఇచ్చారు. ఇక్కడి నుంచి పోటీకి తాను సిద్ధమని మాజీ మంత్రి జానారెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఆయనకు నల్లగొండ టికెట్ ఇస్తే.. రమేశ్ రెడ్డిని భువనగిరి నుంచి పోటీ చేయించే అవకాశం ఉన్న ట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కానీ, భువనగిరి టికెట్‌పైనే ఆశలు పెట్టుకుని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి కొద్ది నెలలుగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండ, భువనగిరి సీట్లు ఎట్లా సర్దుబాటు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మల్కాజిగిరి నుంచి టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరిద్దరూ కాకుండా అనూహ్యంగా కొత్త పేర్లు కూడా తెరపైకి వచ్చే అవకాశం ఉంది. దావోస్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లే ముందు సదరు నేతలు ఆయన్ను కలిసి మల్కాజిగిరి సీటును తమకు కేటాయించాలంటూ కోరారు. ఆ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న తుమ్మల నాగేశ్వర్‌రావునూ వారు కలిసి అభ్యర్థించారు. హైదరాబాద్ నుంచి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత ఫిరోజ్ ఖాన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, ప్రముఖ ఫార్మా కంపెనీ అధినేత ఒకరి పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. నిజామాబాద్ నుంచి ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు పేరు ప్రధానంగా పరిశీలిస్తున్నారు. జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్, మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబాబాద్ సీటును లంబాడాలకు కేటాయిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ సీటును ఆదివాసీ నేతకు కేటాయించే అవకాశం ఉంది. ఇక, ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలకు సంబంధించి నాగర్‌కర్నూల్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, వరంగల్ నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, పెద్దపల్లి నుంచి గడ్డం వివేక్ కుమారుడు వంశీ పేర్లు ప్రధానంగా పరిశీలిస్తున్నారు.

రేపు బూత్ లెవల్ ఏజెంట్లతో ఖర్గే సమావేశం

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న కాంగ్రెస్.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించిన బూత్ లెవల్ ఏజెంట్లతో గురువారం ఎల్బీ స్టేడియంలో సమావేశం నిర్వహిస్తోంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం జరగనుంది. దీనికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, పార్టీ ముఖ్య నేతలూ పాల్గొననున్న ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశానికి తరలి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వారికి పిలుపునిచ్చారు.

తెలంగాణలోనే రిచెస్ట్.. రంగారెడ్డి జిల్లా

2,3 స్థానాల్లో హైదరాబాద్, సంగారెడ్డి

తలసరి ఆదాయం ఆధారంగా గుర్తింపు

తెలంగాణ ఎకానమీ -2023 నివేదిక

హైదరాబాద్, జనవరి 23 : రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాగా రంగారెడ్డి జిల్లా నిలిచింది. తెలంగాణ ఎకానమీ-2023 పేరిట రాష్ట్ర ప్రణాళికా విభాగం ఓ నివేదిక విడుదల చేసింది. ఇందులో తలసరి ఆదాయం ప్రకారం రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాల జాబితాను పేర్కొంది. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాల జాబితాలో రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు వరుసగా ఆ తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి.

తెలంగాణ ఎకానమీ-2023 ప్రకారం రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ.8,15,996. రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ. 4,03,214. మూడో స్థానంలో నిలిచిన సంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ. 3,08,166గా ఉంది. ఈ గణాంకాల ప్రకారం హైదరాబాద్ వాసుల కంటే రంగారెడ్డి జిల్లా వాసులే ఎక్కువ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఐటీ హబ్ కారణంగానే రంగారెడ్డి రిచెస్ట్ జిల్లాగా మారిందని నిపుణులు చెబుతున్నారు. స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడిడిపి) పరంగా కూడా తెలంగాణలోని జిల్లాల జాబితాలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. జిల్లా తలసరి ఆదాయం ఆ ప్రాంతంలోని వ్యక్తుల సంవత్సర సగటు ఆదాయాన్ని తెలియజేస్తోంది. ఇక, తలసరి ఆదాయం ఆధారంగా దేశంలో టాప్-10 ధనిక రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఈ జాబితాలో సిక్కిం మొదటి స్థానంలో ఉండగా.. గోవా రాష్ట్రం రెండో స్థానంలో ఉంది.

భువనగిరి కలెక్టరేట్‌కు రావి నారాయణరెడ్డి పేరు

» పెట్టాలని కోరిన కుటుంబసభ్యులు

» సానుకూలంగా స్పందించిన మంత్రులు

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, నల్లగొండ తొలి ఎంపీ రావి నారాయణరెడ్డి త్యాగాలు, పోరాటాలు మరువలేనివని మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సచివాలయంలో రావి నారాయణ రెడ్డి మనుమరాలు రావి ప్రతిభారెడ్డి, కుటుంబసభ్యులు మంత్రులను మంగళవారం కలిశారు. భువనగిరి కలెక్టరేట్ కార్యాలయానికి రావి నారాయణ రెడ్డి పేరు పెట్టాలని, ప్రతి ఏటా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని కోరారు. భువనగిరి, హైదరాబాద్‌లలో రావి విగ్రహాలను నెలకొల్పాలని కోరారు. వారి విజ్ఞప్తిపై మంత్రులిద్దరూ సానుకూలంగా స్పందించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రితో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

ప్రజా అనుకూల మేనిఫెస్టోను రూపొందిస్తున్నాం

» ఏఐసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ప్రవీణ్ చక్రవర్తి

» ఎన్నికల హామీలను నెరవేరుస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు అనుకూలంగా రూపొందిస్తున్నామని ఏఐసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ప్రవీణ్ చక్రవర్తి వెల్లడించారు. మంగళవారం గాంధీభవన్‌లో మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని టీపీసీసీ మేనిఫెస్టో కమిటీతో ప్రవీణ్ చక్రవర్తి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ చక్రవర్తి మాట్లాడుతూ, తాము ప్రతి రాష్ట్రానికి వెళ్లి, ప్రజలు, నిపుణుల నుంచి సూచనలు తీసుకుంటున్నామని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, తెలంగాణ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి తీరుతామని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

స్పెయిన్ పర్యటనకు మంత్రి జూపల్లి

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ టూరిజం ట్రేడ్ ఫేయిర్(ఎఫ్ఐటీయుఆర్)లో పాల్గొనేందుకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులతో కలిసి మంగళవారం స్పెయిన్‌కు బయలుదేరి వెళ్లారు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో ఈనెల 24 నుంచి 28 వరకు జరగనున్న ఎఫ్ఐటీయుఆర్‌లో తెలంగాణ తరఫున మంత్రి జూపల్లి పాల్గొననున్నారు. పర్యాటకులను ఆకట్టుకునేందుకు రాష్ట్రంలోని ఆయా పర్యాటక కేంద్రాల ప్రాధాన్యత, ప్రాశస్త్యం, వైభవవారసత్వ చారిత్రక నిర్మాణాలపై ఫెయిర్‌లో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు.

'ధరణి'పై ఐదు జిల్లాల కలెక్టర్లతో నేడు కమిటీ భేటీ

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ధరణిలోని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తన పనిని వేగవంతం చేసింది. సిద్దిపేట, వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లతో బుధవారం సమావేశం కానుంది. ఉదయం పదిన్నర గంటలకు సచివాలయంలో జరిగే భేటీలో ధరణికి సంబంధించిన కీలక అంశాలపై కమిటీ చర్చించనుంది. ముఖ్యంగా ఏడు అంశాలపై దృష్టి సారించనుంది. పలు అంశాలపై నివేదికలతో కలెక్టర్లు ఈ సమావేశానికి రావాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ ఆదేశాలు జారీ చేశారు.

రోడ్ సేఫ్టీ క్లబ్‌లను ఏర్పాటు చేయండి: డీజీపీ

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్ సేఫ్టీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని కమిషనర్లు, ఎస్పీలకు డీజీపీ రవి గుప్తా సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు రోడ్డు భద్రత మాసంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రోడ్డు భద్రతా విభాగం ఆధ్వర్యంలో.. కమిషనర్లు, ఎస్పీలతో డీజీపీ తన కార్యాలయం నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడే వారికి 'గుడ్ సమారిటన్' పేరుతో సన్మానాలు చేయాలని అధికారులకు సూచించారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల రద్దు

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ)లను రద్దు చేస్తూ పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ సర్క్యులర్ జారీ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఎంసీల పదవీకాలం గతేడాది డిసెంబరు 31తో ముగిసింది. దాంతో కొత్త ఎస్ఎంసీలను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఇటీవల షెడ్యూల్‌ను జారీ చేశారు. కొత్త కమిటీల నియామకానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఎస్‌సీఈఆర్‌టీలో డిప్యూటేషన్ల రద్దు

స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ)లో డిప్యూటేషన్లను రద్దు చేస్తూ మంగళవారం విద్యా శాఖ కార్యదర్శి వెంకటేశం ఆదేశాలను జారీ చేశారు. రెండేళ్లకు మించి డిప్యూటేషన్లపై ఉన్న వారి డిప్యూటేషన్లను రద్దు చేయాలని వెంకటేశం తాజాగా ఆదేశించారు. దీనిపై ఫిబ్రవరి 1లోపు నివేదిక అందించాలని అధికారులకు సూచించారు.

అనర్హులకు వైద్య శిక్షణనిస్తే చర్యలు: ఎస్ఎంసీ

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అర్హత లేని వ్యక్తులకు వైద్యచికిత్స శిక్షణ ఇచ్చే వారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర వైద్యమండలి హెచ్చరించింది. ఆర్ఎంపీ, పీఎంపీలకు ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ ఇస్తామని వాట్సప్, పత్రికా ప్రకటనలను హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల మల్లిస్ ఆస్పత్రి ఇస్తున్నట్లు స్టేట్ మెడికల్ కౌన్సిల్ దృష్టికి వచ్చింది. దీంతో ఆ హాస్పిటల్‌కు రాష్ట్ర వైద్యమండలి మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

బీఆర్ఎస్‌ను వీడను

» నల్లగొండ ఎంపీ టికెట్‌ను మా అబ్బాయికి అడిగా: గుత్తా

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌ను వీడతానంటూ తన గురించి వస్తున్న ఊహాగానాల్లో వాస్తవం లేదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో ఆయన మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకత్వంపై తాను అలకబూనినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని, మండలి చైర్మన్ హోదాలో ఉన్నందునే నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశానికి హాజరు కాలేదని చెప్పారు. నల్లగొండలో తన కుమారుడు అమిత్‌కు అవకాశం ఇవ్వాలని పార్టీ పెద్దలను కోరానని, కేటీఆర్, హరీశ్‌తోనూ అభిప్రాయం పంచుకున్నానని వివరించారు. ఈ విషయమై మూడు రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో విభేదాలు లేవన్నారు. సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు కృష్ణా బోర్డు పరిధిలోకి వెళ్లడం రాష్ట్రానికి గొడ్డలి పెట్టు అని.. భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. 16 ఏళ్లలో తొలిసారిగా సాగర్ ఖాళీ అయిందని గుత్తా పేర్కొన్నారు.

అయోధ్య రామయ్యకు కంచి కామకోటి పీఠం ఆభరణాలు

హైదరాబాద్, జనవరి 23 : అయోధ్యలో కొలువుదీరిన శ్రీరాముడికి కంచి కామకోటి పీఠం నుంచి ప్రత్యేక ఆభరణాలు అందాయి. అయోధ్య రామ మందిరాన్ని ఆదివారం సందర్శించిన కంచి కామకోటి మూలామ్నాయ సర్వజ్ఞ పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఈ ఆభరణాలను స్వయంగా స్వామివారికి సమర్పించారు. గర్భాలయంలోకి వెళ్లి శ్రీరాముడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి పీఠం ఆధ్వర్యంలో తయారు చేయించిన ప్రత్యేక ఆభరణాలను సమర్పించారు.

హిమంత అసలు ముఖ్యమంత్రేనా ? : వీహెచ్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని రావణుడితో పోల్చిన అసోం సీఎం హిమంత బిశ్వ శర్మపై కాంగ్రెస్ సీనియర్ నేత వీ.హన్మంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు హిమంత ముఖ్యమంత్రేనా..? అంటూ మండిపడ్డారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీపై అసోం సీఎం చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని వీహెచ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీని పట్టుకుని రాముడని మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు.

గాంధీభవన్‌లో నేతాజీకి ఘన నివాళి

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు కాంగ్రెస్ నేతలు గాంధీభవన్‌లో మంగళవారం నివాళి అర్పించారు. నేతాజీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నమస్కరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, పార్టీ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలతో సీఎం రేవంత్ రెడ్డి

నూతన ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్సీలను అభినందించిన సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఇటీవల కొత్తగా నియమించిన ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్సీలుగా ఎన్నికైన వారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, హర్కార వేణుగోపాల్‌రావు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియామకమైన మల్లు రవితో పాటు ఎమ్మెల్సీలుగా ఎన్నికైన బల్మూరి వెంకట్, మహేష్‌కుమార్ గౌడ్ ఆయన్ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దావోస్ పర్యటనలో రాష్ట్రానికి రూ.40 వేల కోట్లకు పైగా పెట్టుబడుల కోసం ఒప్పందాలు చేసుకోవడంపై రేవంత్‌రెడ్డికి వారంతా అభినందనలు తెలిపారు.

5 వేల కోట్ల పెట్టుబడులు!

దేశంలోనే తొలి కాస్మెటిక్ హబ్.. హైదరాబాద్‌లో ఏర్పాటు.. దక్షిణ కొరియా కంపెనీ దూసన్ ప్రకటన

» మంత్రి కోమటిరెడ్డితో కంపెనీ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కొరియాకు చెందిన ప్రఖ్యాత కాస్మెటిక్ తయారీ సంస్థ దూసన్ హైదరాబాద్‌లో రూ.5 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. దేశంలోనే తొలి కాస్మెటిక్ తయారీ హబ్‌ను ఏర్పాటు చేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. దూసన్ కంపెనీ ప్రతినిధి మూన్ కీ జూ నేతృత్వంలోని బృందం మంగళవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో సచివాలయంలో సమావేశమైంది. తమ సంస్థ పెట్టుబడుల గురించి ప్రభుత్వానికి డీపీఆర్ అందించారు. తాము కల్పించే ఉద్యోగాలు, పెట్టుబడుల ద్వారా స్థానికులకు కలిగే ప్రయోజనాల గురించి మంత్రికి వివరించారు. తమ సంస్థ చైనా, వియత్నాం, కాంబోడియా తదితర దేశాల్లో 460 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టిందని, తమ ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో నెలకొల్పబోయే కాస్మెటిక్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ భారతదేశంలోనే మొదటిదని మంత్రికి చెప్పారు. తమ సంస్థ ఏర్పాటుకు కావాల్సిన అనుమతులు, భూమి, రాయితీల గురించి దూసన్ ప్రతినిధులు మంత్రితో చర్చలు జరిపారు.



సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసిన కొరియా కంపెనీ ప్రతినిధులు

రైతుల నుంచి ఉత్పత్తుల కొనుగోలు..

ఈ పెట్టుబడుల ద్వారా తెలంగాణకు వచ్చే ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాల గురించి మంత్రి కోమటిరెడ్డి.. దూసన్ ప్రతినిధులను ఆరా తీశారు. కంపెనీ ప్రతినిధి మూన్ కీ జూ మాట్లాడుతూ.. తమ సంస్థ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోయే కాస్మెటిక్ హబ్ ద్వారా దాదాపు రూ.5 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రత్యక్షంగా దాదాపు 3 వేల మందికి, పరోక్షంగా మరో 4 వేల మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. సుగంధ ద్రవ్యాలు, ఔషధ మొక్కలను ఉత్పత్తి చేసే రైతుల నుంచే నేరుగా కొనుగోళ్లు చేస్తామని తద్వారా వారికి మరింత లబ్ధి చేకూరుతుందని మంత్రికి తెలిపారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన వాటిని స్థానికంగా విక్రయించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఎగుమతులూ చేస్తామని వివరించారు.

కంపెనీకి పూర్తి సహకారం..

సులభతర వాణిజ్య విధానాల్లో తెలంగాణ దేశంలోనే నంబర్ 1గా ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. పరిశ్రమలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని పారిశ్రామిక వాతావరణం, ఇండస్ట్రియల్ పాలసీ.. ఇతర దేశాలు, వ్యాపార సంస్థలకు స్వర్గధామంగా ఉన్నాయని దూసన్ ప్రతినిధులకు వివరించారు. కంపెనీకి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో సమావేశం ఏర్పాటు చేసి కంపెనీ ఏర్పాటుకు కావాల్సిన అనుమతులు సత్వరమే ఇస్తామని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.

ఫిబ్రవరి నుంచే ఉచిత విద్యుత్

గృహజ్యోతి పథకం కింద ఇచ్చిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని ఫిబ్రవరి నుంచి అమలు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ నిర్వాకం వల్ల రాష్ట్రం అప్పుల పాలైందని, అందుకే ఆరు గ్యారంటీల్లోని కొన్ని హామీల అమలులో జాప్యం ఏర్పడిందన్నారు. ఈ మేరకు గాంధీభవన్ ఆవరణలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇచ్చిన హామీలన్నింటినీ వంద రోజుల్లో అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు సహా ఇచ్చిన ఏ హామీని బీఆర్ఎస్ అమలు చేయలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతల్లా తాము ప్రజలను నాడు రెచ్చగొట్టి ఉంటే కేసీఆర్ ఫామ్‌హౌస్ దాటలేకపోయేవారని అన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు చివరకు సర్పంచ్‌లను కొనుగోలు చేసే దరిద్రపు అలవాటు బీఆర్ఎస్‌కు ఉందని తెలిపారు. తాము అదే విధానాన్ని పాటిస్తే బీఆర్ఎస్‌లో కేటీఆర్, హరీశ్‌రావు తప్ప ఎవరూ మిగలరని పేర్కొన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఒక్క సీటూ రాదని తేల్చిచెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పార్టీకి 13 నుంచి 14 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. మాజీ మంత్రి జైలుకు పోవడం ఖాయమని పునరుద్ఘాటించారు. కాళేశ్వరంతో పాటు అన్ని అక్రమాలపైనా విచారణ కొనసాగుతుందని తెలిపారు.



ఆదాయ మార్గాలను అన్వేషించండి

» ఆర్టీసీ ఖర్చులను తగ్గించే ప్రయత్నం చేయండి

» ఆలయ పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలి

» అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు తరహాలో ఆదాయం వచ్చే మార్గాలను పరిశీలించాలని ఆర్టీసీ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. సంస్థ ఖర్చులను తగ్గించుకోవడానికి ప్రయత్నించాలని చెప్పారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై మంగళవారం ఆ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. అదనపు ఆదాయ మార్గాలను అన్వేషించాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం(2024-25) బడ్జెట్‌లో కనీసం రూ.5,500 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి ఆర్టీసీ ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిసింది. కొత్త బస్సుల కొనుగోళ్లకు రూ.వెయ్యి కోట్లు, ఉద్యోగుల బకాయిల చెల్లింపులకు రూ.1,500 కోట్లు అవసరమని విన్నవించినట్లు తెలిసింది. బీసీ గురుకులాలకు సొంత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని పొన్నం కోరారు.

దేవాదాయ, అటవీ శాఖలపై సమీక్ష..

రాష్ట్రంలో ఆలయ పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. దేవాలయ భూముల్లో భక్తుల కోసం కాటేజీలు నిర్మించాలని చెప్పారు. దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై మంగళవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. ప్రముఖ దేవాలయాలు, ప్రార్థనాలయాలు ఉన్న రాష్ట్రంలో టెంపుల్ టూరిజం అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల్లో సఫారీ, ఎకో టూరిజానికి ఆదరణ ఉందని, ఇలాంటి పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. దేవాదాయ, అటవీ శాఖలకు ఈ బడ్జెట్‌లో నిధులను ఎక్కువగా కేటాయించాలని కొండా సురేఖ విజ్ఞప్తి చేశారు.

పొన్నం, జూపల్లికి సన్మానం..

ఆరాంఘర్‌లోని దుర్గా కన్వెన్షన్‌లో గౌడ సామాజిక వర్గం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలను హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి గౌడ సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నేత వినోభాగౌడ్ తదితరులుపాల్గొన్నారు.

ఎన్నికలకు ముందస్తు షెడ్యూలు?

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటిస్తారన్న దానిపై రాజకీయ పార్టీలు, అధికార వర్గాల మధ్య ఢిల్లీలో విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. క్రితంసారి ఎన్నికలు 2019 ఏప్రిల్ 19న ప్రారంభమై.. మే 19 వరకు ఏడు దశల్లో జరిగాయి. ఆ ఎన్నికలకు షెడ్యూలును 2019 మార్చి 10న ప్రకటించారు. ఈసారి ఇంకా ముందే ఎన్నికలు జరుగుతాయన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

27 నుంచి పూర్తి స్థాయిలో మోదీ దృష్టి..

ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం తరువాత 27 నుంచి ప్రధాని మోదీ రాజకీయాలపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరిస్తారని భావిస్తున్నారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 9 వరకు జరిగే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ మధ్యంతర బడ్జెట్‌లో మహిళలకు కిసాన్ సమ్మాన్ నిధి రెట్టింపు చేయడం వంటి అనేక కీలక ప్రకటనలు మోదీ ప్రభుత్వం చేయనుంది. బడ్జెట్ సమావేశాలు పూర్తయిన వెంటనే ఏ క్షణంలోనైనా మోదీ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలకు వెళ్లవచ్చునని అంటున్నారు. ప్రజల్లో రామమందిర ప్రాణ ప్రతిష్ఠ ఊపు తగ్గక ముందే ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌లో కూడా.. ఇటీవల జరిగిన ఒక అంతర్గత సమావేశంలో రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయయాత్ర పూర్తి కాకముందే, ఇండియా కూటమి సీట్లపై పొత్తులు పూర్తి కాకముందే ఎన్నికల షెడ్యూలు ప్రకటిస్తే ఎలా అన్న అంశంపై విస్తృతంగా చర్చలు జరిగాయి.

సీబీఎస్ఈ పరీక్షలు ముగిశాకే..!

దేశంలో 10వ తరగతి, 12వ తరగతి పరీక్షలు పూర్తికాకముందే ఎన్నికల షెడ్యూలు ప్రకటించే అవకాశాలు లేవని కూడా అంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్ర పరీక్షలు ఫిబ్రవరిలోనే పూర్తి కానున్నాయి. దేశవ్యాప్తంగా సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి మార్చి 13 వరకు, సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 2 వరకూ జరుగుతాయి. ఈ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశాలున్నాయంటున్నారు. అయితే 2019లో జరిగినట్లు కాకుండా ముందుగానే ఎన్నికల షెడ్యూలు ప్రకటించే అవకాశాలున్నాయని, ఏప్రిల్‌లోనే ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తయ్యేలా సన్నాహాలు జరుగుతున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అదే జరిగితే.. ఫిబ్రవరి చివర్లోగానీ, మార్చి మొదటి వారంలోగానీ ఎన్నికల షెడ్యూలు విడుదల కావచ్చని ఒక వర్గం భావిస్తోంది. గతంలో జరిగినట్లు ఏడు దశల్లో కాకుండా ఐదు దశల్లోనే ఎన్నికలను పూర్తి చేసే అవకాశాలు లేకపోలేదని ఒక అధికారి చెప్పారు. ప్రధాని మోదీ మాత్రం సాధ్యమైనంత త్వరగా సార్వత్రిక ఎన్నికల తతంగాన్ని ముగించాల్సిందిగా ఆదేశించారని, ఫిబ్రవరి, మార్చి మొత్తం ఆయన దేశవ్యాప్తంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, బీజేపీ ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో లోక్‌సభ అభ్యర్థుల ఎంపికకు సర్వేలు పూర్తి చేసిందని, ఫిబ్రవరిలోనే మొత్తం అభ్యర్థుల జాబితాను ప్రకటించి ఉధృత ప్రచారం నిర్వహిస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

బడ్జెట్ సమావేశాలు 14 నుంచి!

(మొదటి పేజీ తరువాయి)

కోరుకుంటోంది. బడ్జెట్ పద్దులు, డిమాండ్లపైనా కూలంకషంగా చర్చ జరగనివ్వాలని భావిస్తోంది. ఈసారి అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ బలంగా ఉన్నాయి. ఎంఐఎంకు ఎప్పటిలాగే ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ.. ఎనిమిది మంది ఎమ్మెల్యేలతో బీజేపీ రెండో ప్రతిపక్షంగా ఉంది. ఈ దృష్ట్యా బీఆర్ఎస్, బీజేపీ నుంచి ఎక్కువ మంది ఎమ్మెల్యేలు బడ్జెట్‌పై మాట్లాడే అవకాశం ఉంది. వీరితోపాటు అధికార కాంగ్రెస్ సభ్యులు, ఎంఐఎం సభ్యులు, సీపీఐ సభ్యుడు మాట్లాడతారు. దీంతో ఎక్కువ రోజులు సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే.. పార్లమెంటు ఎన్నికల షెడ్యూలు ఫిబ్రవరిలోనే విడుదలయ్యే అవకాశం ఉందన్న వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే.. ఎన్నికల సన్నద్ధత దృష్ట్యా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను తక్కువ పనిదినాల్లోనే ముగించాల్సిన అవసరం ప్రభుత్వానికి ఏర్పడుతుంది. అప్పుడు ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌ను పెట్టే అవకాశాలూ లేకపోలేదు.

వాస్తవ రాబడుల ఆధారంగా బడ్జెట్..

ఈసారి బడ్జెట్ వాస్తవాల ఆధారంగా ఉండనుంది. అనవసరంగా వ్యయాలను పెంచి, భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టకుండా.. వాస్తవ రాబడులను పక్కాగా అంచనా వేసి బడ్జెట్‌ను పెట్టనుంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ రాబడుల శాఖలను కూడా పక్కాగా అంచనా వేయాలని చెప్పారు. రాష్ట్ర రాబడులు ఎంతమేర సమకూరుతాయి, కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్లు, ప్రత్యేక గ్రాంట్లు, కేంద్ర సౌజన్య పథకాల్లో కాంట్రిబ్యూషన్లు ఏ మేరకు వస్తాయి, కేంద్ర ప్రభుత్వం అనుమతించిన మేర అప్పులు, రాష్ట్ర పన్నేతర రాబడులు వంటి అన్ని రకాల వనరులను అంచనా వేసి, బడ్జెట్‌ను రూపొందించాలని సూచించారు. ఆ దిశగానే బడ్జెట్ కసరత్తు సాగుతోంది. రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్క కూడా వివిధ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆయా శాఖలు, పథకాలవారీగా ప్రతిపాదనలు పక్కాగా ఉండాలని చెబుతున్నారు. ఇలాంటి జాగ్రత్తల నేపథ్యంలో ఈసారి బడ్జెట్ వాస్తవాల ఆధారంగా ఉంటుందని భావిస్తున్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో పెద్దపీట

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో పెద్దపీట వేయనున్నారు. ఈ పథకాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతి నెలా రూ.2,500 చొప్పున భృతి, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు భరోసా కింద రైతులకు ప్రతి ఏటా ఎకరానికి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం, రైతు కూలీలకు రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం, వరి పంటకు రూ.500 బోనస్, గృహజ్యోతి కింద వినియోగదారులకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం, అమరుల కుటుంబాలకు 250 చదరపు గజాల చొప్పున ఇంటి జాగా, యువ వికాసం కింద విద్యార్థులకు రూ.5 లక్షల విలువ చేసే విద్యా భరోసా కార్డులు, ప్రతి మండలంలో ప్రభుత్వ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు, చేయూత కింద ప్రస్తుత ఆసరా పెన్షన్లను రూ.4 వేలకు పెంపు, ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్ర చికిత్సల వ్యయ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు వంటి ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ కింద వ్యయ పరిమితి రూ.10 లక్షలకు పెంపు వంటి కార్యక్రమాలను ఇప్పటికే ప్రారంభించింది. మిగతా వాటిని వంద రోజుల్లో అమలు చేసి తీరుతామని ప్రకటించింది. ఈ దృష్ట్యా వీటికి తాజా బడ్జెట్‌లో నిధులను కేటాయించనుంది.

మరోసారి చర్చకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

ఇప్పటికే రాష్ట్ర అప్పులపై ప్రభుత్వం కొంత ఆందోళనతో ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డగోలుగా అప్పులు చేసి, రాష్ట్రాన్ని పూర్తిగా దివాళా తీయించిందని ఆరోపిస్తోంది. ఆ ప్రభుత్వం చేసిన అప్పులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై గత డిసెంబరులో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. విద్యుత్తుపైనా శ్వేతపత్రం విడుదల చేసి చర్చ చేపట్టింది. ఈ రెండు శ్వేతపత్రాలు తీవ్ర సంచలనం రేపాయి. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చిన విధానం, విద్యుత్తు రంగాన్ని నిర్వీర్యం చేసిన పద్ధతిని సీఎంతో సహా మంత్రులు తూర్పారపట్టారు. ఫిబ్రవరిలో నిర్వహించే బడ్జెట్ సమావేశాల్లోనూ బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకాన్ని మరోసారి ఎండగట్టడానికి సిద్ధమవుతున్నారు.

రేవంత్‌ను కలిసిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి (నర్సాపూర్); కొత్త ప్రభాకర్ రెడ్డి (దుబ్బాక); గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు); మాణిక్ రావు (జహీరాబాద్) మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. సీఎం నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌ను వంద మీటర్ల లోతున పాతిపెడతామని లండన్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం; 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని, తామే చేర్చుకోవడానికి సిద్ధంగా లేమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించిన వెన్వెంటనే నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎంలు కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. వారు పార్టీ మారుతున్నారంటూ పార్టీ వర్గాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. వీరిలో కొందరికి గతంలో కాంగ్రెస్‌తో అనుబంధం ఉండడం ఇందుకు బలం చేకూర్చింది. అయితే, తాము మర్యాదపూర్వకంగానే కలిశామని, ఇందులో రాజకీయ పరమైన అంశాలేవీ లేవని వారు చెబుతున్నారు. నియోజకవర్గాల అభివృద్ధి, ఎమ్మెల్యేల సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలు వంటి అంశాలపై చర్చించామని వివరణ ఇచ్చారు. వారు పార్టీ మారుతున్నారంటూ ఊహాగానాలు చెలరేగడంతో నలుగురూ వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. జిల్లాల్లో తమకు ఎదురవుతున్న ప్రొటోకాల్ సమస్యను వివరించేందుకే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశామని, ఇందులో రాజకీయ ప్రాధాన్యం ఏమీ లేదని పేర్కొన్నారు. ఇదే విషయమై ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డికి కూడా వినతి పత్రం ఇచ్చామన్నారు. ఈ అంశంపై అనవసర ఊహాగానాలు సృష్టించొద్దని కోరారు. ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి ఎలా కలిశారో.. తామూ అలాగే ఆయనను కలిశామని పేర్కొన్నారు. అయినా, ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో వారు ముఖ్యమంత్రిని కలవడంతో పార్టీ మార్పు ఊహాగానాలు కొనసాగుతున్నాయి.

కేసీఆర్‌ను అడిగే వెళ్లారా..?

నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను కలిసే ముందు.. పార్టీ అధినేత కేసీఆర్‌ను గానీ.. ముఖ్య నాయకులను అడిగారా? అనుమతి తీసుకోకుండానే వెళ్లి ఉంటారా..? అన్న దానిపై అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ ఎమ్మెల్యేలు సీఎంను కలవడం పార్టీకి ఇబ్బంది కలిగించే అంశమని బీఆర్ఎస్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వం చేసిన అవినీతిపై కాంగ్రెస్ సర్కారు కఠినంగా వ్యవహరించనుందనే ఉద్దేశంతో ముందుగానే ఆ పార్టీ టచ్‌లోకి వెళ్లేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారా? అని రాజకీయ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి.

కాంగ్రెస్‌లోకి పట్నం..?

బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారంటూ రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఆయన టచ్‌లో ఉన్నారని, పార్టీలో చేరగానే ఆయనకు చేవెళ్ల ఎంపీ టికెట్ కట్టబెట్టే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. నిజానికి, అసెంబ్లీ ఎన్నికలకు ముందే మహేందర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరతారని తెలుసుకొని పార్టీ అధిష్ఠానం పిలిపించుకొని ఆయనకు మంత్రి పదవి కట్టబెట్టింది. ఇప్పుడు అధికారం కోల్పోయిన నేపథ్యంలో మళ్లీ కాంగ్రెస్ వైపు దృష్టి సారించారని సొంత పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు.



ఈ నెల పాత పింఛనే!

- రూ.4 వేలకు పెంచడంపై కొనసాగుతున్న కసరత్తు
- బడ్జెట్ అంచనాలను రూపొందించిన ఆయా శాఖలు

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆసరా పింఛనుదారులకు ఈ నెల కూడా పాత పింఛను మొత్తమే అందనుంది. ప్రస్తుతం సాధారణ పింఛను కింద రూ.2016, దివ్యాంగులకు రూ.3,016 ఇస్తున్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా.. వీటిని రూ.4.000, రూ.6,000కు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక ఈ మేరకు కసరత్తు సాగిస్తోంది. అయితే, ఎప్పటినుంచి అమలు చేస్తారు? అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. కాగా, డిసెంబరు 25 నుంచి 31 మధ్య ఆయా జిల్లాల పరిధిలో పింఛను లబ్ధిదారులకు రూ.2016, రూ.4 వేల చొప్పున జమ చేశారు. ఈసారీ ఇంతే అందనుంది. మరోవైపు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే పింఛనును ఒక నెల ఆలస్యంగా ఇస్తూ వచ్చారు. ఇప్పుడు కూడా డిసెంబరు మొత్తాన్ని జనవరి నెలాఖరులో జమ చేయనున్నారు. ఇక పింఛను పెంపుపై సంబంధిత విభాగాలు ఇప్పటికే బడ్జెట్ అంచనాలను రూపొందించాయి. అయితే, కొత్తవారికి, ఇప్పటికే అందుతున్నవారికి ఒకేసారి పెంచుతారా? లేక విడివిడిగానా? అనేది స్పష్టత రావాల్సి ఉంది. రాష్ట్రంలో 15,98,729 మంది వృద్ధులు, 15,60,707 మంది వితంతువులు, 5,03,613 మంది దివ్యాంగులు, 4,24,585 మంది బీడీ కార్మికులు, 1,42,394 మంది ఒంటరి మహిళలు, 65,307 మంది గీత కార్మికులు, 37,145 మంది చేనేత కార్మికులు, హెచ్ఐవీ బాధితులు 35,998 మంది పింఛను పొందుతున్నారు. ప్రతి నెల దాదాపు రూ.900 కోట్లను వీరికి పింఛను కింద చెల్లిస్తున్నారు. కాంగ్రెస్ హామీ ప్రకారం పింఛనును రెట్టింపు చేస్తే అది రూ.1,800 కోట్లు కానుంది. ఇటీవలి ప్రజా పాలనలో 24.80 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే ఉన్న 43,96,667 మంది పింఛనుదారులతో పాటు కొత్త దరఖాస్తులను ఆమోదిస్తే సంఖ్య 69 లక్షలకు చేరనుంది.

రహదారికీ రైతుబంధు!

70 ఏళ్ల క్రితం పట్టా, ప్రభుత్వ భూముల్లో హైదరాబాద్-శ్రీశైలం రహదారి నిర్మాణం

- రోడ్డు నిర్మాణంలో పోయిన పట్టా భూమి
- రికార్డుల్లో పేరు తొలగించని అధికారులు
- ఇలా 200 ఎకరాలు ఇంకా రైతుల పేరిటే!
- ఈ భూములకు ఏళ్లుగా రైతుబంధు
- భూమి తగ్గిందంటూ రైతుల గొడవలు
- సమస్యను గుర్తించని అధికారులు



హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

ఆమనగల్లు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో రహదారి నిర్మించిన భూమికీ రైతుబంధు అందుతోంది. ఏళ్లుగా ఈ తంతు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. దాంతో ధరణి పోర్టల్‌లో చూపిస్తున్న మేరకు భూమి విస్తీర్ణం క్షేత్రస్థాయిలో లేకపోవడం రైతుల మధ్య గొడవలకు కారణమవుతోంది. ఆన్‌లైన్ రికార్డుల ఆధారంగా కొందరు రోడ్డు భూములు కొని మోసపోతున్న ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వం కూడా రోడ్లు నిర్మితమైన వందల ఎకరాలకు రైతుబంధు ఇస్తోంది. రంగారెడ్డి జిల్లా కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో ఈ సమస్య చోటుచేసుకుంది. ఇటీవల ఆమనగల్లులో ఓ రైతు తన భూమి తక్కువగా ఉందని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ సమస్య వెలుగుచూసింది. కడ్తాల్‌లో సర్వే నంబరు 5, 8, 9, 10, 11, 12, 16, 17, 18, 629, 634, 667, 894లలో, ఆమనగల్లు మండలంలో సర్వే నంబరు 1439, 1440లలో ఈ సమస్య ఉన్నట్లు గుర్తించారు. ఈ సర్వే నంబర్ల గుండా 1950-60లో హైదరాబాద్-శ్రీశైలం రహదారి నిర్మించారు. ఇలాగే అనేక మండలాల్లోనూ పట్టా భూముల గుండా రోడ్డు వెళ్లినా రైతులకు రైతుబంధు ఇచ్చేస్తున్నారు. అప్పట్లో ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో సింగిల్ రోడ్డు వేశారు. కాలక్రమేణా పెరిగిన రద్దీ దృష్ట్యా డబుల్ రోడ్డుగా విస్తరించారు. 2015-16లో హైదరాబాద్-శ్రీశైలం రహదారిని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) స్వాధీనం చేసుకుంది. 765వ నంబరు జాతీయ రహదారిగా విస్తరించింది. అయితే 70 ఏళ్ల క్రితం పట్టా భూములు, ప్రభుత్వ భూముల మీదుగా నిర్మించిన రహదారికి సంబంధించి నిర్వాసితులకు పరిహారం ఇవ్వలేదు. దీంతో రోడ్డు నిర్మాణంలో రైతులు కోల్పోయిన భూమిని వారి పేరు మీద నుంచి తొలగించలేదు. అనంతర కాలంలో రైతులకు పరిహారం ఇచ్చినా రికార్డులను సరిచేయకపోవడం సమస్యకు కారణమైంది. తాతల, తండ్రుల నాటి రికార్డుల ఆధారంగా 2020లో ధరణిలో ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి కొత్త పాస్ బుక్‌లు జారీ చేశారు. కడ్తాల్ మండలం ముచ్చర్ల గేటు నుంచి ఆమనగల్లు మండలం మేడిగడ్డ గేటు వరకు హైదరాబాద్-శ్రీశైలం రోడ్డు భూమి కూడా రైతుల ఖాతాల్లో జమై ఉండడంతో వారు రైతుబంధులో ఆర్థిక సహాయం తీసుకుంటున్నారు. అప్పట్లో ఎక్కువ ధర లేక తమ భూమి మీదుగా రోడ్డు వేస్తున్నా రైతులు పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎకరా రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్లు పలుకుతుండడంతో భూ వివాదాలు తీవ్రమయ్యాయి. రికార్డుల్లో భూములు ఉన్నా క్షేత్రస్థాయిలో విస్తీర్ణం తక్కువగా ఉండడంతో రైతుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. సర్వే చేయిస్తే రోడ్డు నిర్మాణంలో తమ భూమి పోయినట్లు తేలుతున్నా రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం లేదు. రికార్డుల్లో భూ విస్తీర్ణాన్ని కట్ చేస్తారనే తెలియజేయడం లేదు. 'నా భూమి నీ పొలంలో కలిసిందంటూ పొరుగు రైతులతో గొడవలు పడుతున్నారు. 70 ఏళ్ల క్రితం రోడ్డుకు సేకరించిన భూములను రైతుల అకౌంట్లో కట్ చేయకపోవడమే దీనికంతటికీ కారణమైంది. ప్రభుత్వం సైతం ఏడేళ్లుగా భూమి పోయిన రైతులకూ రైతుబంధు ఇస్తోంది. ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో సుమారు 200 ఎకరాలు ఇలా రోడ్డు భూమి రైతుల పేరిట ఉంది. ఇప్పటి వరకు రూ.కోట్లలో రైతుబంధు తీసుకున్నారు. దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి, సమస్య పరిష్కరించాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

విచారణ జరిపిస్తాం



హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి భూవిని సర్వే చేస్తాం. పట్టా భూమిలో రోడ్డు ఉన్నా రికార్డుల్లో రైతు పేరిటే ఉన్నట్లు ఇటీవల ఓ రైతు ఫిర్యాదుతో మాకు తెలిసింది. ఈ విషయమై విచారణ చేస్తాం. రోడ్డు ఉన్న భూమి రైతుల పేరిట ఉంటే తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. 1970కి ముందు చేపట్టిన రోడ్డుకు సంబంధించి అప్పట్లో రైతులకు పరిహారం చెల్లించిన విషయం మాకు తెలియదు.

-లలిత, తహసీల్దార్, ఆమనగల్లు

కృష్ణాబోర్డును విశాఖకు తరలించలేం

- ప్రత్యామ్నాయంగా విజయవాడను పరిశీలించాలి
- కేంద్రానికి కృష్ణానదీ యాజమాన్య బోర్డు నివేదన
- జగన్ సర్కారుకు ఎదురుదెబ్బ

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కృష్ణా బోర్డును విశాఖపట్నానికి తరలించాలనే జగన్ ప్రభుత్వ ప్రతిపాదనపై కృష్ణానదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) విముఖత వ్యక్తం చేసింది. తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా బేసిన్‌లోని ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణ కోసమే ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014తో కృష్ణాబోర్డును కేంద్రం ఏర్పాటు చేసింది. గోదావరి బోర్డు హైదరాబాద్‌లో ఉంటే.. కృష్ణా బోర్డు ఏపీలో ఉండాలి. అయితే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన చేయడమే కాకుండా కార్యనిర్వాహక రాజధానిగా విశాఖపట్నాన్ని ప్రతిపాదించింది. కృష్ణాబోర్డును కూడా విశాఖకు తరలించాలని బోర్డుపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెంచింది. అయితే తాజాగా కేంద్ర జలశక్తి శాఖ వద్ద జరిగిన సమావేశంలో ఈ ప్రతిపాదనను బోర్డు ఛైర్మన్ శివ్‌నందన్‌కుమార్ తీవ్రంగా వ్యతిరేకించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడతాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ విశాఖకు బోర్డును తరలించలేమని స్పష్టం చేశారు. సాగర్ నుంచి విశాఖ 550 కిలోమీటర్లు, శ్రీశైలం నుంచి 650 కిలోమీటర్ల దూరంలో ఉన్నందున అక్కడకు బోర్డు తరలింపు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని నివేదించారు. విజయవాడకు తరలించే ప్రతిపాదనలు పరిశీలించాలని కేంద్రాన్ని కోరారు. ఇక కృష్ణాబోర్డులో ఛైర్మన్, సభ్యులు మినహా మిగిలిన ఉద్యోగులంతా తెలుగు రాష్ట్రాల నుంచి చెరి సగం చొప్పున ఉంటారు. విశాఖకు తరలింపు ప్రతిపాదనతో వీరిలో సగానికి పైగా ఉద్యోగులు బోర్డును వీడే ఆలోచనలో ఉన్నారు. అదే జరిగితే భవిష్యత్తులో సమస్యలు ఉత్పన్నమవుతాయనే ఆందోళన కూడా బోర్డుకు ఉంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ కృష్ణాబోర్డు తాత్కాలిక నిర్వహణలో ఉండగా.. ఈ నెల 8న బోర్డు అధికారులే గేట్లను ఎత్తి ఏపీకి నీటిని వదిలారు. నిర్దేశిత మొత్తంలో నీరు విడుదల కాగానే గేట్లను వారే దించారు. ఈ క్రమంలో బోర్డును విశాఖకు తరలిస్తే రవాణా ఖర్చులతో పాటు ఉద్యోగుల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఉంటాయన్న అభిప్రాయాన్ని అధికారులు వ్యక్త చేస్తున్నారు. విజయవాడ కృష్ణా బేసిన్‌లోనే ఉండటంతో ప్రాజెక్టులపై పర్యవేక్షణకు అనుకూలంగా ఉంటుందని గుర్తించింది. ఆ కారణంగానే విజయవాడకు కార్యాలయ తరలింపుపై కేంద్రానికి నివేదించింది. ఈ పరిణామాలు జగన్ ప్రభుత్వానికి మింగుడు పడేలా లేవు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బీఈడీ

హైదరాబాద్‌లోని డా.బీ.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బీఆర్ఏఓయూ)- బీఈడీ(ఓడీఎల్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనిని తెలుగు మాధ్యమంలో చదవాలి. అభ్యర్థులు మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్, సోషల్ సైన్సెస్ పెడగాగీలలో ఒకదాన్ని ఎంచుకోవాలి. తెలుగు రాష్ట్రాల్లో పది సెంటర్లు ఈ ప్రోగ్రామ్‌ని అందిస్తున్నాయి. ఒక్కో సెంటర్లో 50 సీట్లు చొప్పున మొత్తం 500 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌నకు యూజీసీ, ఎన్‌సీటీఈ గుర్తింపులు ఉన్నాయి.



ప్రోగ్రామ్ సెంటర్లు

- ఆంధ్ర మహిళ సభ కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్, హైదరాబాద్
- గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్, హన్మకొండ, వరంగల్
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్, ఆంధ్ర యూనివర్సిటీ, విశాఖపట్నం
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ ఎడ్యుకేషన్, కర్నూలు
- ఏఎల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, బ్రాడిపేట్, గుంటూరు
- గురజాడ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, మునసబ్‌పేట్, శ్రీకాకుళం
- బ్రౌన్స్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఖమ్మం
- ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అండ్ ఎగ్జిబిషన్ సొసైటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, పరిగి, వికారాబాద్
- అన్నమాచార్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, రాజంపేట, కడప
- వాణి నికేతన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ముకరంపుర, కరీంనగర్

అర్హత


- గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో బీఏ/బీకాం/బీఎస్సీ/బీసీఏ/బీఎస్సీ-హోం సైన్స్/బీబీఎం/బీబీఏ/బీఈ/ బీటెక్/ఎంఏ/ఎంకాం/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్‌లోని పెడగాగీని అనుసరించి ఇంటర్/డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్/ఫిజికల్ సైన్సెస్ అలైడ్ మెటీరియల్ సైన్సెస్/బయలాజికల్ సైన్సెస్/సోషల్ సైన్సెస్ చదివి ఉండాలి. అభ్యర్థులు 2023 జూలై నాటికి డిగ్రీ/పీజీ పూర్తిచేసి ఉండాలి.
- ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో ఇన్ సర్వీస్ టీచర్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్ లేదా ఎన్‌సీటీఈ గుర్తింపు పొందిన టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఫేస్ టు ఫేస్ మోడ్‌లో పూర్తిచేసి ఉండాలి.
- అభ్యర్థుల వయసు 2023 జూలై 1 నాటికి 21 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.
- ఎంబీబీఎస్/బీడీఎస్/బీపీటీ/బీఏఎంఎస్/బీఎల్/ఎల్ఎల్‌బీ/బీఫార్మసీ/బీహెచ్ఎంటీ/బీవీఎస్సీ/బీఎస్సీ అగ్రికల్చర్/బీఏ లాంగ్వేజెస్/బీఓఎల్/ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చేసినవారు; డిప్లొమా(ఈసీఈ/పీఎస్ఈ) ఉత్తీర్ణులు; ప్రీ ప్రైమరీ టీచర్ ట్రెయినింగ్ సర్టిఫికెట్/డిప్లొమా(పీపీటీటీసీ) పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: పరీక్షని సీబీటీ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ ఇంగ్లీష్ కాంప్రహెన్షన్ నుంచి 25, రెండో పార్ట్‌లో ప్రొఫిషియెన్సీ ఇన్ తెలుగు నుంచి 25, మూడో పార్ట్‌లో జనరల్ మెంటల్ ఎబిలిటీ నుంచి 50 చొప్పున మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం పూర్తిగా తెలుగు మాధ్యమంలో మాత్రమే ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 35 మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.40,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 21
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మార్చి 1 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, కర్నూలు
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** మార్చి 5
- **ప్రిలిమినరీ కీ విడుదల:** మార్చి 7
- **ర్యాంక్ కార్డ్ డౌన్‌లోడింగ్:** మార్చి 15 నుంచి
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** మార్చి చివరి వారంలో
- **వెబ్‌సైట్:** www.braouonline.in

వెల్లూరు ఇన్‌స్టిట్యూట్‌లో ఎంసీఏ, ఎంటెక్



వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ)- ఎంసీఏ, ఎంటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. వెల్లూరు, చెన్నై, భోపాల్ క్యాంపస్‌లలో ఈ రెండు ప్రోగ్రామ్‌లు; ఏపీ క్యాంపస్‌లో ఎంటెక్ ప్రోగ్రామ్ అందుబాటులో ఉన్నాయి. సంస్థ నిర్వహించే మాస్టర్స్ ఎంట్రెన్స్ టెస్ట్(వీఐటీఎంఈఈ) 2024, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. గేట్ అర్హత ఉన్నవారికి ఏఐసీటీఈ స్కాలర్‌షిప్ లభిస్తుంది.

ఎంటెక్ స్పెషలైజేషన్‌లు: బయోటెక్నాలజీ, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, సీఎస్ఈ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్/బిగ్ డేటా అనలిటిక్స్/ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ/సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్), ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్, బయోమెడికల్ ఇంజనీరింగ్, ఇంటెలిజెంట్ కమ్యూనికేషన్ సిస్టమ్స్, ఐఓటీ అండ్ సెన్సార్ సిస్టమ్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, వీఎల్ఎస్ఐ డిజైన్, కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, అప్లయిడ్ కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్, క్యాడ్/క్యామ్, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్, మెకట్రానిక్స్, స్మార్ట్ మొబిలిటీ

అర్హత వివరాలు: ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఎస్సీ(సీఎస్)/బీసీఏ/బీఎస్సీ(ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్/డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- ఎంటెక్ ప్రోగ్రామ్‌నకు సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. స్పెషలైజేషన్‌ను అనుసరించి ఎంబీబీఎస్/ఎమ్మెస్సీ(అగ్రికల్చర్)/ఎంవీఎస్సీ/ఎంసీఏ/ఎంఎస్ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వీఐటీఎంఈఈ 2024: పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇందులో అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. ఎంటెక్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో టెక్నికల్ సబ్జెక్ట్ నుంచి 80, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ఎంసీఏలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో మేథమెటిక్స్, కంప్యూటర్ సంబంధిత అంశాలనుంచి 80; ఇంగ్లీష్ కమ్యూనికేషన్ అంశాల నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు.

- **ఎంటెక్ టెక్నికల్ సబ్జెక్టులు:** బయో మెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, బయోటెక్నాలజీ, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మసీ, ఫిజిక్స్

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 28
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అమరావతి, విశాఖపట్నం, అనంతపురం, నెల్లూరు, తిరుపతి, హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్
- **వీఐటీ ఎంఈఈ 2024 తేదీ:** మే 5
- **ఫలితాలు విడుదల: ఎంటెక్‌నకు మే 15న;** ఎంసీఏకు మే 17
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్:** ఎంటెక్‌నకు మే 15 నుంచి 17 వరకు; ఎంసీఏకు మే 17, 18
- **సీట్ల కేటాయింపు:** ఎంటెక్‌నకు మే 27న; ఎంసీఏకు మే 29న
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఎంసీఏకు జూన్ 10; ఎంటెక్‌నకు జూన్ 21
- **వెబ్‌సైట్:** www.vit.ac.in

జాబ్ కార్నర్


టీఎస్‌ఆర్టీసీలో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్‌ఆర్టీసీ)... రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ టీఎస్‌ఆర్టీసీ రీజియన్లు(డిపో/యూనిట్)లో నాన్ ఇంజనీరింగ్ విభాగంలో అప్రెంటిస్ శిక్షణకు ప్రకటన విడుదల చేసింది.

మొత్తం ఖాళీలు: 150

రీజియన్, ఖాళీల వివరాలు

1. హైదరాబాద్ రీజియన్: 26
2. సికింద్రాబాద్ రీజియన్: 18
3. మహబూబ్‌నగర్ రీజియన్: 14
4. మెదక్ రీజియన్: 12
5. నల్లగొండ రీజియన్: 12
6. రంగారెడ్డి రీజియన్: 12
7. ఆదిలాబాద్: 9
8. కరీంనగర్: 15
9. ఖమ్మం: 9
10. నిజామాబాద్: 9
11. వరంగల్: 14



అర్హత: బీకాం, బీఎస్సీ, బీఏ, బీబీఏ, బీసీఏ కోర్సు 2018, 2019, 2020, 2021, 2022, 2023 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 21 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి

శిక్షణ వ్యవధి: మూడేళ్లు **స్టయిపెండ్:** మొదటి, రెండు, మూడు సంవత్సరాలకు వరుసగా నెలకు రూ.15,000, రూ.16,000, రూ.17,000 చెల్లిస్తారు.

ఎంపిక విధానం: విద్యార్హతలు, ధ్రువపత్రాల పరిశీలన, స్థానికత, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం: దరఖాస్తు సమర్పణకు ముందు http://www.nats.education.gov.in/ వెబ్‌సైట్‌లో అభ్యర్థులు వివరాలను నమోదు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 16

వెబ్‌సైట్: https://www.tsrtc.telangana.gov.in/

ఎన్‌ఎండీసీలో మేనేజర్లు

హైదరాబాద్‌లోని ఎన్‌ఎండీసీ సీఎస్ఆర్ ఫౌండేషన్... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 16

1. హెడ్-ఎన్‌ఎండీసీ సీఎస్ఆర్ ఫౌండేషన్: **1 పోస్టు**
2. ప్రాజెక్ట్ మేనేజర్: **1 పోస్టు**
3. మానిటరింగ్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫీసర్: **1 పోస్టు**
4. ఆఫీస్ మేనేజర్: **1 పోస్టు**
5. డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్లు: **7 పోస్టులు**
6. బ్లాక్ కో ఆర్డినేటర్లు: **5 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో సీఏ/డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31 **వెబ్‌సైట్:** www.nmdc.co.in/

SCHOLARSHIP ALERT

Technip Energies India Scholarship Program

Description: Technip Energies India invites applications from female students coming from Delhi NCR (Ghaziabad, Noida, Gurugram, Faridabad), Bihar, Assam, Rajasthan, Tamil Nadu, Gujarat and Maharashtra who are currently enrolled in the first-year of B.E./B.Tech. courses.

Eligibility: Open for female students from Delhi NCR (Ghaziabad, Noida, Gurugram, Faridabad), Bihar, Assam, Rajasthan, Tamil Nadu, Gujarat and Maharashtra.

- Applicants must be currently enrolled in the first-year of B.E./B.Tech. (Chemical, Electrical, Civil, and Mechanical Engineering) courses.
- Must have scored 70% or more marks in Class 12.
- Annual family income of the applicant must not be more than INR 4,00,000 from all sources.

Prizes & Rewards: INR 30,000

Last Date: 31-01-2024 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/TSPSS4

Disha Scholarship Program

Description: An initiative of Birlasoft to offer financial assistance and support to individuals, facilitating their educational pursuits and ensuring the successful completion of their academic journey.

Eligibility: Only Female students

- Students domiciled in Delhi NCR or Pune enrolled in the first year of General/Professional Undergraduate courses at premier NIRF institutions or accredited universities and colleges across India.
- Candidates must have 75% in aggregate or an equivalent CGPA in the Grade 12 board examination in the previous academic year from Delhi NCR and Pune, Maharashtra.
- The annual family income of the applicants from all sources must not exceed INR 5 lakh.
- Applicants must fall within the age bracket of 17 to 29 years.


Prizes & Rewards: Up to INR 25,000 annually

Last Date to Apply: 05-02-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/SSPSP1

Colgate Keep India Smiling Scholarship Programme



Description: An initiative of Colgate-Palmolive (India) Limited to provide financial assistance and support to individuals who are deserving and meritorious but may lack the resources to pursue their dreams.

Eligibility: Indian students who are currently enrolled in any year of the BDS (Bachelor of Dental Surgery) course in a recognised government or private institute in Maharashtra, Goa, Gujarat, Himachal Pradesh, and Andhra Pradesh. Applicants must have scored at least 60% marks in Class 12. The annual family income of the applicants from all sources must not exceed 8 lakh.

Prizes & Rewards: Financial assistance of 75,000 ***Last Date to Apply:*** 31-01-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/KSSI3

buddy4study.com

లిటిల్స్



మీకు తెలుసా?


- రెక్కలు ఆలివ్ రంగులో ఉండి ఎమరాల్డ్ గ్రీన్ ఉండే ఈ పక్షి పేరు 'కియ'. ఇది చిలుక జాతికి చెందినది. ఈ జాతి న్యూజిలాండ్‌లో ఉంటుంది.
- మగ పక్షుల ముక్కు 4.5 సెం.మీ. ఉంటుంది. ఆడ పక్షుల ముక్కు చిన్నగా ఉంటుంది. ఇవి ఇతర పక్షుల గొంతును కూడా అనుకరిస్తాయి. కియ పక్షి ప్రపంచంలోనే స్మార్టెస్ట్.
- 48 సెం.మీ. పొడవు ఉంటే ఈ కియా పక్షి వింగ్ స్పాన్ 52 సెం.మీ. వీటి సంఖ్య 7 వేల వరకూ ఉంటాయి.
- ఇవి అడవులతో పాటు పార్కుల్లో, ఇళ్లలో నివసిస్తాయి.
- ఇవి మనుషులతో క్లోజ్‌గా ఉంటాయి. పైగా కారు తాళం చెవులు, కళ్లజోళ్లు, కెమెరా లెన్సులను అద్భుతంగా అర్థం చేసుకుంటాయి. వాటిని కనుక్కుంటాయి.
- గింజలు, పండ్లు, పురుగులను ఆహారంగా తీసుకుంటాయి.
- ఈ పక్షుల జీవనకాలం ఇరవయ్యేళ్లు. కొన్ని ముప్పయ్యేళ్లు కూడా




జీవిస్తాయి.

- వీటి గుంపులో కనీసం 13 పక్షులు ఉంటాయి. ఇవి తెలివైనవి కాబట్టి ఇళ్లలో వస్తువులను పాడుచేస్తాయి.
- రెండు నుంచి ఐదు గుడ్లను మాత్రమే పెడతాయి. పొదిగే కాలం 14 రోజులు.

దారి కనుక్కోండి



చుక్కలు కలపండి



5 తేడాలను గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 211

	3				7		5	1
	8		6		9		3	2
						6		
			5			4	6	8
2	6	8			1			
		5						
8	1		9		3		4	
7	4		8				9	

సుడోకు - 210 సమాధానం

4	2	1	9	8	5	6	3	7
6	8	5	1	7	3	9	4	2
7	3	9	2	4	6	5	8	1
1	5	4	8	6	9	2	7	3
3	7	6	5	2	4	1	9	8
8	9	2	7	3	1	4	5	6
9	1	8	3	5	2	7	6	4
2	6	7	4	9	8	3	1	5
5	4	3	6	1	7	8	2	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.